www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సునీతా విలియమ్స్ రాకకు మార్గం సుగమం

ఐఎస్ఎస్‌తో అనుసంధానమైన స్పేస్ ఎక్స్ వ్యోమ నౌక 2

నలుగురు వ్యోమగాములను తీసుకువెళ్లిన క్రూ డ్రాగన్-10

సునీత, విల్మోర్‌లతో 20న తిరిగి భూమ్మీదకు వచ్చే అవకాశం


ఐఎస్ఎస్‌లో సునీతా విలియమ్స్ తదితర వ్యోమగాములు

సోమవారం | 17-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 348 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా.7.33 తదుపరి చవితి, నక్షత్రం: చిత్త మ.2.47 తదుపరి స్వాతి; వర్జ్యం: రా.9.06-10.54; అమృతఘడియలు: ఉ.7.34-9.22; దుర్ముహూర్తం: మ.12.47-1.35, మ.3.10-3.58; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.25, సూర్యాస్తమయం: 6.21 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అసెంబ్లీకి వర్గీకరణ బిల్లు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే మరో రెండు బిల్లులు కూడా..

నేడు శాసనసభలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

వర్గీకరణపై నేడే చర్చించి, ఆమోదించే చాన్స్

బీసీలకు గంపగుత్తగానే రిజర్వేషన్ల పెంపు?

బీసీ ఎమ్మెల్యేలతో భేటీ కానున్న మంత్రి పొన్నం

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులను ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టనుంది. ఎస్సీ వర్గీకరణ బిల్లును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీసీ బిల్లులను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టనున్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి.. రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే స్పష్టత ఉండడంతో ఆ బిల్లుపై సోమవారమే చర్చించి, ఆమోదించే అవకాశం కూడా ఉన్నట్లు సమాచారం. ఎస్సీల వర్గీకరణ కోసం ఏర్పాటైన ఏకసభ్య కమిషన్ రాష్ట్రంలోని 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించి ఆయా గ్రూపుల వారీగా 15 శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది. గ్రూప్-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, అత్యంత వెనుకబడిన, పట్టించుకోని కులాలను చేర్చి, వారికి 1 శాతం.. గ్రూప్-2లో మధ్యస్థంగా లబ్ధిపొందిన షెడ్యూల్ కులాలను చేర్చి, వారికి 9 శాతం, గ్రూప్-3లో మెరుగైన ప్రయోజనం పొందిన కులాలను చేర్చి, వారికి 5 శాతం రిజర్వేషన్లను కేటాయించి, నివేదికను ప్రభుత్వానికి అందించింది. ఆ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 14వ పేజీలో...





పోడుకు ప్రాణ జలం

రూ.12,600 కోట్లతో గిరిజనులకు సాగునీరు

పోడు భూములకు 'ఇందిర గిరి జల వికాసం'

6 లక్షల ఎకరాల్లో బోర్లు.. సోలార్ పంపు సెట్లు

రాష్ట్రంలో నాలుగేళ్లలో దశలవారీగా పథకం 12

కేంద్ర పథకాల నిధులూ వాడుకోనున్న సర్కారు





స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి; హాజరైన ప్రజలు

> ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా.. గ్యారెంటీలను అమలు చేస్తున్నాం. కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణిస్తే ఆర్టీసీకి రూ.5 వేల కోట్లు చెల్లించాం. 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందిస్తున్నాం.
>
> - సీఎం రేవంత్

తాగుబోతోడు
జాతిపితా?

లక్ష కోట్లు దోచుకున్నోడు.. టీవీ, పేపర్లు పెట్టినోడు.. ప్రజల రక్తం తాగినోడు జాతిపిత ఎట్లయితడు?

మహాత్ముడికి.. మందు లేనిదే లేవని కేసీఆర్‌కు పోలికా?

తెలంగాణ జాతిపిత.. కొండా లక్ష్మణ్ బాపూజీ, జయశంకర్

పదేళ్లలో కేసీఆర్ రూ.8.29 లక్షల కోట్ల అప్పులు చేస్తే..

15 నెలల్లో రూ.1.53 లక్షల కోట్ల అసలు, మిత్తి కట్టాం

కాంగ్రెస్ ప్రాజెక్టులపై దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి

బీఆర్ఎస్ నిర్మించింది కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం

సభకు రానోనికి విపక్ష హోదా.. 55 లక్షల జీతమెందుకు?

క్యాపిటల్‌తో కోట్లు సంపాదించే విద్య ప్రజలకూ చెప్పాలి

స్టేషన్ ఘన్‌పూర్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

ఇక అప్పులు చేయం.. ఆదాయాన్ని పెంచి, రాష్ట్ర ప్రజలందరికీ పంచుతామని వెల్లడి

వరంగల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాగుబోతోడు జాతిపిత అయితడా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణను జలగల్లాగా పీడించుకొని, ప్రజల రక్తం తాగినోడెవ్వడూ తెలంగాణకు జాతిపిత కారని అన్నారు. ఆదివారం జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో రూ.800 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన సభలో ఆయన మాట్లాడారు. 'ఇక్కడున్న ప్రజలను అడుగుతున్నా.. ఎవడయ్యా జాతిపిత? తాగుబోతోడు జాతిపిత అయితడా?' అని మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణకు జాతిపిత అట. మిత్రులారా.. మన జాతిపిత గురించి మీకు తెలుసు కదా? జాతిపితకు మందు వాసన పడతదా? గుజరాత్‌లోనే మందు బంద్ పెట్టించిండు. జాతిపిత గాంధీజీ ఆశ్రమాల్లో ఉన్నారు. మరి ఈ జాతిపిత వాసన లేకుండా నిద్ర లేస్తడా? ఆయన చిన్నచిన్న దళిత వాడల్లో గడిపితే.. ఈయన వందల ఎకరాల ఫాంహౌస్‌లో ఉంటున్నడు. ఈయన జాతిపిత ఎట్లయితడని నేను అడుగుతున్నా. జాతిపిత అంటే ఎవరు? ఏ పదవి లేకున్నా.. ఈ దేశం కోసం, స్వాతంత్ర్యం కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం సర్వం ధారపోసిన కొండా లక్ష్మణ్ బాపూజీనో.. ప్రొఫెసర్ జయశంకరో అవుతరు. అంతేకానీ, నోరు తెరిస్తే అబద్ధాలు చెప్పేటోడు.. తెలంగాణను దోచుకున్నోడు.. వందల ఎకరాల్లో ఫాంహౌస్‌లు కట్టుకున్నోడు.. లక్ష కోట్ల రూపాయలు సంపాదించుకున్నోడు.. టీవీలు, పేపర్లు పెట్టుకుని

మిగతా 13వ పేజీలో...

ఫ్యాటీ లివర్‌ను
తేలిగ్గా తీసుకోవద్దు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నిర్లక్ష్యం చేస్తే కాలేయ క్యాన్సర్ ముప్పు

బీపీ, షుగర్, హృద్రోగాలకూ దారితీస్తుంది

శారీరక శ్రమ లేకపోవడం, ప్రాసెస్ ఆహారం, జన్యు కారణాలతోనూ వచ్చే ప్రమాదం

పెద్దగా ఖర్చు లేకుండా ఏఐ ద్వారా దీన్ని గుర్తించే విధానాన్ని మేం అభివృద్ధి చేశాం

పదేళ్ల తర్వాత వచ్చే ఆరోగ్య సమస్యలనూ జన్యు పరీక్ష ద్వారా గుర్తించే పరిజ్ఞానం

సెల్ డొనేషన్, జన్యుమార్పిడి జంతువులతో సులువు కానున్న అవయవమార్పిడి

రక్తపోటు, మధుమేహం, కుంగుబాటు వంటివాటికి మలం క్యాప్సూల్స్‌తో వైద్యం


వచ్చే 2-3 ఏళ్లలో విప్లవాత్మక వైద్యవిధానాలు

ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి

(హైదరాబాద్ సిటీ-ఆంధ్రజ్యోతి)

అందరూ శరీరానికి కేంద్రస్థానం గుండె అని అనుకుంటారు. కానీ.. అది కాలేయం అని.. అంతటి కీలకమైన అవయవానికి ఏమైనా సమస్యలొస్తే మొత్తం శరీరంపైనా ఆ ప్రభావం పడుతుందని.. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ (ఏఐజీ) ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. మరీ ముఖ్యంగా ఫ్యాటీ లివర్ సమస్య చాలా ప్రమాదకరమని, దాన్ని నిర్లక్ష్యం చేస్తే అది గుండెకు చేటు చేస్తుందని, అధిక రక్తపోటు, మధుమేహం తదితర ఎన్నో ఆరోగ్య సమస్యలకు కారణమవుతుందని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు. ఫ్యాటీ లివర్‌కు చికిత్స తీసుకోకపోతే కాలేయ క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉందని.. పెరుగుతున్న ఫ్యాటీ లివర్ కేసుల కారణంగా మనదేశం లివర్ క్యాన్సర్ రాజధానిగా మారుతోందని ఆందోళన

మిగతా 14వ పేజీలో...



ఏడాదికొకసారి ఆరోగ్య పరీక్షలు

క్యాన్సర్ వచ్చినట్టు తెలిస్తే.. 'అమ్మో' అని చికిత్స తీసుకుంటున్నారు. కానీ.. బీపీ, షుగర్ వంటి జీవనశైలి వ్యాధులు నిశ్శబ్దంగా తీవ్ర ప్రభావం చూపిస్తాయి. ఇది తెలియక చాలా మంది పట్టించుకోవట్లే. నా సలహా ఏంటంటే.. ఏడాదికి ఒకసారి సమగ్ర ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. అప్పుడు చాలా సమస్యలను మనం ముందే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు. ఆహారపుటలవాట్లను మార్చుకోవడం, మందుల వాడకం ద్వారా వాటిని అదుపులో ఉంచుకోవచ్చు.



తెలుగు విశ్వవిద్యాలయానికి.. పొట్టి శ్రీరాములు పేరును

కొనసాగించాలి

ఎన్టీఆర్, బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి పేర్లు తొలగించే దమ్ముందా?

అర్బన్ నక్సల్స్ చేతికి కులగణన నివేదిక

కేంద్ర మంత్రి బండి సంజయ్ 13

పాక్‌లో మిలిటరీ కాన్వాయ్‌పై దాడి

90 మంది సైనికుల మృతి? 2

మళ్లీ చెలరేగిన బలూచ్ వేర్పాటువాదులు

ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో వరుస దాడులు


ఆత్మహత్యకు పాల్పడిన నాగరాజు, భార్య (ఫైల్)

నలుగురు పిల్లల్ని అనాథలుగా వదిలి..

భార్యాభర్తల ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒకరి తర్వాత మరొకరు బలవన్మరణం 12

సిద్దిపేట జిల్లా ఎల్లారెడ్డిపేటలో విషాదం



తిట్ల పోటీ పెడితే
రేవంత్‌కే ఫస్ట్‌ప్రైజ్

అసలు నువ్వు మనిషివా? పశువువా?.. కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలి.. కాంగ్రెస్ మునుగేసుకున్న బీజేపీ వ్యక్తివి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ఆగ్రహం

కేటీఆర్‌తో విభేదాల్లేవని పునరుద్ఘాటన 12

రేవంత్‌ను గద్దె దించేందుకే పోటీపడుతున్నామని వ్యాఖ్య



బూతు పురాణానికి పేటెంట్ కేసీఆర్‌దే!

పదేళ్లలో ఆయన తిట్లతో పుస్తకమే రాయొచ్చు: చామల

బూతులకు బ్రాండ్ అంబాసిడర్.. కేసీఆర్: బీర్ల 13

రేవంత్‌కు.. కేసీఆర్‌కు తేడా ఏంటి?

అప్పులు, అసభ్య పదజాలంలో ఎవరు తక్కువ

కాంగ్రెస్ వచ్చాక తెలంగాణకు ఏం ఒరిగింది?: కిషన్‌రెడ్డి


పాడ్‌కాస్టర్, కంప్యూటర్ శాస్త్రవేత్త లెక్స్ ఫ్రీడ్‌మన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ

సద్విమర్శ.. ప్రజాస్వామ్య ఆత్మ!

ఆరోపణకు, విమర్శకు చాలా తేడా ఉంది

ఆర్ఎస్ఎస్.. జీవిత పరమార్థం తెలిపింది

ఎవరికైనా చావు తప్పదు.. భయపడకూడదు

గుజరాత్ అల్లర్ల విషయంలో నాపై దుష్ప్రచారం

కోర్టులు విచారణ జరిపి విముక్తి కల్పించాయి

ట్రంప్‌తో అనుబంధం.. మా ఇద్దరికీ దేశమే ఫస్ట్

'లెక్స్ ఫ్రీడ్‌మన్' షోలో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, మార్చి 16: నిర్మాణాత్మక సద్విమర్శ ప్రజాస్వామ్యానికి ఆత్మవంటిదని ప్రధాని మోదీ అన్నారు. సద్విమర్శను తాను స్వాగతిస్తానని చెప్పారు. అయితే ఆరోపణలకు, విమర్శలకు చాలా తేడా ఉందన్నారు. తప్పుడు ఆరోపణలు ప్రజాస్వామ్యానికి హానిచేస్తాయని చెప్పారు. ఆదివారం అమెరికన్

మిగతా 2వ పేజీలో...

సద్విమర్శ.. ప్రజాస్వామ్య ఆత్మ!

(మొదటిపేజీ తరువాయి)

పాడ్‌క్యాస్టర్, కంప్యూటర్ శాస్త్రవేత్త లెక్స్ ఫ్రీడ్‌మన్ నిర్వహించిన షోలో ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్, హిందూ జాతీయవాదం, పాకిస్థాన్‌తో శాంతియత్నాలు, తన పేదరికంలో సవాళ్లు, తండ్రి క్రమశిక్షణ, తల్లి త్యాగాలు మొదలైన అంశాలపై తన అంతరంగాన్ని సుదీర్ఘంగా మూడు గంటలపాటు వివరించారు. విమర్శలను తాను సహించనన్న విమర్శను ప్రధాని తోసిపుచ్చారు. సద్విమర్శలను స్వాగతిస్తానన్నారు. 'విమర్శ ప్రజాస్వామ్యంలో తప్పనిసరి. నిజంగా మీ నరనరాల్లో ప్రజాస్వామ్యం గనుక ఉంటే విమర్శను అక్కున చేర్చుకుంటారు. విమర్శ పదునుగా.. విజ్ఞానయుతంగా ఉండాలి. అయితే ప్రస్తుతం సద్విమర్శలు నాకు కనిపించడం లేదు. అసలైన విమర్శలో.. కూలంకష అధ్యయనం.. లోతైన పరిశోధన, నిండైన విశ్లేషణ ఉండాలి. ఇప్పుడు మీడియా ప్రతినిధులు షార్ట్‌కట్‌ల కోసం చూస్తున్నారు. సరైన పరిశోధన, విశ్లేషణ చేయడం లేదు. అందరినీ ఆకట్టుకునే శీర్షికల కోసం పదవిన్యాసాలు చేస్తున్నారు. మీరు (ఫ్రీడ్‌మన్) ప్రస్తావిస్తున్న ఉదాహరణలు ఆరోపణలే తప్ప విమర్శలు కావు. ఈ రెండింటి మధ్య చాలా తేడా ఉంది. ఆరోపణలతో ఎవరికీ ప్రయోజనం ఉండదు. అనవసర సంక్షోభాలకు అవి కారణమవుతాయి. ప్రస్తుత జర్నలిస్టుల్లో చాలా మంది హెడ్‌లైన్స్ కోసం ఆరోపణలు చేస్తున్నారు. తప్పుడు ఆరోపణలు వచ్చినా నా పనిపైనే దృష్టిపెడతాను. మౌనంగా, పూర్తి అంకితభావంతో దేశసేవ కొనసాగిస్తున్నాను' అని వివరించారు. ప్రధాని ఇంకా ఏం చెప్పారంటే...

ఆరెస్సెస్ వల్లే జీవిత పరమార్థం తెలిసింది

ఆరెస్సెస్ వల్లే నా జీవిత పరమార్థం తెలిసింది. మా స్వగ్రామంలో దాని శాఖ ఉండేది. అక్కడ ఆటలు ఆడేవాళ్లం. దేశభక్తి గీతాలు ఆలపించేవాళ్లం. ఆ గీతాలు నన్ను లోతుగా స్పృశించాయి. నా మనసును కదలించాయి. చివరకు ఆర్ఎస్ఎస్‌లో భాగమయ్యాను. "నువ్వు ఏం చేసినా దానికొక ప్రయోజనం ఉండాలి. చదువుతున్నప్పుడు.. దేశానికి అవసరమైనంత వరకు చదవాలి.. వ్యాయామం చేసేటప్పుడు కూడా.. మీ దేహదారుఢ్యం దేశసేవకు ఉపయోగపడేదిగా ఉండాలి" అని అక్కడ బోధించేవారు. ఇప్పుడు ఆర్ఎస్ఎస్ వందో సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఇంత పెద్ద స్వచ్ఛంద సంస్థ ప్రపంచంలో ఎక్కడా ఉనికిలోనే లేదు. అయితే ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవడం అంత సులువు కాదు. ఇలాంటి ఉన్నత సంస్థ నుంచి క్రమశిక్షణతోపాటు జీవిత పరమార్థాన్ని తెలుసుకోవడంతో నా జన్మ తరించిందని భావిస్తున్నాను.



పాడ్‌కాస్ట్‌కు ముందు ప్రధాని మోదీతో ఫ్రీడ్‌మన్ కరచాలనం

పేదరికాన్ని భారమనుకోలేదు..

మట్టి నేలతో ఉన్న ఒంటి గది ఇంట్లో పెరిగాను. కొరతలుండేవి.. బాధలు పడలేదు. ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ పేదరికాన్ని నా కుటుంబం భారంగా భావించలేదు. నా తండ్రి దామోదర్‌దాస్ మోదీ కష్టజీవి. కఠోర క్రమశిక్షణ పాటించేవారు. వేకువన నాలుగు, నాలుగున్న గంటలకే ఇంటి నుంచి వెళ్లేవారు. చాలా దూరం నడిచేవారు. గుళ్లను దర్శించుకుని తన దుకాణానికి చేరుకునేవారు. కిర్రుకిర్రుమనే లెదర్ చెప్పులతో గ్రామంలో తిరిగేవారు. ఆయన చెప్పుల శబ్దం విని జనం టైమెంతో చెప్పేవారు. మా తల్లిదండ్రులు పేదరికం భారం పిల్లలపై పడనివ్వలేదు. నేను గుజరాత్ సీఎం నయ్యేదాకా నా జీవితం గురించి పెద్దగా ఎవరికీ తెలియదు.

పాక్ నుంచి వెన్నుపోటు

ద్వైపాక్షిక సంబంధాల్లో నూతనాధ్యాయం కోసం.. 2014లో ప్రధానిగా తొలిసారి నా ప్రమాణ స్వీకారానికి నాటి పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించాను. ఆ దేశంతో శాంతి నెలకొల్పుకోవడానికి ప్రయత్నం చేసినప్పుడల్లా మనకు వెన్నుపోటు, శత్రుత్వమే ఎదురయ్యాయి. పాక్ నేతలు వివేకవంతులై శాంతి మార్గాన్ని ఎంచుకుంటారని చిత్తశుద్ధితో ఆశిస్తున్నాం. ఉగ్రవాదంతో అలసిపోయిన పాక్ ప్రజలు కూడా శాంతిని కోరుతున్నారని విశ్వసిస్తున్నాను. ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు నేను చేసిన ప్రయత్నం సద్భావనకు నిదర్శనం. ఇలాంటి దౌత్యయత్నం దశాబ్దాలుగా జరుగలేదు.

ఉక్రెయిన్ యుద్ధంతో ఎన్నో సమస్యలు..

రష్యా, ఉక్రెయిన్ రెంటితో భారత్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. ఇది యుద్ధాల శకం కాదని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు చెప్పాను. యుద్ధరంగంలో విజయాలు శాశ్వత శాంతిని ఇవ్వవని సోదరుడు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి కూడా సూచించాను. తన మిత్రపక్షాలతో ఉక్రెయిన్ ఎన్ని చర్చలు జరిపినా ఉపయోగం శూన్యం. రష్యా, ఉక్రెయిన్ మాత్రమే చర్చించుకోవాలి. తాజా పరిస్థితులు చర్చలకు అవకాశం కల్పిస్తున్నాయి.

ఎవరీ ఫ్రీడ్‌మన్?

లెక్స్ ఫ్రీడ్‌మన్ (41) తజికిస్థాన్‌లో జన్మించారు. ఆయనకు 11ఏళ్ల వయసులో కుటుంబం అమెరికా వెళ్లింది. ఆయన తండ్రి అలెగ్జాండర్ పూర్వ సోవియట్ యూనియన్‌లో ప్రసిద్ధ ప్లాస్మా ఫిజిసిస్టుల్లో ఒకరు. తర్వాత పెన్సిల్వేనియాలోని డ్రెక్సెల్ యూనివర్సిటీలో అధ్యాపకుడిగా పనిచేశారు. అక్కడే లెక్స్ ఫ్రీడ్‌మన్ అండర్ గ్రాడ్యుయేట్, డాక్టొరల్ డిగ్రీలు చేశారు. 2014, 15ల్లో గూగుల్‌లో మెషీన్ లెర్నింగ్ రీసెర్చర్‌గా పనిచేశారు. మెషీన్ లెర్నింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) కీలక విభాగం. దానిపై ఫ్రీడ్‌మన్‌కు అమితాసక్తి. టెస్లా సెమీ ఆటోమేటిక్ కార్లు నడిపేటప్పుడు డ్రైవర్ల ప్రవర్తన ఎలా ఉంటుందానే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఆటోమేటిక్ కార్లు నడుపుతున్నా డ్రైవర్లు పరిసరాలను గమనించుకుంటూ పోతున్నారని ఆయన అధ్యయనం లో తేలింది. ఇది కార్ల పరిశ్రమకు షాకిచ్చింది. 2018లో ఫ్రీడ్‌మన్ పాడ్‌కాస్ట్ ప్రారంభించారు. తన అధ్యయనాన్ని అందులో పంచుకోవడంతో టెస్లా అధినేత ఎలాన్ మస్క్ చర్చలకు ఆయన్ను ఆహ్వానించారు. దీంతో అనతికాలంలోనే ఆయన ప్రేక్షకాదరణ బాగా పెరిగింది. ట్రంప్, ఇజ్రాయెల్, అర్జెంటీనా ప్రధానులు బెంజమిన్ నెతన్యాహు, జేవియర్ మిలెయ్, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు మస్క్, మార్క్ జుకెర్‌బర్గ్, జెఫ్ బెజోస్, శామ్ ఆల్ట్‌మన్, మాగ్నస్ కార్ల్‌సన్ వంటి ప్రముఖులతో పాడ్‌కాస్ట్‌లో సంభాషించారు. ప్రధాని మోదీతో 3గంటల సుదీర్ఘ సంభాషణ.. తన జీవితంలోనే శక్తిమంతమైన సంభాషణగా పేర్కొంటూ ఫ్రీడ్‌మన్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మోదీ స్పందిస్తూ.. ఆయనతో ఆసక్తిదాయక సంభాషణ జరిగిందన్నారు.

మరణం అనివార్యం..

మరణం అనివార్యం.. జీవితం క్షణభంగురం. మరణం రాకముందే ఓ ప్రయోజనం కోసం బతకడం ముఖ్యం. నాయకుడికి తప్పనిసరిగా ఓ విజన్, దానిని అమలు చేసే ధైర్యం ఉండాలి. భిన్నత్వం, సంక్లిష్టత కలిగిన భారత్ వంటి దేశంలో నాయకత్వం అంటే కేవలం నిర్ణయాలు తీసుకోవడమే కాదు. ప్రతి నిర్ణయం జాతి ప్రయోజనంతో కూడుకున్నదై ఉండాలి. 21వ శతాబ్దం భారత్‌దే.

గుజరాత్ అల్లర్లపై తప్పుడు ప్రచారం

2002లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లపై తప్పుడు కథనాలు సృష్టించారు. కేంద్రంలోని నాటి నా రాజకీయ ప్రత్యర్థులు నన్ను శిక్షించాలని భావించారు. కానీ కోర్టులు నన్ను విముక్తి చేశాయి. 2002లో జరిగిన అల్లర్లే రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద ఘర్షణలుగా చూపేందుకు తప్పుడు సమాచారం వ్యాప్తిచేశారు. దానికి ముందు రాష్ట్రంలో తరచూ అల్లర్లు జరిగేవని తెలుస్తుంది. ఎక్కడో చోట కర్ఫ్యూలు ప్రకటించేవారు. 1969లో జరిగిన ఘర్షణలు 6 నెలలకుపైగా కొనసాగాయి. గుజరాత్ అసెంబ్లీకి నేను ఎన్నికైన మూడ్రోజులకే గోద్రాలో రైలు దహనం ఘటన జరిగింది. 1999లో కాందహార్ విమానం హైజాక్ ఘటన జరిగింది. 2000లో ఎర్రకోటపైన, మరుసటి ఏడాది పార్లమెంటుపైన దాడులు జరిగాయి. గోద్రా ఘటన అగ్నికణమై హింస ప్రజ్వరిల్లింది. ఈ వ్యవహారంలో తప్పుడు కథనాలు సృష్టించారు. వాటి ఆధారంగా నన్ను శిక్షించాలని నాడు అధికారంలో ఉన్న రాజకీయ ప్రత్యర్థులు భావించారు. కానీ కోర్టులు సమగ్రంగా దర్యాప్తు చేసి మేం నిర్దోషులమని గుర్తించింది.

తొలి బూట్లు..

నా చిన్నతనంలో నేను, నా అన్నదమ్ములు బూట్ల గురించి ఆలోచించేవాళ్లమే కాదు. మంచి మంచి బూట్లు వేసుకునేవారు అవి లేనప్పుడు బాధపడుతుంటారు. కానీ మేం మా జీవితంలో అవి వేసుకోలేదు. ఒకరోజు మా అంకుల్ నేను చెప్పుల్లేకుండా స్కూలుకు వెళ్లడం చూసి ఆశ్చర్యపోయాడు. రూ.10-12 ఖర్చుపెట్టిన తెల్ల కాన్వాస్ షూస్ కొనుక్కొచ్చాడు. అయితే వాటిని నీటుతా తుడవడం పెద్ద సవాల్. క్లాసురూంలో పడిపోయిన చాక్‌పీస్ ముక్కలు ఏరుకునేవాడిని. వాటిని నీటిలో ముంచి.. పేస్టులో కలిపి నా బూట్లు తెల్లగా కనిపించేలా పాలిష్ చేసేవాడిని. స్కూలు యూనిఫాం విషయంలోనూ అంతే. ఇస్త్రీ చేసుకోవడానికి రాగి పాత్రలో నీటిని వేడిచేసి పట్టకారుతో పట్టుకుని యూనిఫాంపై రుద్ది స్కూలుకు వేసుకుని వెళ్లేవాడిని. చాలా తక్కువ వనరులు ఉన్నప్పటికీ బాధపడేవాళ్లం కాదు.

ట్రంప్‌తో పరస్పర విశ్వాసం..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, నాకు మధ్య పరస్పర విశ్వాసం ఉంది. అన్నిటికంటే జాతీయ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలనుకుంటాం కాబట్టి అది మమ్మల్ని బాగా కలిపింది. ఆయన ధైర్యవంతుడు. సొంతంగా నిర్ణయాలు తీసుకుంటారు. అమెరికా పట్ల తిరుగులేని నిబద్ధత చూపుతారు. మొదటిసారి కంటే రెండోసారి ఆయన పూర్తిసన్నద్ధతతో వచ్చినట్టు కనబడుతోంది. తన లక్ష్యాలను చేరుకోవడానికి నిర్దిష్ట చర్యలతో కూడిన స్పష్టమైన ప్రణాళిక ఉంది. 2019 సెప్టెంబరులో హ్యూస్టన్‌లోని ఎన్ఆర్‌జీ స్టేడియంలో నిర్వహించిన 'హౌడీ మోదీ' సభలో వేదికపై నేను ప్రసంగిస్తుంటే ట్రంప్ సభికులతోపాటు కూర్చుని సావధానంగా విన్నారు. స్టేడియంలో కలియదిరుగుదామని ట్రంప్‌ను నేను అడిగితే ఆయన మాత్రం నిస్సంకోచంగా అంగీకరించారు. గత ఏడాది ఎన్నికల ప్రచార సమయంలో తనపై కాల్పులు జరిపినా తట్టుకుని ధైర్యంగా ఉన్నారు. ఆయన జీవితం ఆయన దేశం కోసమే. నేను 'భారత్ ఫస్ట్' అని భావించినట్లే.. ఇది ఆయన 'అమెరికా ఫస్ట్' స్ఫూర్తి.

లోకం తీరు



డీలిమిటేషన్‌తో దక్షిణాదికి అన్యాయం

ఉత్తరాదికి 30% సీట్లు పెరుగుతాయి: ఖర్గే

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేస్తే, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం వాటిల్లుతుందని, లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యం తగ్గుతుందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. గదగ్‌లో ఆదివారం కర్ణాటక మాజీ మంత్రి కేహెచ్ పాటిల్ శతజయంతి సభలో ఆయన మాట్లాడారు. డీలిమిటేషన్‌తో ఉత్తరాది రాష్ట్రాల్లో 30శాతం సీట్లు పెరిగే అవకాశం ఉందని నివేదికలు తెలియజేస్తున్నాయన్నారు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ముఖ్యులంతా సమైక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సహకార సమాఖ్యవాదం గురించి మాట్లాడుతున్న కేంద్రప్రభుత్వం.. ప్రజలకు అవసరమైన పనులకోసం గ్రాంట్లలో ఎందుకు కోత పెడుతోందని నిలదీశారు. కర్ణాటకలో సహకార బ్యాంకులకు నాబార్డు నిధుల్లో 58శాతం కోత విధించిందని, తద్వారా లక్షలాది రైతులకు ఈ ఏడాది పంటరుణాలు అందలేదని చెప్పారు.

బెంగళూరులో రూ.75 కోట్ల డ్రగ్స్

బెంగళూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో పోలీసులు పెద్ద మొత్తంలో మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు దక్షిణాఫ్రికా మహిళలను మంగళూరు సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.75 కోట్ల విలువైన 37.87 కేజీల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 14న విదేశీ మహిళలు ఢిల్లీ నుంచి బెంగళూరుకు డ్రగ్స్ తీసుకొస్తున్నట్లు సమాచారం అందడంతో.. వారిని బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని నీలాద్రినగర్‌లో అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. రాష్ట్రంలో ఇంత భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడడం ఇదే తొలిసారి.

చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఆమోదం

చెన్నై, మార్చి 16: చంద్రునిపై పరిశోధనలకు ఉద్దేశించిన చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న ఆయనను ఆదివారం ఇక్కడ సన్మానించారు. ఆయన అంతరిక్ష శాఖ కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తుండడం గమనార్హం. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రయాన్- 5 మిషన్‌కు మూడు రోజుల క్రితమే ఆమోదం లభించిందని చెప్పారు. చంద్రయాన్-2లో 25 కిలోల బరువు ఉన్న రోవర్ 'ప్రజ్ఞాన్'ను చంద్రుడిపై తీసుకెళ్లగా, చంద్రయాన్-5లో 250 కిలోల రోవర్‌ను తీసుకెళ్తామని తెలిపారు. 2027లో చంద్రయాన్-4 మిషన్‌ను ప్రయోగించనున్నారు. చంద్రుడిపై ఉన్న మట్టి నమూనాలను తీసుకురావడం ఆ మిషన్ ప్రధాన లక్ష్యం. చంద్రయాన్-5ను జపాన్ సాయంతో నిర్వహిస్తామని నారాయణన్ తెలిపారు.

ఇస్రో కోసం స్వదేశీ 32-బిట్ మైక్రోప్రాసెసర్లు

బెంగళూరు, మార్చి 16: ఇస్రోకు చెందిన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్, చండీగఢ్‌లోని సెమీకండక్టర్ లేబొరేటరీ (ఎస్‌సీఎల్) సంయుక్తంగా స్పేస్ అప్లికేషన్ల కోసం విక్రమ్ 3201, కల్పన 3201 అనే 32-బిట్ మైక్రోప్రాసెసర్లను అభివృద్ధి చేశాయి. ఈ మేరకు తొలి ఉత్పత్తులను కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎస్ కృష్ణన్.. ఇస్రో ఛైర్మన్ వి నారాయణన్‌కు అందజేశారు. విక్రమ్ 3201ను లాంచ్ వెహికిల్స్ కోసం స్వదేశీయంగా తయారు చేశారు. ఇది కఠినమైన వాతావరణ పరిస్థితుల్లోనైనా ఉపయోగించడానికి అర్హత సాధించిన మొట్టమొదటి భారతీయ తయారీ 32 బిట్ మైక్రోప్రాసెసర్.

400 కోట్ల పన్ను చెల్లించిన అయోధ్య రాముడు

అయోధ్య, మార్చి 16: అయోధ్యలోని రామ మందిరాన్ని నిర్వహిస్తున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు గత అయిదేళ్ల కాలంలో ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్లు పన్ను చెల్లించింది. 'ఆలయ పర్యాటకం' వృద్ధి చెందడమే ఇందుకు కారణమని ట్రస్ట్ కార్యదర్శి చంపత్ రాయ్ ఆదివారం తెలిపారు. 2020 ఫిబ్రవరి 5 నుంచి 2025 ఫిబ్రవరి 5 వరకు ఈ మొత్తాన్ని చెల్లించినట్టు చెప్పారు. ఇందులో రూ.270 కోట్లు జీఎస్టీగా, మిగిలిన రూ.130 కోట్లు ఇతర పన్నుల రూపంలో చెల్లించినట్టు వివరించారు. గత ఏడాది 5 కోట్ల మంది ఆలయాన్ని సందర్శించారని తెలిపారు.

ప్రపంచ నిఘా సంస్థల చీఫ్‌లతో డోభాల్ భేటీ

న్యూఢిల్లీ, మార్చి16: ప్రపంచ నిఘా సంస్థల చీఫ్‌లతో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ ఢిల్లీలో భేటీ అయ్యారు. డోభాల్ నేతృత్వంలో సాగిన సదస్సులో ఉగ్రవాదం సహా పలు భద్రతా సవాళ్లపై పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించారు. సదస్సుకు అమెరికా నేషనల్ ఇంటలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బార్డ్, కెనడా నిఘా విభాగాధిపతి డేనియల్ రోజర్స్ తదితర దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. విదేశాల్లో ఖలిస్థాన్ సానుభూతిపరుల ఆందోళనలపై భారత్ చర్చించింది. అంతకుముందు డోభాల్.. తులసి గబ్బార్డ్‌తో ద్వైపాక్షిక అంశాలపై కీలక చర్చలు జరిపారు. మరోవైపు, భౌగోళిక రాజకీయాలు, ఆర్థిక పరిస్థితులపై చర్చించేందుకు భారత్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే రైసినా డైలాగ్ 10వ సదస్సు సోమవారం ఇక్కడ ప్రారంభం కానుంది.

యూకే నుంచి స్వచ్ఛందంగా వెళ్లిపోండి!

» చరిత్రకారిణి మణికర్ణికకు ఆ దేశ హోంశాఖ ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 16: భారత చరిత్రకారిణి మణికర్ణిక దత్తా యూకే నుంచి బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్నారు. భారత్‌లో పరిశోధనలు చేసే క్రమంలో ఆమె పరిమితికి మించి ఎక్కువ రోజులు విదేశాల్లో ఉన్నారని ఆ దేశ హోంశాఖ పేర్కొంది. మణికర్ణిక 12 ఏళ్లుగా యూకేలో ఉంటున్నారు. ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో అకడమిక్ బాధ్యతల్లో ఉన్నారు. అక్కడి 'ఇన్‌డెఫినిట్ లీవ్ టు రిమైన్(ఐఎల్ఆర్)' నిబంధనల ప్రకారం.. ఎవరైనా ఐఎల్ఆర్‌కు దరఖాస్తు చేసుకుంటే 10ఏళ్ల వ్యవధిలో యూకే బయట 548 రోజుల కంటే ఎక్కువ ఉండకూడదు. కానీ, దత్తా 691 రోజులుగా విదేశంలో ఉంటున్నారని, దీని కారణంగా ఆమె దరఖాస్తు తిరస్కరణకు గురైందని యూకే హోంశాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో.. 'మీరు యూకేను తప్పనిసరిగా వీడి వెళ్లాలి. స్వచ్ఛందంగా వెళ్లకుంటే.. యూకేకు మళ్లీ రాకుండా పదేళ్ల పాటు నిషేధం విధిస్తాం' అని హెచ్చరించింది.

హూతీలపై వైమానిక దాడులు

» అమెరికా చర్య..31 మంది మృతి

» తక్షణమే దాడులు ఆపాలన్న ఇరాన్




ఎర్ర సముద్రంలోని తమ వాహక నౌక నుంచి హూతీలపై దాడికి వెళ్తున్న అమెరికా విమానం

సనా, మార్చి16: యెమెన్‌లో హూతీలను ఏరిపారేసే లక్ష్యంతో అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో 31 మంది చనిపోయారు. వంద మందికి పైగా గాయపడ్డారు. యెమెన్ రాజధాని సనాతో పాటు సాద, హొదైదా, బేదా, మారిబ్ ప్రావిన్సుల్లోని హూతీ స్థావరాలపై అమెరికా ఈ దాడులు నిర్వహించింది. మృతుల్లో మహిళలు, చిన్నారులున్నారని యెమెన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి తెలిపారు. అంతర్జాతీయ జల మార్గాల్లో అమెరికా వాణిజ్య, యుద్ధ నౌకలు స్వేచ్ఛగా తిరగకుండా ఏ ఉగ్రవాద సంస్థా అడ్డుకోలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా జరిపిన తాజా వైమానిక దాడులను యుద్ధ నేరంగా భావిస్తామని హూతీలు ప్రకటించారు. మరోవైపు హూతీలకు మద్దతీయడం మానుకోవాలని ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. దీనిపై ఇరాన్ గట్టిగా బదులిచ్చింది. ఉగ్రవాద సంస్థల విధానాల రూపకల్పనలో తమ పాత్రేమీ లేదన్నారు. దాడులను తక్షణమే నిలిపివేయాలని అమెరికాను కోరారు.

అమెరికాలో తుఫాను, టోర్నడోల బీభత్సం

» 34 మంది మృతి



మిస్సోరిలో టోర్నడో బీభత్సానికి నేలమట్టమైన ఇల్లు

న్యూయార్క్, మార్చి 16: అగ్రరాజ్యం అమెరికా టోర్నడోలు, భీకర తుఫాను, బలమైన గాలులు, కార్చిర్చులతో అతలాకుతలమైపోతోంది. ఈ విపత్తుల కారణంగా కనీసం 34 మంది మృత్యువాత పడ్డారు. ఎన్నో ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగాయి. విద్యుత్ లైన్లు, రోడ్లు దెబ్బతిన్నాయి. ఆర్కాన్సాస్ రాష్ట్రంలో ముగ్గురు చనిపోయారని అధికారులు ధ్రువీకరించి, అక్కడ ఎమర్జెన్సీ ప్రకటించారు. అలాగే మిస్సోరీలో 12 మంది, మిసిసిపీలో ఆరుగురు, కాన్సాస్‌లో 8 మంది, టెక్సాస్‌లో ముగ్గురు మరణించారని అధికారులు తెలిపారు. ఓక్లహోమా రాష్ట్రంలో కార్చిర్చు ఘటనలు చెలరేగుతున్నాయి. మార్చిలో వాతావరణ ప్రతికూల పరిస్థితులు సాధారణమేనని నిపుణులు చెబుతున్నారు. మరిన్ని టోర్నడోలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, అవి మరింత ప్రమాదకర స్థాయిలో ఉండవచ్చని అమెరికా వాతావరణ సేవల విభాగం హెచ్చరికలు జారీ చేసింది. టెక్సాస్, కాన్సాస్ రాష్ట్రాల్లో వాటి ప్రభావం ఎక్కువగా ఉండవచ్చని అప్రమత్తం చేసింది.

నైట్ క్లబ్‌లో అగ్నిప్రమాదం.. 59 మంది దుర్మరణం

» నార్త్ మేసిడోయాలో ఘటన

స్కోప్జే(నార్త్‌మెసిడోనియా), మార్చి 16: నైట్‌క్లబ్‌లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకున్న ఘటనలో 59 మంది దుర్మరణంపాలయ్యారు. మరో 155 మంది గాయపడగా.. వారిలో 118 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన ఐరోపాలోని నార్త్ మెసిడోనియాలో ఉన్న పల్స్‌క్లబ్‌లో ఆదివారం తెల్లవారుజామున 2.25 గంటలకు చోటుచేసుకుంది. బాణసంచా(పిరోటెక్నిక్) వంటి పదార్థం కారణంగా మంటలు వ్యాపించినట్లు ఆ దేశ అధ్యక్షుడు సిల్యనోవాస్క చెప్పారు. ప్రమాదం జరిగినప్పుడు క్లబ్‌లో 1,500 మంది వరకు ఉన్నట్లు వివరించారు. మృతుల్లో 35 మందిని గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

శని గ్రహానికి 274 ఉపగ్రహాలు..!

» తాజాగా 128 ఉపగ్రహాలు గుర్తింపు

సిడ్నీ, మార్చి 16: సౌరకుటుంబంలోని మిగిలిన గ్రహాల కంటే శని గ్రహానికి ఉపగ్రహాలు ఎక్కువ. ఇప్పుడు వాటి సంఖ్య మరో 128 పెరిగి 274కు చేరుకుందని ఆస్ట్రేలియాలోని సిడ్నీ యూనివర్సిటీ పరిశోధకులు లారా నికోల్ డ్రిసెన్ తెలిపారు. ఇటీవల తైవాన్‌లో జరిగిన అకాడమిక్ సినికాలో ఎడ్వర్డ్ ఆష్టన్ నేతృత్వంలోని ఖగోళ శాస్త్రవేత్తల బృందం కనుగొన్న పరిశోధనలను అంతర్జాతీయ ఖగోళ సమాఖ్య గుర్తించింది. దీంతో శనిగ్రహానికి కొత్తగా మరో 128 ఉపగ్రహాలు పెరిగినట్టయింది. కాగా, శని గ్రహం తొలి ఉపగ్రహం టైటాన్‌ను డచ్ ఖగోళ శస్త్రవేత్త క్రిస్టియన్ హ్యూజెన్ గుర్తించారు.

పాక్ మిలిటరీ కాన్వాయ్‌పై ఆత్మాహుతి దాడి

» 90 మంది సైనికుల మృతి?

» మళ్లీ చెలరేగిన బలూచ్ వేర్పాటు వాదులు



బీఎల్ఏ విడుదల చేసిన దాడి వీడియోలోని దృశ్యం

కరాచీ, మార్చి 16: పాకిస్థాన్‌లో బలూచ్ వేర్పాటువాదులు మరోసారి చెలరేగిపోయారు. ఆదివారం మిలిటరీ కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 90 మంది వరకు సైనికులు చనిపోయినట్టు ది బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్ఏ) ప్రకటించగా, 11 మంది సైనికులు చనిపోయారని, మరో 20 మందికిపైగా గాయాలపాలయ్యారని అధికారులు చెబుతున్నారు. బలూచిస్థాన్‌లోని క్వెట్టా నుంచి టఫ్తాన్‌కు 8 బస్సుల కాన్వాయ్‌లో సైనికులు వెళ్తుండగా నోష్కీలో రోడ్డు పక్కన బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో ఒక బస్సు పూర్తిగా ధ్వంసమైంది. పేలుడు పదార్థాలు(ఐఈడీ) నింపిన ఒక వాహనం ఆ కాన్వాయ్‌లోకి దూసుకొచ్చి ఒక బస్సును ఢీకొందని, అది ఆత్మాహుతి దాడి అని, అలాగే రాకెట్ ప్రొపెల్లెడ్ గ్రనేడ్లతో మరో బస్సుపై దాడికి పాల్పడ్డారని పోలీసులు తెలిపారు. తమ ఫిదాయీ విభాగం మజీద్ బ్రిగేడ్ ఈ దాడికి పాల్పడినట్టు బీఎల్ఏ ప్రకటించింది. కాగా, ఇటీవలి రైలు హైజాక్ ఘటన అనంతరం పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో అరడజనుకుపైగా ఉగ్రవాద దాడులు జరిగాయి. శనివారం జరిగిన ఆ ఉగ్ర దాడుల్లో సైనికులు, రైల్వే సిబ్బంది, పౌరులు సహా 31 మంది మరణించారు. ఈ దాడులు తమపనేనని తెహ్రీక్-ఐ-తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) ప్రకటించింది. మరోవైపు రెండు ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో 9 మంది ఉగ్రవాదులను హతమార్చామని భద్రతా దళాలు శనివారం ప్రకటించాయి.

హఫీజ్ సయీద్ అనుచరుడు హతం

లష్కరే తోయిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అబూ ఖతల్ శనివారం రాత్రి పాకిస్థాన్‌లో హత్యకు గురయ్యాడు. భారతదేశంలోని జమ్మూకశ్మీర్‌లో అతడు అనేక ఉగ్రదాడులకు పాల్పడ్డాడు. ముంబై పేలుళ్ల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు అతడు ముఖ్య అనుచరుడు. లష్కరే తోయిబా చీఫ్ ఆపరేషన్స్ కమాండర్‌గా అతడిని సయీద్ నియమించాడు. మరోవైపు, ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో నిషేధిత లష్కర్-ఐ-ఇస్లాం సంస్థ వ్యవస్థాపకుడు, రాడికల్ ఇస్లామిస్ట్ బోధకుడు ముఫ్తీ మునీర్ షకీర్ హతమయ్యాడు. షకీర్ లక్ష్యంగా పెషావర్ జిల్లాలో ఓ మసీదు ఎదుట దుండగులు ఐఈడీని పేల్చారని పోలీసులు తెలిపారు.

హఫీజ్ సయీద్ కాల్చివేత?


లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ చీఫ్ హఫీజ్ సయీద్‌ను గుర్తుతెలియని వ్యక్తి కాల్చి చంపినట్టు పాకిస్థాన్‌లో సోషల్ మీడియా పోస్టులు వెల్లువెత్తాయి. పంజాబ్ రాష్ట్రంలోని ఝెలం ప్రాంతంలో అతడు పర్యటిస్తుండగా ఈ దాడి జరిగినట్టు 'ఎక్స్'లో పలువురు వెల్లడించారు. ఈ దాడిలో అతడి అనుచరుడు అబూ ఖతల్ సింధీతోపాటు డ్రైవర్ కూడా ఘటన స్థలంలోనే చనిపోయినట్టు మరికొన్ని పోస్టులు తెలిపాయి. తీవ్ర గాయాలైన హఫీజ్‌ను రావల్పిండి ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ప్రకటించారని 'ఎక్స్'లో ఒక వ్యక్తి తెలిపారు.

చైనా నుంచి పాక్‌కు రెండో జలాంతర్గామి

అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్లతో కూడిన రెండో జలాంతర్గామిని చైనా తన మిత్ర దేశమైన పాకిస్థాన్‌కు అందజేసింది. పాకిస్థాన్ రూ.500 కోట్లు వెచ్చించి చైనా నుంచి 8 అత్యాధునిక హ్యాంగర్ క్లాస్ జలాంతర్గాములను కొనుగోలు చేసేందుకు ఇప్పటికే ఒప్పందం చేసుకుంది. వీటిలో నాలుగింటిని బీజింగ్‌లో తయారు చేసి పాక్‌కు పంపేందుకు చైనా అంగీకరించగా, మరో నాలుగింటిని సాంకేతికత బదిలీ ద్వారా కరాచీలో రూపొందించనున్నట్లు పాక్ నేవీ వర్గాలు తెలిపాయి. ఒప్పందంలో భాగంగా రెండో జలాంతర్గామిని చైనా తాజాగా పాకిస్థాన్‌కు అందించింది.

ఐఎస్ఎస్‌ను చేరిన స్పేస్ ఎక్స్ వ్యోమ నౌక

న్యూఢిల్లీ, మార్చి 16: స్పేస్ ఎక్స్ సంస్థ శనివారం ఫాల్కన్ 9 రాకెట్ సాయంతో నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించిన క్రూ డ్రాగన్ క్యాప్సూల్-10(వ్యోమ నౌక పేరు).. ఆదివారం 9.37గంటలకు(భారత కాలమానం ప్రకారం) అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనా కేంద్రం(ఐఎస్ఎస్)తో అనుసంధానమైంది. ఈ వ్యోమ నౌక ఐఎస్ఎస్‌కు అనుసంధానం కాగానే.. ఐఎస్ఎస్‌లో ఉన్న ఏడుగురు సిబ్బంది వ్యోమ నౌకలో ఉన్న నలుగురు వ్యోమగాములకు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ కూడా ఉన్నారు. వీరు ఇదే వ్యోమ నౌకలో భూమ్మీదకు రానున్నారు. షెడ్యూల్ ప్రకారం బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఐఎస్ఎస్ నుంచి బయల్దేరుతారు. గురువారం అర్ధరాత్రి కల్లా ఈ వ్యోమనౌక భూమని చేరే అవకాశం ఉంది. సునీత, విల్మోర్‌లతో పాటు అమెరికాకు చెందిన నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గోర్బునోవ్ కూడా రానున్నారు.



క్రూ డ్రాగన్-10 క్యాప్సూల్

ఓయూలో ఆందోళనల రద్దు ఉత్తర్వుపై..

భగ్గుమన్న విద్యార్థి సంఘాలు

- ఆర్ట్స్ కాలేజీ వద్ద విద్యార్థుల ఆందోళన
- ధర్నా.. సర్క్యులర్ పత్రాల దహనం

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వర్సిటీలో ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, నినాదాలను నిషేధిస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌పై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నమే ఈ సర్క్యులర్ అని ఆరోపించాయి. వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో భేటీ అయ్యారు. అనంతరం ఆందోళన నిర్వహించి, సర్క్యులర్ ప్రతులను తగులబెట్టారు. వర్సిటీ అధికారుల నియంతృత్వ ధోరణికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి కార్యాచరణను రూపొందించారు. ఈ ధర్నాలో ఏబీవీపీ, యూటీఎస్‌టీఎస్, ఎన్‌ఎస్‌యూఐ తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో ఆంధ్రా పాలకులు ఇలాంటి ఆంక్షలు పెట్టి ఉంటే.. వర్సిటీలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం జరిగి ఉండేది కాదన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో నిర్బంధాలను అడ్డుకుంటామన్నారు. విద్యార్థి సంఘాలతో చర్చించకుండా.. ఈ నిర్ణయాన్ని తీసుకోవడం దారుణమన్నారు. ఐదు నెలల వీసీ పాలనలో.. సమస్యలు చెప్పుకొనేందుకు వెళ్లిన దివ్యాంగ విద్యార్థులను అమానుషంగా అరెస్టు చేయించి, వారిపై కేసులు పెట్టారంటూ మండిపడ్డారు. వర్సిటీ అధికారుల నిర్ణయంపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ సి.కాశీం, ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్‌రాజ్ సైతం తాజా సర్క్యులర్‌ను తప్పుబట్టారు.



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

బీఆర్ఎస్‌దే ఆ పాపం: చనగాని దయాకర్

విశ్వవిద్యాలయాల్లో నిర్బంధాలను విధించింది గత బీఆర్ఎస్ సర్కారేనని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే.. ఆ ముళ్ల కంచెలను తొలగించామని గుర్తుచేశారు. "వర్సిటీ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌తో విద్యార్థులు, పరిశోధకులకు ఏం నష్టం జరుగుతుందో కేటీఆర్ చెప్పాలి. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఓయూను అష్టదిగ్బంధం చేశారు. నిరుద్యోగి మురళి ముదిరాజ్ ఆత్మహత్య చేసుకుంటే.. పోలీసులతో విద్యార్థులపై లాఠీచార్జ్ చేయించి, జైళ్లలో నిర్బంధించారు. అధికారం పోగానే.. కేటీఆర్ ఇప్పుడు ఓయూపై కపట ప్రేమను నటిస్తున్నారు" అంటూ మండిపడ్డారు.

ప్రశాంత వాతావరణం కోసమే: రిజిస్ట్రార్ నరేశ్‌రెడ్డి

ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు విద్యనభ్యసించాలనే ధర్నాలు, ఆందోళనలకు వ్యతిరేకంగా సర్క్యులర్‌ను జారీ చేశామని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఓ ప్రకటనను విడుదల చేశారు. పరిపాలన భవనం, అధికారుల చాంబర్లలో ఆందోళనలు చేయడం సరికాదని, విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు ఈ విషయాన్ని సానుకూల దృక్పథంతో అర్థం చేసుకోవాలని కోరారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని చెబుతూ.. రిజిస్ట్రార్, వీసీ చాంబర్లలోకి చొరబడడం లాంటి ఘటనలతో పాలనకు తీవ్ర అంతరాయం కలిగిందన్నారు.

అనధికారికంగా పహాణీల్లో పేర్ల నమోదు

- 21 మందిపై కేసులు
- గత తహసీల్దార్, ఇద్దరు ఆర్ఐలు సహా ఏడుగురి అరెస్టు, రిమాండ్
- పరారీలో 14 మంది నిందితులు

మోతె, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల పేర్లను అనధికారికంగా పహాణీల్లో నమోదు చేసిన 21 మందిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా మోతె మండలంలో జరిగింది. ఎస్సై యాదవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రికార్డుల్లో లేని పేర్లను పహాణీల్లో ఎక్కించారని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు గ్రీవెన్స్‌లో ఓ ఫిర్యాదు అందింది. దానిపై కలెక్టర్ ఈ నెల 4న మోతె రెవెన్యూ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. 11 మంది రైతుల పేరిట 25 ఎకరాల భూములను అనధికారికంగా పహాణీల్లో నమోదు చేసినట్టు గుర్తించారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆర్డీవో వేణుమాధవ్, మోతె ప్రస్తుత తహసీల్దార్ శ్రీకాంత్‌కు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పహాణీల్లో అనధికారికంగా పేర్లు నమోదు చేసిన ఆధారాలతో తహసీల్దార్ శ్రీకాంత్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పహాణీల్లో పేర్లు నమోదైన 11 మంది రైతులను పోలీసులు విచారించారు. విచారణలో ఈ వ్యవహారంలో 21 మంది ప్రమేయం ఉన్నట్టు గుర్తించిన పోలీసులు వారందరిపై కేసులు నమోదు చేశారు. గతంలో మోతె తహసీల్దార్‌గా పనిచేసిన సంఘమిత్ర, ఆర్ఐలు మన్సూర్ అలీ, నిర్మలాదేవి, తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు, మీ-సేవా కేంద్రం నిర్వాహకుడు మల్లేష్, జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు స్టాలిన్‌రెడ్డి, నకిలీ పహాణి తయారీదారుడు దేశరాజు కొండల్‌రావును ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఆర్ఐ అజయ్, ఓ రిపోర్టర్ స్టాలిన్, గతంలో వీఆర్వోగా పనిచేసిన వాస వెంకటేశ్వర్లుతో పాటు 11 మంది రైతులు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువతరం నైపుణ్యాభివృద్ధే లక్ష్యం

పల్లె నుంచి ప్రపంచానికి పోటీనిచ్చేలా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

- స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ పరిజ్ఞానంపై తర్ఫీదు
- పైలట్ ప్రాజెక్టుగా హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహణ
- డిసెంబరు నుంచి కొనసాగుతున్న శిక్షణ
- ఫలితాల ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా అమలు

హుస్నాబాద్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థులను నేటి ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆయా విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం తదితర అంశాలపై ఉచితంగా తర్ఫీదు ఇస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన సైనోహబ్ అనే సంస్థ ఆధ్వర్యంలో 2024 డిసెంబరు నుంచి ఈ తరగతులు జరుగుతున్నాయి. కళాశాలలోని కెరియర్ గైడెన్స్‌సెల్ ఆధ్వర్యంలో జరిగే ఈ తరగతుల్లో సైనోహబ్‌కు చెందిన నిపుణులు విద్యార్థులకు ఆయా అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. హుస్నాబాద్ డిగ్రీ కళాశాలకు చెందిన 100 మంది, పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 50 మంది.. మొత్తం 150 మంది విద్యార్థులు ఈ తరగతులకు హాజరవుతున్నారు. ఆరు నెలల పాటు సాగే ఈ శిక్షణకు ప్రభుత్వం రూ. కోటీ వరకు ఖర్చు చేస్తోంది. ఈ తరగతుల కోసం ప్రత్యేక సిలబస్ అమలు చేస్తున్నారు. తరగతి గదుల్లో ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. అలాగే, సుమారు రూ.30 లక్షల వ్యయంతో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌నూ ఇటీవల ప్రారంభించారు. విద్యార్థులది గ్రామీణ నేపథ్యం కావడంతో తొలుత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. ప్రస్తుతం కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ క్లాసులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ మను చౌదరి.. శిక్షణ తరగతుల్లో విద్యార్థులు ఆంగ్లంలో చేసిన ప్రసంగాలను చూసి అబ్బురపడ్డారు. విద్యార్థులు మరింత ప్రగతి సాధించాలని ఆకాంక్షించారు. హుస్నాబాద్ కళాశాలలో వచ్చిన ఫలితాల ఆధారంగా భవిష్యత్తులో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఈ శిక్షణ తరగతులను నిర్వహిస్తారు.



కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు

మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్‌కు కృతజ్ఞతలు



విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి సైనోహబ్ ద్వారా నిర్వహిస్తోన్న శిక్షణ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయి. ఈ శిక్షణ కార్యక్రమాన్ని హుస్నాబాద్ కళాశాలకు మంజూరు చేయడం సంతోషకరం. ఇందుకు మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ మనుచౌదరికి కృతజ్ఞతలు

- విజయగిరి భిక్షపతి, హుస్నాబాద్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఇంగ్లిష్ మాట్లాడటం సులువైంది



ఈ శిక్షణ వల్ల ఇంగ్లిష్ మాట్లాడటం నాకు సులువైంది. ఈ శిక్షణ ద్వారా నేను నేర్చుకున్న స్కిల్స్ చూసి మా అమ్మానాన్న సంబరపడుతున్నరు. ఇది అదృష్టంగా భావిస్తున్నాం

- సీహెచ్ జ్యోతి, బీజడ్సీ ఫైనల్ ఇయర్



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో మల్లన్న స్వామి పుణ్య క్షేత్రంలో బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. దాదాపు 70 వేల మంది భక్తులు పాల్గొన్నారు. - మెట్‌పల్లి రూరల్

వింత వ్యాధితో 6,500 కోళ్ల మృతి

- మరో ఫామ్‌లో రెండు రోజుల్లో 4 వేల కోళ్లు కూడా

రాయపోల్, చిన్నశంకరంపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఓ కోళ్ల ఫారంలో ఒక్కరోజే 6,500 బ్రాయిలర్ కోళ్లు వింత వ్యాధితో మృతి చెందాయి. కొన్ని నెలలుగా జిల్లాలోని చిన్నశంకరంపేట మండలంలోని పలు గ్రామాల్లో కోళ్ల ఫారాలలో బ్రాయిలర్ కోళ్లు పెద్ద సంఖ్యలో ఇలానే చనిపోయాయి. తాజాగా ఆదివారం గవ్వలపల్లి తండాకు చెందిన బానోత్ స్వామి నాయక్ కోళ్ల ఫారంలో 6,500 కోళ్లు మృత్యువాత పడ్డాయి. మరోవైపు సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి రాయపోల్ మండలం రామారం గ్రామంలోని తన పౌల్ట్రీఫామ్‌లో ఓ కంపెనీకి సంబంధించిన కోళ్లు పెంచుతున్నారు. రెండు రోజులుగా ఈ పౌల్ట్రీఫామ్‌లో సుమారు 4 వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి.



గవ్వలపల్లి తండాలో మృతి చెందిన కోళ్లు

జగదీశ్‌రెడ్డి అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల కాంగ్రెస్ నిరసనలు
- జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టిబొమ్మల దహనం
- స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అసెంబ్లీ సాక్షిగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలకు దిగాయి. టీపీసీసీ పిలుపు మేరకు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. జగదీశ్‌రెడ్డి, కేటీఆర్ దిష్టి బొమ్మలను దహనం చేసి బీఆర్ఎస్ వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. హైదరాబాద్ ఎల్బీనగర్‌లో రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్పీకర్‌ను అవమానించిన జగదీశ్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలంటూ పంజాగుట్ట పోలీసులకు కాంగ్రెస్ కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. మీర్‌పేట్, బడంగ్‌పేట చౌరస్తా, హయత్‌నగర్, బంజారాహిల్స్, షైలార్‌దేవ్‌పల్లి, మణికొండ, చందానగర్, మియాపూర్‌లలో బీఆర్ఎస్ నేతల దిష్టి బొమ్మల దహనం చేసి.. ఆందోళనలు చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం యువజన కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగారు. కూకట్‌పల్లి వివేకానందనగర్ రిక్షాపుల్లర్స్ కాలనీలో చేపట్టిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు స్వల్ప ఉద్రిక్తతకు దారితీశాయి. ఇటు వరంగల్ చౌరస్తాలో నిర్వహించిన నిరసనలో మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, ఎర్రబెల్లి స్వర్ణ పాల్గొన్నారు. హనుమకొండ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి ఇందులో పాల్గొన్నారు. భువనగిరి జిల్లా కేంద్రం లో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో జగదీశ్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలు దహనం చేశారు. ఇటు ములుగు, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, మంచిర్యాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోనూ కాంగ్రెస్ ఆందోళనలు నిర్వహించారు.



హనుమకొండలో బీఆర్ఎస్ నేతల దిష్టి బొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తెలంగాణ ప్రభుత్వం
ఆదిలాబాద్ పురపాలక సంఘ కార్యాలయం
టెండరు ప్రకటన

టెండరు ప్రకటన నం.E1/13/2024-25, తేది13.03.2025 గల మొత్తం 04 పనులకు అంచనా వ్యయం రూ. 16.00 లక్షలు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లో టెండర్లు ప్రచురించబడిన/అప్‌లోడ్ చేయబడిన తేది నుండి (07) పని రోజులు కొరకు 17.03.2025 నుండి 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.inలో టెండర్లు లభించును. తదుపరి వివరాలు ఆదిలాబాద్ పురపాలక సంఘ కార్యాలయం నుండి పొందవచ్చును.

సం/- మునిసిపల్ ఇంజనీర్, ఆదిలాబాద్ పురపాలక సంఘం
సం/- కమిషనర్, ఆదిలాబాద్ పురపాలక సంఘం

DIPR RO.No 11493-PP/CL/ADVT/1/2024-25 తేది. 15.03.2025

TELANGANA PUBLIC SERVICE COMMISION
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

DEPARTMENTAL TESTS MAY-2025 SESSION (Notfn.No. 03/2025)

It is to inform that the Departmental Tests will be conducted in online mode in CBT (Computer Based Test) method for May-2025 Session vide Notification No. 03/2025. Examinations will be conducted at Hyderabad (HMDA jurisdiction) including Ranga Reddy & Medchal Malkajgiri (or) As decided by the Commission.

For details and other necessary information, the candidates are instructed to go through the Notification carefully which is available on the Commission's official web-site https://www.tspsc.gov.in

i) Date of issue of Notification : 17/03/2025
ii) Date of commencement of submission of applications through online : 24/03/2025
iii) Last date for submission of applications through online including payment of fee : 24/04/2025
iv) Schedule of examinations : will be announced later

Place : Hyderabad
Dated : 17/03/2025

Sd/-
SECRETARY, (FAC)

DIPR RO.No: 11512-PP/CL/ADVT/1/2024-25, Dt: 15.03.2025

నేడు, రేపు వడగాలులు.. 21-24 తేదీల్లో పలు జిల్లాల్లో వర్షాలు

- వెల్లడించిన వాతావరణ శాఖ అధికారులు
- ఆసిఫాబాద్‌లో 42.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. చాలాప్రాంతాల్లో 40డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో 4 రోజులు పాటు ఎండల తీవ్రత ఇదే రకంగా కొనసాగనుంది. ముఖ్యంగా సోమ, మంగళవారాల్లో కొమరం భీం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే, 21 నుంచి 24 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఓ మాదిరి వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఇక, హైదరాబాద్‌లో వచ్చే మూడు రోజుల్లో 38-40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని తెలిపింది. కాగా, ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్ మండలంలో ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదే జిల్లా కెరమెరిలో 42.3, బెజ్జూరులో 42.1, రెబ్బెనలో 41.9, కౌటాలలో 41.8, తిర్యాణి, పెంచికలపేటలో 41.6, సిర్పూర్(టి), వాంకిడి మండలాల్లో 41.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిరిసిల్ల, జగిత్యాల, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోనూ 40 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మీతోనే నేనూ..

- తల్లిదండ్రులు మృతిచెందారని కుమారుడి ఆత్మహత్య.. మెదక్ జిల్లా గుండ్రెడ్డిపల్లిలో ఘటన

తూప్రాన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మృతిచెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లిలో జరిగింది. గుండ్రెడ్డిపల్లి కి చెందిన చింతల రాజు (24) తండ్రి బాల నరసయ్య ఏడాది క్రితం మృతి చెందాడు. తల్లి పోచమ్మ ఈ నెల 4న చనిపోయింది. ఈ నెల 12న తల్లి దశదిన కర్మ నిర్వహించారు. అదే రాత్రి రాజు పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీశ్రీ సాహిత్యంపై సదస్సు

'మహాప్రస్థానం' అమృతోత్సవం సందర్భంగా విజయవాడ, ఆంధ్ర లొయోల కళాశాలలో మార్చి 18, 19 తేదీలలో శ్రీశ్రీ సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు జరుగుతుంది. మార్చి 18 ఉ.10గంటలకు ముమ్మడి సమావేశ మందిరంలో లొయోల కళాశాల ప్రిన్సిపల్ జి.ఎ.పి కిశోర్ అధ్యక్షతన జరిగే ప్రారంభ సదస్సులో కొలకలూరి ఆశాజ్యోతి ముఖ్య అతిథిగా, మాధురి ఇంగువ విశిష్ట అతిథిగా, శ్రీశ్రీ విశ్వేశ్వర రావు, కోయి కోటేశ్వర రావు గౌరవ అతిథులుగా పాల్గొంటారు. ఈ సదస్సులో 35 మందికి పైగా శ్రీశ్రీ సాహిత్యంపై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు.

కోలా శేఖర్

'వీర నాగు శతకం' ఆవిష్కరణ

నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ సిటీ కళాశాల విద్యార్థి చిక్కొండ్ర రవి రచించిన 'వీరనాగు' శతకం ఆవిష్కరణ మార్చి 19 ఉ.10గంటలకు వనపర్తి జిల్లా బుద్ధారం గ్రామంలో ఆర్.డి.ఆర్.యం.యు.పి.యస్ దగ్గర జరుగుతుంది. సభాధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య, ముఖ్య అతిథి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, విశిష్ట అతిథి గోరటి వెంకన్న, ఆవిష్కర్త మదిరె మల్లమ్మ. వివరాలకు: 94927 65358.

నెలపొడుపు

ప్రపంచ కవితాదినోత్సవ సభ

కవి సంధ్య – చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో ప్రపంచ కవితా దినోత్సవ సభ మార్చి 23 సా.5గంటల నుంచి కమిటీ హాలు, పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వ విద్యాలయంలో జరుగుతుంది. శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో దర్భశయనం శ్రీ నివాసచార్య 'కవిత్వం ప్రయోజనం' అంశంపై ప్రసంగిస్తారు. కవితల పోటీ విజేతలకు బహుమతుల ప్రదానం ఉంటుంది. ముఖ్య అతిథి ఎన్.గోపి, గౌరవ అతిథులుగా ఓల్గా, దీర్ఘాశి విజయ్ భాస్కర్, మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొంటారు.

కవి సంధ్య

'దీర్ఘ కవితా వికాసం'పై ప్రసంగం

వర్తన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఏడవ సమావేశం మార్చి 23 ఉ.10గంటలకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఈ సమావేశంలో 'దీర్ఘ కవితా వికాసం' అంశంపై కాంచనపల్లి గోవర్ధనరాజు ప్రసంగిస్తారు. రూప్ కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు. అందరూ ఆహ్వానితులే.

ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్

కార్టూన్ల పోటీ

మామిడిపూడి రామకృష్ణయ్య స్మారకంగా విశాలాక్షి సాహిత్య మాసపత్రిక నిర్వహణలో కార్టూన్ల పోటీ జరుగుతుంది. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ బహుమతులు వరుసగా: రూ.6వేలు, 5వేలు, 4వేలు, 3వేలు, 2 వేలు. ముప్ఫై ప్రత్యేక బహుమతులు ఒక్కొక్కటి రూ.1000. ఒక్కొక్కరు రెండు కార్టూన్లు పంపవచ్చు. ఎ4 సైజులో గీసి 300 రిజల్యూషన్‌లో స్కాన్ చేసి మెయిల్ చెయ్యాలి. చివరి తేదీ: మార్చి 30. కార్టూన్లు పంపాల్సిన ఈమెయిల్: ethakotas@yahoo.com

ఈతకోట సుబ్బారావు

తరాల వలస వేదనతో 'గిర్మిటియా' కవిత్వం

బ్రిటిష్ ఆక్రమిత ప్రాంతాల్లో బానిసత్వాన్ని రద్దూ చేస్తూ బ్రిటన్ పార్లమెంట్ 1833లో చట్టాన్ని తీసుకురావడంతో ప్రత్యామ్నాయాల వేట మొదలైంది. భారత దేశంలోని బ్రిటిష్ ప్రభుత్వం తన వలస పాలనలో ఉన్న ఇతర దేశాలకు భారతీయులను ఒప్పంద కార్మికులుగా ఎగుమతి చేయటం ప్రారంభించింది. తమ పాలనలో నాలుగు వేర్వేరు ఖండాల్లో ఉన్న పలు దేశాలకు– అక్కడి చక్కెర, రబ్బరు, తేయాకు, కోకో తోటలలో పనిచేయడానికి– 13 లక్షల మంది భారతీయ ఒప్పంద కార్మికులను హిందూ మహా సముద్రం మీదుగా పంపించింది. ఆయా దేశాల తోటల్లో ఐదు నుంచి పదేళ్ళ పాటు పనిచేయడానికి భారతీయులు తెలిసో తెలియకో చేసుకున్న రాతపూర్వక ఒప్పందాన్ని 'గిర్మిట్' అన్నారు (ఇది 'అగ్రిమెంట్' అన్న పదానికి భ్రష్ట రూపం).

భారత దేశం నుంచి ఇలా ఇతర బ్రిటిష్ పాలిత దేశాలకు వలస వెళ్లిన ఒప్పంద కార్మికులు పాడుకున్న జానపద గీతాల నుంచి, వారి వారసులు తమ పూర్వీకుల గురించి తెలుసుకున్న లేదా దర్శించిన జీవితానుభవాల నుంచి పుట్టినది 'గిర్మిటియా' కవిత్వం. ఈ కవిత్వంలో ఆవేదనా ఆక్రోశం ఉంది. పూర్వీకుల పట్ల గౌరవమూ ఉంది.

"మేము కలకత్తా చేరాక మా కష్టాలు పెరిగాయి/ మా అందమైన బట్టలన్నీ తీయించేసారు/ జపమాల పూసలు, యజ్ఞోపవీతాలూ/ బెంగాలీ గుడ్డలే మమ్మల్ని అలంకరించాయి/ సాధువుల తలవెంట్రుకలు గొరిగేయబడ్డాయి/ సాధువులు, దొమ్మర్లు, చర్మకారులు, ఇంకా దళితులు/ అందరినీ ఒకే గదిలో పడేశారు" – అని ఈ ఒప్పంద కార్మికులను ఓడల్లో ఎక్కించే ముందు వారికి ఎదురైన అనుభవాల గురించి రాస్తాడు బ్రిటిష్ గయానాకు చెందిన వతుక్ వేద ప్రకాశ్.

"గోదాంలో కాగితం చేతిలో పెట్టారు/ పర్యవసానాలు తెలియక/ దాని మీద వేలుముద్ర పెట్టాను/ చీకటి సంద్రాన్ని ఎలా దాటగలమని/ గొణుక్కుంటూ ఏడ్చుకుంటూ తెరచాపల పడవ మీద/ ఆశ్చర్యంలో కూరుకుపోయాను," అని ఓడ ఎక్కిన తరువాత ఒక భారతీయ కార్మికురాలు వాపోయింది. "అపారమైన సముద్ర ప్రయాణంలో భారతదేశం వెనక్కు మళ్లుతోంది, ఇప్పుడు నీరు తప్ప దిగంతం లేదు, నీరు, నీరు, నీరు తప్ప మరేమీ లేదు..." అని ట్రినిడాడ్ టొబాగో ప్రఖ్యాత కవయిత్రి రామాబాయి ఎస్పినెట్ దుఃఖించింది.





పేదరికం, బాగుపడతామన్న ఆశలే ఎక్కడైనా వలసలకు ముఖ్య కారణాలు.

"వాళ్లు/ ఓడల గుంపులో వచ్చారు/ మందలా వచ్చారు/ పశువుల్లా/ గోధుమరంగు పశువుల్లా/ కళ్లు నిర్మలంగా, పశువుల్లా... చస్తూ అందరూ/ ఒకేరీతిగా వచ్చారు వాళ్లు.. అందరూ ఒకేరీతిని/ నల్ల సముద్రాన్ని దాటుకుంటూ/ బ్రాహ్మణులు, చర్మకారులూ ఒకేలా" అని బ్రిటీష్ గయానా ప్రముఖ కవయిత్రి మహదాయ్ చెప్పుకుంది.

> భారత దేశం నుంచి ఇతర బ్రిటిష్ పాలిత దేశాలకు వలస వెళ్లిన ఒప్పంద కార్మికులు పాడుకున్న జానపద గీతాల నుంచి, వారి వారసులు తమ పూర్వీకుల గురించి తెలుసుకున్న లేదా దర్శించిన జీవితానుభవాల నుంచి పుట్టినది 'గిర్మిటియా' కవిత్వం. ఈ కవిత్వంలో ఆవేదనా ఆక్రోశం ఉంది. పూర్వీకుల పట్ల గౌరవమూ ఉంది.

వలసదారులకు వాగ్దానం చేయబడ్డ భూమిలో ఎదురైన కొత్త జీవిత వాస్తవాలు వారికున్న ఆదర్శవాద కల్పనల్ని తొందరగా పంటాపంచలు చేసాయి. "మారిషస్ దీవి పేరు వినగానే../ బంగారం వెతుక్కోవచ్చని ఇక్కడికి వచ్చాం/ బదులుగా వెదురుబెత్తం దెబ్బలు తిన్నాం/ కూలీల వెనుక చర్మం ఒలిచిందది/ చెరకు తీయడానికి గానుగెద్దులమయ్యాం/ అయ్యో! కూలీలుగా మారడానికా మన దేశం విడిచిపెట్టాం" – అని అక్కడకు చేరుకున్నాక మొత్తుకున్నారు.

"చిన్న తప్పులకే సర్దార్లు కొరడా ఝుళిపించే వారు. విపరీతమైన ఎండలున్నా, వర్షం వచ్చినా, ఉరుములొచ్చినా పని చేయాల్సిందే." – అని అక్కడ బాధితులు చెప్పుకున్నారు. కొన్నిసార్లు వారి బాధల కథలు వినడానికి ఎవరూ ఉండరు.

చెరకు మొక్కలు మాత్రమే సాక్షులు: "కత్తులూ కొడవళ్లతో/ పగలూ రాత్రులూ గడుస్తున్నాయి ఇపుడు/ ఆకుపచ్చని చెరకు ఆకులకు తెలుసు/ మా అన్ని కష్టాలూ" అని తోటల్లో పనిచేస్తున్న మహిళ చెప్తుంది. పని స్థలాల్లోనే కాదు, ఇళ్లల్లో సైతం దుర్భర జీవన పరిస్థితులు వారిని వేధించేవి: "ఆరడుగుల వెడల్పు/ ఎనిమిదడుగుల పొడవు గదిలోనే/ అన్ని సౌఖ్యాలూ/ అందులోనే కొడవళ్లు పనిముట్లు/ అదే సొంత ఇల్లు/ అందులోనే వంటచెరకు/ రుబ్బురోలు పొయ్యి కూడా/ అందులోనే మా పడక". భారతదేశం నుండి ఆర్కటీలు అని పిలవబడే దళారీలు, భవిష్యత్తును గురించి తప్పుడు వాగ్దానాలతో చాలామంది మహిళలకు ఎర వేసేవారు. తమను తప్పుదారి పట్టించిన ఆ దళారీలను గుర్తుతెచ్చుకుని మహిళలు తిట్టుకుంటూ ఉండేవారు: "ప్రేమికుడ్ని వదిలేసి/ దేశం నుండి పారిపోయి వచ్చాను/ నాకు పెళ్లి కాకుండా చేసిన/ ఆ చేర్పించినవాడు తప్పకుండా చావాలి."

భర్తలు ఒప్పంద కార్మికులుగా విదేశం వెళ్ళాక వెనకే మిగిలిపోయిన భార్యల వేదనలు నమోదు చేసిన కవితలూ ఉన్నాయి. "నా స్నేహితురాళ్లందరూ తల్లులయారు/ నేను ఒంటరిగా మిగిలిపోయాను బిడ్డలు లేకుండా/ మళ్లీ మళ్లీ వేడుకున్నాను నిన్ను వెళ్లొద్దని/ అక్కడ ఉన్న స్త్రీ నీ హృదయాన్ని జయిస్తుందని/ పన్నెండేళ్లూ ఒక్క ముక్కయినా రాయలేదు నువ్వు/ చైత్రమాసపు రోజుల్ని నేను ఎలా గడపాలి?" అని కడపలో చాకలి భార్య ఆవేదన చెందింది.

ఒక సురినామ్ కవి జిత నారాయణ్ ఇలా రాస్తాడు: "తేనెలో చిక్కుకున్న ఈగలా మేము బానిసలమయాం/ నా కాళ్లు భూమిని దున్నుతున్నాయి/ నా చేతులు విత్తనాల్ని నాటుతున్నాయి." వలసదారులలో సామాజిక సోపానక్రమాలు, ఆచారాల ప్రత్యేకతల స్థాయి నుంచి, అందరినీ 'కూలీల' స్థితికీ స్థాయికీ తగ్గించాయి. కొందరు నిరసన తెలిపారు. "మమ్మల్ని కూలీ అని ఎందుకు పిలవాలి?/ మేము ఋషుల, సాధువుల వంశాలలో పుట్టిన వాళ్లం?" అని ట్రినిడాడ్ కవి రాస్తాడు.

"ఆకాశంలో సూర్యుడి వైపు చూడు ఎలా స్థిరంగా ఉందో యజమాని కన్నులాగ/ కొబ్బరి చెట్టు కావలి కాస్తుంది పైనుండి విచారణచేసేవాడిలా/ మా కన్నెల తలలమీద దాని బరువు పడేస్తానని బెదిరిస్తూ" అని ప్రముఖ గయానా కవి డేవిడ్ డాబిడీన్ చెప్పుకుంటే, "మా అమ్మని కనుగొన లేకపోయాను/ మా నాన్ననీ కనుగొన లేకపోయాను/ డోలు వాయింపూ వినబడలేదు నేను ఎవరి పూర్వీకుడ్ని?" అని దక్షిణాఫ్రికా కవి కామౌ బ్రాథ్వైట్, తల్లిదండ్రుల్ని వెతుక్కున్నాడు. భారతదేశ విశాల చరిత్రలో ఈ గిర్మిట్ల చరిత్ర అప్పుడు గాని ఇప్పుడు గాని ఎవరూ అంతగా పట్టించుకోకపోవడం ఒక విషాదం.

■ ముకుంద రామారావు

✆ 99083 47273

పుస్తకాలు ఆన్‌లైన్‌లో అమ్మడమే మంచిది

– 'కథా ప్రపంచం' కిరణ్

తిరుపతిలో ఓ సాహిత్య జీవి ఒంటి చేత్తో అరుదైన పుస్తకాలను ప్రచురించి సాహిత్య ప్రపంచానికి అందిస్తూ ఉన్నాడు. బాల సాహిత్యం, తెలుగు కథలు, నవలలు, ఇతర భాషలు, ఇతర దేశాలకు చెందిన రచనల తెలుగు అనువాదాలు ప్రచురిస్తున్నాడు. ఆయన పేరు కిరణ్. కథాప్రపంచం కిరణ్‌గా, తిరుపతి కిరణ్‌గా సుపరిచితుడు. ఆయనతో సంభాషణ..

మీ నేపథ్యం గురించి చెప్పండి?

మాది తిరుపతి. నాన్న టీటీడీ ఉద్యోగం చేసేవారు. నేను హైదరాబాదులో బీకాం చదువుకున్నాను. బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో మీడియా రంగంలో పని చేశాను. కొంత భక్తి ఉన్నా, సాహిత్యమంటే ప్రాణం. ఇందువల్ల సాహిత్య రంగం లోనే పూర్తి కాలం పని చేయాలని నిర్ణయించుకున్నాను. పుస్తకాలను చదవడం, మనసుకు నచ్చిన పుస్తకాలను ప్రచురించడం ఒక వ్యాపకంగా పెట్టుకున్నాను. పాఠకుల నుంచీ మంచి ఆదరణ లభిస్తుండటంతో సాహిత్య ప్రచురణ రంగం లోనే కొనసాగుతున్నాను.

సాహిత్యంతో పరిచయం ఎలా జరిగింది?

తిరుపతి కపిలతీర్థం రోడ్డులో నవభారతి స్కూల్లో ఐదవ తరగతి వరకూ చదువుకున్నాను. ఆ స్కూల్ నిర్వాహకుడు ఏనుగుల రామస్వామి నాయుడు స్కూల్‌లో సాహిత్య వాతావరణాన్ని ఏర్పరిచారు. చందమామ, బాలజ్యోతి, బాలమిత్ర, బుజ్జాయి, బొమ్మరిల్లు పత్రికలు తెప్పించేవారు. అక్కడికి వచ్చే హిందూ పత్రికలోని యంగ్ వరల్డ్ చాలా ఆసక్తిగా ఉండేది. మొదట పుస్తకాల్లో బొమ్మలంటే ఇష్టం ఉండేది. హైదరాబాద్ చేరాక అబిడ్స్ పాత పుస్తకాలే నా ప్రపంచం. అఫ్జల్‌గంజ్ లైబ్రరీలో చాలా చదువుకున్నాను. తెలియకుండానే సాహిత్యం పట్ల ఆసక్తి కల్గింది.

మీ 'కథా ప్రపంచం' ప్రచురణల గురించి చెప్పండి?



> ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సప్ ద్వారా పుస్తకాలు అందిస్తున్నాను. బుక్ ఫెయిర్లలో 'కథా ప్రపంచం' ప్రచురణలు అందుబాటులో పెడుతున్నాను. వేల కాపీలు వెయ్యకుండా పబ్లిష్ ఆన్ డిమాండ్ (పీఓడీ) పద్ధతిలో 200 పుస్తకాలు అచ్చు వేసి, ఆ తర్వాత డిమాండును బట్టి పుస్తకాలు పునర్ముద్రణ చేస్తున్నాను. కొత్త తరంలో పుస్తక పఠనం పెంచాలన్నదే లక్ష్యం.

2013 లో కథా ప్రపంచం పేరున ఫేస్‌బుక్ పేజ్, ఆ తర్వాత బ్లాగ్, వెబ్‌సైట్ మొదలుపెట్టి నిర్వహించాను. సాఫ్ట్‌వేర్ రంగానికి చెందిన వేలాదిమంది స్పందించే వారు. వారు కోరిన పుస్తకాలు, రచయితల వివరాలు సైతం అందించేవాడిని. ఇలా ముల్క్‌రాజ్ ఆనంద్, ఆర్‌కె నారాయణ్, కెఏ అబ్బాస్ వంటి రచయితల గురించి తెలుసుకున్నాను. ఇలాంటి గొప్ప రచయితల గురించి నేనే పుస్తకాలను ఎందుకు తీసుకురాకూడదనే ఆలోచన కలిగింది. 'కథా ప్రపంచం' ప్రచురణల ద్వారా పుస్తకాలు ప్రచురించటం మొదలుపెట్టాను.

ఎన్ని పుస్తకాలు ప్రచురించారు?

ఇప్పటిదాకా యాభై పుస్తకాలు తెచ్చాను. గోపిని కరుణాకర్ 'మా తిరుపతి కొండ కథలు' మొదట ప్రచురించాను. ఆ తర్వాత ఎస్వీ రంగారావు కథలు, మధురాంతకం రాజారాం బాలల కథలు, ముళ్ళపూడి శ్రీదేవి 'రమణీయ శ్రీ రామాయణం', ప్రేమ్‌చంద్ కథావళి, కమలాదాస్ 'కుక్కలు' మొదలైన పుస్తకాలు ప్రచురించాను. నేను ప్రచురించిన యాభై పుస్తకాల్లో సగం బాల సాహిత్యమే. పిల్లల కోసం బేతాళ కథలు ఏడు భాగాలు, చందమామ బాలల కథా సాహిత్యం ఐదు భాగాలు, పిల్లల పిట్ట కథలు ఐదు భాగాలు ప్రచురించాను. పరోపకారి పాపన్న కథలు, దుర్గేశ నందిని, గుండు భీమన్న కథలు వంటి పుస్తకాలను పిల్లలను దృష్టిలో ఉంచుకొని ప్రచురించాను.

పుస్తకాల అమ్మకాలు ఎలా సాగుతున్నాయి?

మొదట్లో పుస్తక విక్రేతలకు పుస్తకాలు ఇచ్చి ఇబ్బంది పడ్డాను. ఆన్‌లైన్‌లో పుస్తకాలు అమ్ముకోవడమే మంచిదనే అభిప్రాయానికి వచ్చాను. ఇప్పుడు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ద్వారా పుస్తకాలు అందిస్తున్నాను. బుక్ ఫెయిర్లలో 'కథా ప్రపంచం' ప్రచురణలు అందుబాటులో పెడుతున్నాను. వేల కాపీలు వెయ్యకుండా పబ్లిష్ ఆన్ డిమాండ్ (పీఓడీ) పద్ధతిలో 200 పుస్తకాలు అచ్చు వేసి, ఆ తర్వాత డిమాండును బట్టి పుస్తకాలు పునర్ముద్రణ చేస్తున్నాను. కొత్త తరంలో పుస్తక పఠనం పెంచాలన్నదే లక్ష్యం. త్వరలో ఈ– కామర్స్ వెబ్‌సైట్ ఏర్పాటు చేస్తున్నాను.

అనువాదాల ప్రచురణలో సమస్యలు?

భాషా నైపుణ్యం ఉన్న అనువాదకులను గుర్తించడం పెద్ద సమస్య. మూల భాషలోనూ, లక్ష్య భాషలోనే కాదు, ఇరు ప్రాంతాల సామాజిక స్థితిగతుల గురించి అనువాదకులకు అవగాహన ఉండేలా చూసుకోవాలి. మూల రచయితకు సంబంధించిన కాపీరైట్స్, అగ్రిమెంట్స్ రచన ప్రతి తీసుకోవాలి. అయితే, గొప్ప రచయితల సాహిత్యాన్ని ఈ తరానికి అందించేలనే బలమైన ఆకాంక్ష ముందు ఈ సమస్యలన్నీ చిన్నవే.

ఫ్యూచర్ ప్లాన్స్ ఏమిటి?

ప్రత్యేకించి బాల సాహిత్య రంగంలో కృషి చేయాలని ఉంది. ఢిల్లీ ప్రగతి మైదాన్‌లో నిర్వహించే వరల్డ్ బుక్ ఫెయిర్‌లో తెలుగు పుస్తకాలను ప్రదర్శించాలని ఉంది.



చాసో కథల్ని కన్నడలోకి తేవాలని అనుకుంటున్నాను. ఒడిశా రచయిత ఫకీర్ మోహన్ సేనాధిపతి రచనలను తెలుగులోకి తేవాలని అనుకుంటున్నాను. మొబైల్ వ్యాన్ ఏర్పాటు చేసుకొని దేశంలోని నగరాలు, పట్టణాలు, పల్లెల్లో పుస్తకం విశిష్టతను తెలియ చేయాలనే ఆశ ఉంది. కథా ప్రపంచం ద్వారా అన్ని భారతీయ భాషల్లోనూ ముఖ్యమైన పుస్తకాలను గుర్తించి ప్రచురించాలని, తెలుగులో నచ్చిన రచనలను ఇతర భాషల్లోకి అనువదించి పుస్తక రూపంలో తీసుకురావాలని ఉంది.

ఇంటర్వ్యూ ■ ఎం. ఆదిశేషయ్య

మనిషి ఏడ్వడం చూస్తాం

విప్లవాన్ని కాంక్షిస్తూ కవిత్వం రాసిన కవయిత్రులను మినహాయిస్తే మిగిలిన కవయిత్రులు సాధారణంగా స్త్రీలకు సంబంధించిన అనేకానేక అంశాలమీద ఉక్కిరిబిక్కిరి అయి, వాటి మీదే తమ ఆవేశాన్ని, ఆగ్రహాన్ని కవిత్వీకరించారు. అయితే ఇందుకు భిన్నంగా భూమి, రైతు, అనంతర పరిణామాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంపై కవయిత్రి అమూల్య చందు 'భూమి నవ్వడం చూశాను' అనే పద్యం రాసారు. "మా తాత పంచె కట్టినప్పుడు... భూమి నవ్వడం చూసాను" అంటూ పద్యాన్ని ప్రారంభించారు అమూల్య చందు. నవ్వుతూన్న భూమి వివిధ సందర్భాల్లో కన్నీరు కార్చడం, తాతకు దండం పెట్టడం, తాత చేతుల్ని ముద్దాడ్డం వంటి ప్రతీకలు నేలతల్లితో రైతుకున్న సంబంధాన్ని చెబుతాయి. అంత వరకూ వివిధ సందర్భాల్లో రైతుకు, భూమికి మధ్య బాంధవ్యాన్ని చెప్పిన కవయిత్రి రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతిలో పడ్డాక అదే భూమి ఓడిపోయి పొడి నవ్వును నవ్వింది అన్నారు. ఇది పైకి సాధారణ వాక్యాల కూర్పులా కనపడుతుందేమో కాని దీని వెనుక పల్లెల్లో కూడా విస్తరిస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్ల క్రూర హింస ఉంది. ఈ పద్యం చదివిన తర్వాత నా మటుకు నాకు మా కోనసీమలో పచ్చని పొలాలు, కొబ్బరితోటల ఎకరాలు కళ్ల ముందే సెంట్లు, గజాలుగా రూపాంతరం చెందుతున్న విషాదం కనిపించింది. ఈ వాస్తవ దారుణాలను చూసి కవిత్వం రాస్తే సరిపోతుందా అని కొందరు బుద్ధిజీవులు అనుకోవచ్చు. సరిపోకపోవచ్చు. కానీ రైతుల గురించి, వారికి దూరమవుతున్న భూమి గురించి కన్నీరు కారుస్తున్న వారు ఉన్నారని తెలుసుకోవాలి కదా, ఈ అమూల్య చందు లాగా. అందుకే... అమూల్య రాసిన పద్యం నన్ను కదిపింది. కుదిపింది. కన్నీరైంది.



■ ముక్కామల చక్రధర్

✆ 99120 19929

ప్రియ పద్యం



భూమి నవ్వడం చూశాను

మా తాత పంచె కట్టినప్పుడు
నాగలికి ఎడ్లను కట్టేటప్పుడు
భూమి నవ్వడం చూశాను...

మన్ను దున్నేటప్పుడు
నాట్లు వేసేటప్పుడు
నీళ్ళు పెట్టేటప్పుడు
మా తాత కాళ్ళకు భూమి దణ్ణం పెట్టడం చూశాను...


పసిపిల్లగా పంటను సాకేటప్పుడు
పురుగుమందును జల్లేటప్పుడు
కాకులకు వడిశెల వేసేటప్పుడు
కన్నకూతురిగా మారిన భూమి తాత చేతుల్ని ముద్దాడ్డం చూశాను..

పొలాన్ని బీడుగా చేసి... గజానికో రేటు కట్టి..
వట్టిపోయిన పొలమంటూ పదికో పరక్కో అమ్మినప్పుడూ...
భూమి నవ్వడం చూశాను...

ఆ నవ్వుపై కలుపుమొక్కల్లా లేచిన అపార్టుమెంట్ల
నీలినీడలు కమ్మినప్పుడు
వాటాలేసి, వంతులేసి.. పంచుకుని
తుంచుకుంటున్నప్పుడు
భూమి నవ్వడం చూశాను..

పొక్లెయిన్ ఇనుపచేతితో గుండె పిండైనప్పుడు
వేలవేల దిమ్మెసెలతో మొహంపై
మోదైనప్పుడు ఆఖరిగా భూమి నవ్వడం చూశాను..
ఆమె నవ్వును హత్య చేసిన నిందితులను
ప్రత్యక్షంగా చూశాను...
వాదించే జడ్జిలేదు ఉరితీసే తీర్పులేదు...
చంపింది మనిషిని కాదుగా నేలను కదా..
చిట్టచివరిగా తెరలు తెరలుగా పొరలు పొరలుగా
ఓడిపోయిన భూమి పొడి నవ్వును చూశాను..

■ అమూల్య చందు



D Day

ఉన్నట్టుండి
జైలు వాతావరణం
గంభీరమైపోతుంది

పిట్ట కదలదు
కొమ్మ ఊగదు
రహస్య సంకేతమేదో
ఖైదీల్లో గుబులు రేపుతది

ఫాన్సీ రూమ్
మరింత గడ్డకట్టుకుపోతుంది
అక్కడ ప్రతి మట్టి రేణువు
ఓ కథ చెబుతుంది

ముందుగానే
ఖైదీని వీలునామా అడుగుతారు
పేదోడికి వీలునామా ఏముంటది
బతకాలన్న ఆకాంక్ష తప్ప
అదెప్పుడూ గుంజేసుకుంటారాయే

ఆరోజు
ఖైదీ మనసు చదవడం చాలా కష్టం
అంతకన్నా
ఒంటిచేత్తో సముద్రం ఈదడం సులభమేమో.

అన్నీ సరిచూసుకుంటారు
మెడకొలత, ఉరికొలత.. వగైరాలు

మెడ విరగకపోతే
ఊపిరి కోసం తండ్లాట
ఊహకందని విషయం

ఉరితాడుకు
పెరుగును, కొవ్వొత్తిని రాస్తారు
సుఖమరణ ప్రాప్తి జరగాలి కదా..

ఖైదీ ముఖానికి
నల్లని ముసుగేస్తారు
బాధ ప్రపంచానికి
తెలువొద్దనుకుంటారు గాని
తల్లిపేగు ఎక్కడో కదిలే ఉంటది

గాలి స్తంభించిపోతుంది
వన్.. టూ.. త్రీ
ఎర్రటి దస్తీ కింద పడిపోతుంది

క్రేక్ మనే లెవర్ చప్పుడుతో
ఖైదీ శబ్ద ప్రపంచం ఆగిపోతుంది

తాడు కొసన
ఒక జీవితం వేలాడుతుంది

బయట సముద్రం ఉండజుట్టుకొని
మూర్ఛపోతుంది

■ ఉదయమిత్ర







రూ. 6,500 కోట్లతో వరంగల్ అభివృద్ధి

హైదరాబాద్‌కు దీటుగా పురోగతి పనులు

అభివృద్ధి పనుల శిలాఫలకాలను డిజిటల్ స్క్రీన్‌పై ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

జనగామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరాన్ని తీర్చిదిద్దుతామని, రూ.6,500కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం జరిగిన 'ప్రజాపాలన- ప్రగతి బాట' బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం వరంగల్‌కు ఎయిర్‌పోర్టు తీసుకొచ్చానని స్పష్టం చేశారు. దీంతో పాటు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వరంగల్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్‌రోడ్డు, కాళోజీ కళాక్షేత్రం పనుల కోసం వరంగల్ నగరానికి రూ.6500 కోట్లను మంజూరు చేశామన్నారు. వరంగల్ నగరం హైదరాబాద్‌తో పోటీ పడేలా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. కడియం కావ్యను గెలిపిస్తే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ తీసుకొచ్చిందని, కాజీపేట జంక్షన్‌ను తీసుకువచ్చే బాధ్యత కూడా కావ్య తీసుకుంటుందని, అందు కోసం భుజం తట్టే బాధ్యత తనదని అన్నారు. ఓరుగల్లు గొప్ప చరిత్ర, చైతన్యం కలిగిన ప్రాంతమని, ఈ గడ్డపై రాణిరుద్రమ, ప్రతాపరుద్రుడు, సమ్మక్క సారలమ్మ, కాళోజీ, దాశరథి, దొడ్డి కొమురయ్య, సర్వాయి పాపన్న, పాల్కురికి సోమనాథుడు జన్మించారని గుర్తుచేశారు. వరంగల్‌కు ఒక ప్రత్యేకత ఉందని, రాష్ట్రానికి ఆదర్శంగా నిలబడడమే కాకుండా రాష్ట్రానికి సమస్య వస్తే నిటారుగా నిలబడి కొట్లాడే కాకతీయ యూనివర్సిటీ ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తోందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు, ఉమ్మడి వరంగల్ ప్రజలు కొట్లాడారని గుర్తు చేశారు. అందువల్లే వరంగల్ ప్రాంతమంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉంటుందన్నారు. ప్రజా సమస్యల కోసం స్పందించడమే కాకుండా సమస్యల కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర ఉందని కొనియాడారు.

> ఓట్లు అడగడానికి రాలేదు..

రాజకీయం కోసమో, ఓట్లు అడగడానికో ఈ సభను ఏర్పాటు చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం కోసం కడియం శ్రీహరి పట్టుదలతో రూ.800కోట్లు తెచ్చారని రేవంత్‌రెడ్డి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉంచేలా ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధిలో భాగంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వంద పడకల ఆస్పత్రి, సాగునీటి పనులు, డిగ్రీ కాలేజీ నిర్మాణాల కోసం రూ.800 కోట్లను మంజూరు చేశామని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, పక్కన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య

- మేం వచ్చాకే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు
- కాజీపేటకు రైల్వే డివిజన్ బాధ్యత నాదే..
- రాష్ట్రంలో ఓరుగల్లుకు ప్రత్యేక స్థానం
- కడియం శ్రీహరిని పార్టీలోకి నేనే ఆహ్వానించా..
- రూ.800కోట్లతో 'స్టేషన్‌ఘన్‌పూర్'లో ప్రగతి పరుగులు
- శివునిపల్లి బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- ఘనంగా 'ప్రజాపాలన- ప్రగతి బాట' బహిరంగ సభ

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

కడియంను పార్టీలోకి నేనే ఆహ్వానించా..

కడియం శ్రీహరి పైరవీలు చేయరని, సొంతపని అడగరని, స్టేషన్‌ఘన్‌పూర్‌కు నిధులు తీసుకెళ్లడం కోసమే వస్తారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అందువల్లే కడియం శ్రీహరిని చూస్తే తనకు భయం వేస్తుందని అన్నారు. శ్రీహరిపై తనకు ప్రత్యేకమైన అభిమానం ఉంటుందని, ఇది ఈనాటిది కాదని చెప్పారు. 25 ఏళ్ల నుంచి తనకు కడియంతో పరిచయం ఉందని, అందుకే కాంగ్రెస్ పార్టీలోకి రావాలనే తానే ఆహ్వానించానని స్పష్టం చేశారు. తనకు అండగా నిలబడాలని, మీలాంటి నిజాయితీ కలిగిన వ్యక్తి తెలంగాణ రాష్ట్రానికి అవసరం ఉందని తాను కోరానన్నారు. అందులో భాగంగానే కడియం కావ్యను ఎంపీగా గెలిపించుకునే బాధ్యత తాను తీసుకుంటానని మాట ఇచ్చారని గుర్తుచేశారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, స్టేషన్‌ఘన్‌పూర్‌లో ప్రతిపాదిత పనులు పూర్తి కావాలన్నా, భవిష్యత్తులో మరిన్ని నిధులు రావాలన్నా కడియం శ్రీహరి నాయకత్వాన్ని బలపరచాలని సీఎం కోరారు.

జయశంకర్ ఊరిని పట్టించుకోని కేసీఆర్

పదేళ్ల అధికారంలో ఉండి ప్రొఫెసర్ జయశంకర్ ఊరిని రెవెన్యూ గ్రామం కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేయలేదని, తాము అధికారంలోకి వచ్చాక రెవెన్యూ గ్రామంగా ప్రకటించామని సీఎం స్పష్టం చేశారు. తమ

మిగతా 7వ పేజీలో...



సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, భారీగా హాజరైన ప్రజలు

హోరెత్తిన 'ఘన్‌పూర్' సభ

- సుమారు 50వేల మందికి పైగా హాజరైన జనం
- కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొన్న ఉత్సాహం
- కేసీఆర్‌పై సీఎం ఘాటు వ్యాఖ్యలతో సభలో జోష్
- 850 మంది పోలీసులతో భారీ బందోబస్తు

7



సభలో నినాదాలు చేస్తున్న కళాకారులు

మాకు ఉద్యోగాలు కల్పించండి..

- సీఎం సభలో కళాకారుల నిరసన
- కుర్చీలు ఎక్కి ఫ్లెక్సీ ప్రదర్శన
- బయటకు తీసుకెళ్లిన పోలీసులు

7

వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడు

- విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తి
- నవభారత నిర్మాత, అజాత శత్రువు
- అటల్ భావోద్వేగ ప్రసంగాలు, కవితలు స్ఫూర్తిదాయకం
- మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు
- ఘనంగా 'అటల్ జీ యాదిలో' ఆత్మీయ సమ్మేళనం
- హాజరైన పలువురు సీనియర్ బీజేపీ నేతలు



సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు

6

త్వరలో గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక

- మంచినీటి ఎద్దడి నివారణకు నిధుల కొరత లేదు...
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాల తర్వాత గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం మండలంలోని ముల్కనూర్‌లో జరుగుతున్న నేషనల్ హైవే రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముల్కనూర్‌లాంటి మేజర్ గ్రామపంచాయతీలో బస్టాండ్ సమీపంలోనే నెలలకొద్ది పనులు నత్తనడకన నడవడంపై తీవ్రంగా మండిపడ్డారు. మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో పనులు నత్తనడకన నడవడంతో దుకాణదారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ.. జర్నలిస్టులు వార్తలు రాసేముందు మంచి చెడు ఆలోచించాలన్నారు. ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులు, మహిళలపై వార్తలు రాయడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రతిపక్ష పార్టీలు పేపర్లను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వంపై తప్పుడు కథనాలు రాస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పదేళ్లు అధికారంలో ఉంటే ఏనాడు కాంగ్రెస్ పార్టీ వారి కుటుంబ సభ్యులపై తప్పుడు ఆరోపణలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి అసలు పత్రికలే లేవన్నారు. వేసవి కాలంలో నీటి ఎద్దడికి ఎలాంటి నిధుల కొరత లేదన్నారు. అసౌకర్యం ఉన్నచోట ప్రజలు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకువస్తే ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ కోసం నిధులు కేటాయిస్తామన్నారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా త్వరలోనే నీటిని సరఫరా చేసేందుకు ఆయా అధికారులతో మాట్లాడనన్నారు.

అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, తాను కలిసి వంగరలో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం పేర్కొన్నారు. ఇందు కోసం భూ సేకరణ కూడా పూర్తయిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో నవోదయ పాఠశాల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. అలాగే వంగరలో పూర్తి కావస్తున్న పీవీ విజ్ఞాన వేదికను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. ముల్కనూర్ జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపం తొలగించే విషయంపై త్వరలోనే సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య, మంజులారెడ్డి, మాజీ ఎంపీపీలు కొడూరి సరోజన, అశోక్‌ముఖర్జీ, కొత్తకొండ ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ మాడ్గుల ఎల్లా, నాయకులు పాల్గొన్నారు.



ముల్కనూర్‌లో జాతీయ రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



శంభునిపేట ప్రాంతంలో నిందితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఖాకీకి చిక్కిన కిలాడీ లేడీ ముఠా


- మిల్స్‌కాలనీ పోలీసుల అదుపులో నిందితులు
- వారి వద్ద 2 కిలోల గంజాయి స్వాధీనం

కరీమాబాద్, మార్చి16,(ఆంధ్రజ్యోతి): మాయమాటలతో బాలికలను ట్రాప్ చేసే కిలాడీ లేడీ ముఠా సభ్యులను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాలోని ఒకే ప్రాంతానికి చెందిన ముగ్గురు నిందితులను ఆదివారం సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు నర్సంపేట ప్రాంతానికి చెందిన మరో ప్రధాన నిందితుడు కూడా పోలీసులకు చిక్కాడు. అరెస్టు అయిన నిందితుల వద్ద రెండు కిలోల గంజాయి లభించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ ఆధ్వర్యంలో ఈ అరెస్టులు జరిగాయి.

కాగా, ఈ ఘటనలో ప్రధాన నిందితురాలైన కిలాడీ లేడీని కొన్నిరోజుల కిందట అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన పద్ధతిలో విచారణ చేశారు. ఆమె చెప్పిన వివరాల ప్రకారం ఈ ఘటనలో పాలు పంచుకున్న ముఠాలో ఉన్న నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శంభునిపేట ప్రాంతానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. శంభునిపేట మహ్మదీయ మజీద్ కాలనీకి చెందిన కారు మెకానిక్‌గా పనిచేసే మిర్జా ఫయాజ్ అలియాస్ వదూద్, ఇదే ప్రాంతానికి చెందిన మరో కారు మెకానిక్‌గా పనిచేసే అబ్దుల్ అఫ్నాన్‌తో పాటు ఆటోడ్రైవర్‌గా పనిచేసే మహ్మద్ అల్తాఫ్‌లను ఆదివారం రాత్రి మిల్స్‌కాలనీ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం నిందితులు వాడిన కారు హనుమకొండలోని ఓ ట్రావెల్స్ నుంచి అద్దెకు తీసుకున్నారని తెలియడంతో ట్రావెల్స్‌కు వెళ్లి ఆరా తీశారు. అనంతరం నిందితులను మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కస్టడీలో ఉంచారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలి

మేయర్ గుండు సుధారాణి



హంటర్‌రోడ్డులో పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణపై నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ - 2024లో మెరుగైన ర్యాంకు సాధించాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఆదివారం బల్దియా సమీపంలోని షీటాయిలెట్స్‌తో పాటు హనుమకొండలోని డీఈవో కార్యాలయం సమీపంలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశీలించారు. అక్కడి నిర్వహణ తీరును అక్కడి నిర్వాహకులతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో నగరానికి మరోమారు ఓడీఎఫ్ 2ప్లస్ సర్టిఫికెట్ సాధిచేలా ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ ఉండాలని, నగర వ్యాప్తంగా ఉన్న పబ్లిక్ టాయిలెట్లలో ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని అన్నారు. అదాలత్ వద్ద ప్రజా మరుగుదొడ్డి నీరు లేక పని చేయడం లేదని తెలుపగా, బోరు వేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పబ్లిక్ టాయిలెట్ల వద్ద ప్రాపర్టీట్యాక్స్, ఎల్ఆర్ఎస్, స్వచ్ఛ సర్వేక్షణ్ సంబంధించిన సమాచారం ప్రజలకు తెలిసేలా ప్రదర్శించాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌తోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగం, గవర్నర్ అంటే గౌరవం లేదు..

- స్పీకర్ పట్ల జగదీశ్‌రెడ్డి వైఖరి అవమానకరం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- అశోక జంక్షన్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలు దహనం

హనుమకొండ చౌరస్తా, మార్చి16(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు రాజ్యాంగం అంటే విలువలేదని, గవర్నర్ అంటే గౌరవం లేదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఏకవచన సంబోధన చేశాడని, దళిత ప్రజాప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేశాడని నిరసిస్తూ టీపీసీసీ పిలుపు మేరకు ఆదివారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండ అశోక జంక్షన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టి బొమ్మలను దహనం చేసి ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, మహిళలపై కొందరు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పనిగట్టుకొని యూట్యూబ్, సోషల్ మీడియాలను అడ్డుపెట్టుకొని అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగాన్ని అవహేళన చేయడంతో పాటు, స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించడం సరికాదన్నారు. దొర అహంకార పోకడలతో విర్రవిగుతూ స్పీకర్, దళిత ప్రజాప్రతినిధుల పట్ల చులకనభావంతో మాట్లాడిన జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేస్తే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావులు ఎందుకు సమర్థిస్తున్నారో చెప్పాల్సిన అవరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో పాల్గొనని కేసీఆర్ కుటుంబానికి, హరీశ్‌రావుకు మాట్లాడే నైతిక హక్కు లేదని నాయిని ధ్వజమెత్తారు. వరంగల్ నగర అభివృద్ధిని చూసి ఓర్వలేక తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు.. వారి కుటుంబసభ్యులే బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, హనుమకొండ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, వేముల శ్రీనివాస్, మామిండ్ల రాజు, మానస రాంప్రసాద్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ అశోక జంక్షన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

టెన్నికాయిట్ క్రీడాభివృద్ధికి సహకారం

● కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి ● ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్



జాతీయస్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికైన క్రీడాకారులతో అతిథులు, నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో టెన్నికాయిట్ క్రీడాభివృద్ధితో పాటు క్రీడాకారులకు చేయూతను అందిస్తానని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. వరంగల్ జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా హనుమకొండ జేఎన్ఎస్ వేదికగా నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి మెన్ అండ్ ఉమెన్ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ ఆదివారం ముగిసింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య హోరా హోరీగా జరిగిన రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో ఉమెన్ విభాగంలో ఆతిథ్య హనుమకొండ జిల్లాకు చెందిన జి.అఖిల ప్రథమ స్థానంలో నిలువగా ద్వితీయ స్థానంలో వరంగల్ జిల్లా క్రీడాకారిణి బి. జ్యోతి, తృతీయ స్థానంలో హనుమకొండ జిల్లాకు మరో క్రీడాకారిణి జి.నవ్య, చతుర్థ స్థానంలో మహబూబ్‌నగర్‌కు జి.మమతలు తమ సత్తాచాటి జాతీయస్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. అదేవిధంగా మెన్ విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎం.డి. యాసిన్, సుజయంత్‌లు ప్రథమ, ద్వితీయ స్థానల్లో నిలిచి జిల్లా కీర్తి ప్రతిష్టలు అందించగా, తృతీయ స్థానంలో డి.ప్రకాశ్ హనుమకొండ, చతుర్థ స్థానంలో వరంగల్ జిల్లా క్రీడాకారుడు జి.మధులు అత్యుత్తమ ప్రతిభ రాణించడంతో జాతీయస్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యారు. కాగా, జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు సమావేశానికి కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తోందన్నారు. టెన్నికాయిట్ కోర్టుల నిర్మాణం కోసం నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టెన్నికాయిట్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు అల్వాల రాజ్‌కుమార్, గోకారపు శ్యామ్‌లు మాట్లాడుతూ.. రెండు రోజుల పండుగా వాతావరణంలో రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలను నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 25నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పసునూరి దయాకర్, శాట్ కోచ్ సద్గురు, టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు బీఆర్. అంబేద్కర్, కోశాధికారి జాహంగీర్, సెపక్‌తాక్ర అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జితేంద్ర నాథ్, పీడీ వై. సురేందర్, సీనియర్ క్రీడాకారులు, వివిధ జిల్లాలకు చెందిన అసోసియేషన్ల బాధ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

వాజ్‌పేయి గొప్ప రాజనీతిజ్ఞుడు

» మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు
» ఘనంగా 'అటల్ జీ యాదిలో' ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు

న్యూశాయంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విలువలకు కట్టుబడిన గొప్ప రాజనీతిజ్ఞుడని, తాను నమ్మిన సిద్ధాంతాలకు జీవితాంతం కట్టుబడి ఆదర్శప్రాయంగా జీవించిన మహోన్నత వ్యక్తి అని మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు శ్లాఘించారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని డికన్వెన్షన్ బంకెట్ హాల్‌లో అటల్ జీ యాదిలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసాగర్‌రావు తొలుత వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత రాజకీయాల్లో భావజాలాలకు అతీతంగా అందరి గౌరవాన్ని పొందిన ఏకైక వ్యక్తి అటల్ అన్నారు. బతికినన్ని రోజులు అజాత శత్రువుగా అందరి మన్ననలను పొందిన మహోన్నతవ్యక్తి అని అభివర్ణించారు. జర్నలిస్టుగా వాజ్‌పేయి ప్రస్థానం ప్రారంభమైందని, శ్యాంప్రసాద్ ముఖర్జీతో ఉన్న అనుబంధం అపర దేశభక్తుడిగా మార్చిందన్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ బోధనలు విని భరత బిడ్డల రోదనలు చూసి భారతీయ ఆత్మను అర్థం చేసుకొని ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉండాలని నిర్ణయించుకున్నాడని విద్యాసాగర్‌రావు చెప్పారు. అధికార వ్యామోహంలేని వాజ్‌పేయి ఒక్క ఓటుతో ప్రభుత్వం పడిపోతుందని తెలిసి ఢిల్లీపీఠాన్ని తృణప్రాయంగా వదిలుకున్నాడు కానీ.. విలువలను వదులుకోని గొప్ప వ్యక్తి అన్నారు. ప్రధానమంత్రిగా వాజ్‌పేయి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాడన్నారు. స్వర్ణభుజి రహదారులతో నవ భారత నిర్మాణానికి పునాదులు వేశాడని, పనికి ఆహార పథకం తెచ్చి కోట్లాది మంది ప్రజల ఆకలి తీర్చాడన్నారు. ప్రధాన మంత్రి సడక్‌యోజనతో మారుమూల పల్లెలకు కూడా బీటీ రోడ్లు నిర్మించాడని కొనియాడారు. పొక్రాన్‌లో అణుపరీక్ష నిర్వహించి శత్రు దేశాల వెన్నులో వణుకు పుట్టించాడని, ఎన్ని దేశాలు ఒత్తిడి చేసినా, ఆర్థికపరమైన ఆంక్షలు విధించినా వెనక్కి తగ్గని మొండి ధైర్యం వాజ్‌పేయి సొంతమని విద్యాసాగర్ రావు శ్లాఘించారు. వాజ్‌పేయ కవితా పటిమ ఈ దేశంలోని ఏ రాజకీయ నాయకుడికి రాలేదని, ఆయన భావోద్వేగ ఉపన్యాసాలకు మంత్రముగ్ధం కాని ఏ ప్రపంచ వేదిక లేదని పేర్కొన్నారు. భారత మాత కన్న అసలు సిసలైన భారత రత్న వాజ్‌పేయి అని విద్యాసాగర్ అన్నారు.

మాజీ ఎంపీ, వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల సంధానకర్త అజ్మీరా సీతారాం నాయక్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా దేశశ్రేయస్సు కోసం నిరంతరం పరితపించిన గొప్ప నాయకుడు వాజ్‌పేయి అని అన్నారు. వాజ్‌పేయి ప్రసంగాలు బీజేపీ శ్రేణులకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే నన్నారు. ఆయన చూపిన బాటలో బీజేపీ ముందుకు సాగు తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ తప్పిదాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రస్తుతం కాంగ్రెస్ చేస్తున్న పొరపాట్లతో రేపు రాష్ట్రం బీజేపీ నేతృత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ రానున్నదన్నారు. వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల నుంచి పొందే ప్రేరణ రాష్ట్రంలో బీజేపీని మరింత బలంగా ముందుకు తీసుకుపోగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కాగా, తొలుత బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లా ల అధ్యక్షులు గంటా రవికుమార్, కొలను సతీష్ రెడ్డి మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావుకు స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ బీజేపీ అధ్యక్షుడు నాగపురి రాజమౌళి గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు మంద అయిలయ్య, కన్నబోయిన రాజయ్య యాదవ్, దేవేందర్ రెడ్డి, నిశిధర్ రెడ్డి, బలరాం, సోడా రమేష్‌తోపాటు వాజ్‌పేయి సుదీర్ఘ రాజకీయ, పరిపాలనలో ఆయనతో కలిసి ప్రయాణించిన వారు, వారి ఆశయాలను కొనసాగిస్తున్నవారు ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. వాజ్‌పేయికి సంబంధించిన తీపి జ్ఞాపకాలుగా తమ వద్ద ఉన్న ఛాయాచిత్రాలు, ఆయనతో జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు ఈ సందర్భంగా సమ్మేళ నంలో అందజేశారు.

పాకాలలో వన్య ప్రాణుల వేట

» కనుజు మాంసం, కొండగొర్రెను ఆటోలో తరలిస్తున్న వేటగాళ్లు
» ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో వెలుగులోకి వచ్చిన వైనం

ఖానాపురం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకాల అభయారణ్యంలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా జరుగుతోంది. అటవీ ప్రాంతంలో వేటగాళ్లు వన్య ప్రాణులను వేటాడుతూ, వాటి మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని చిలుకమ్మనగర్ శివారులోని పాకాల సరస్సు సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఉచ్చులు ఉపయోగించి వన్య ప్రాణులను వేటాడి ఆటోలో తరలిస్తుండగా ఆదివారం దొరికిపోయారు. నర్సంపేట రేంజ్ ఆఫీసర్ రవికిరణ్, డీఆర్వో రీణా తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్‌నగర్‌కు చెందిన ఇమ్మడి యాకాంబ్రం, చిలుకమ్మనగర్‌కు చెందిన ఇస్లావత్ సుధీర్, బంగారి సుమన్, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం మొండ్రాయిగూడెంకు చెందిన లవణ్‌కుమార్‌లు చిలుకమ్మనగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉచ్చులతో వన్య ప్రాణులను వేటాడారు. ఉచ్చుల్లో కనుజు, కొండగొర్రె పడ్డాయి. కనుజును అక్కడే మాంసంగా ముక్కలు చేసి మూటలో కట్టారు. గొండగొర్రె కళేబరాన్ని, కనుజు మాంసాన్ని ఆటోలో చిలుకమ్మనగర్ నుంచి అశోక్‌నగర్‌కు తరలిస్తుండగా పాకాల చెక్‌పోస్ట్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొట్టడంతో ఆటో బోల్తా కొట్టింది.

దీంతో ఆటోలో ఉన్న కనుజు మాంసం, కొండగొర్రె కళేబరం రోడ్డు పక్కన పడ్డాయి. ప్రమాదం జరగడంతో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ బస్సు దిగి చూడగా కొండగొర్రె కళేబరం కనిపించింది. దీంతో వేటగాళ్లు ఆటోను లేపి ఆదే వాహనంలో కనుజు మాసం మూటతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న యాకాంబ్రం కాలు వేలు విరగడంతో చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి గొండగొర్రె కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. వేటగాళ్ల కోసం అన్వేషించి సుధీర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం 1972 ప్రకారం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో రవి కిరణ్ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న కొండగొర్రె కళేబరాన్ని చూపుతున్న ఫారెస్ట్ అధికారులు →



కేయూలో టెక్నోల సందడి

» సంప్రదాయ వంటకాలు.. చూడ ముచ్చటైన ఆటలు
» ప్రత్యేక అకర్షణగా మెహందీ డిజైన్లు
» ఫ్లాష్ మాబ్‌తో అదరగొట్టిన విద్యార్థులు
» మినీ ప్రపంచానికి తలపించిన కేయూ కో ఎడ్ ఇంజనీరింగ్ కళాశాల



అధ్యాపకులకు మెహందీ డిజైన్లు వేస్తున్న టెక్నోలు



ఫ్లాష్‌మాబ్ నృత్యం చేస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

కేయూ క్యాంపస్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల మినీ ప్రపంచానికి తలపించింది. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే అలూమ్నీ - 2025 టెక్నోల సందడిలో భాగంగా మొదటి రోజు ఆదివారం ఇంజనీరింగ్ విద్యార్థులు సంప్రదాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఇంజనీరింగ్ టెక్నో విద్యార్థులు సంప్రదాయకరమైన దుస్తులు ధరించారు. అలూమ్నీ - 2025 పేరుతో విద్యార్థులకు రెండురోజుల పాటు ప్రత్యేక సందడి నిర్వహించనున్నారు. ఆదివారం కళాశాల అవరణలో సంప్రదాయ వంటకాలను తయారు చేసుకుని తోటి విద్యార్థులకు పంచుకుని తింటూ సందడి చేశారు. అధ్యాపకులకు విద్యార్థినులు మెహందీ డిజైన్లు వేస్తూ ప్రత్యేక అకర్షణగా నిలిచారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఎలక్ట్రికల్స్, కంప్యూటర్స్, మెకానికల్, సివిల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ సైన్స్, ఈఈఈ విభాగాల విద్యార్థులు ఫొటో ఫ్రేమ్‌లు సుందరంగా తయారు చేశారు. ఫొటోలను విభిన్న రూపాల్లో ప్రత్యేక ఆకర్షణీయంగా సృష్టించారు. గ్రూపు ఫొటోలతో అదరగొట్టారు. విద్యార్థులు అధ్యాపకుల చేతులకు తీరొక్క డిజైన్లతోనూ మెహందీ వేసి తమ ప్రతిభ చూపారు. ప్రత్యేక ఇంజనీరింగ్ సబ్జెక్టులతో కూడిన ఆటపాటలతో విద్యార్థులు హోరెత్తించారు. ఒకరి వంటకాలను మరొకరు తింటూ ఎంజాయ్ చేశారు. కళాశాల కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ, ఈఈఈ విభాగం బీవోఎస్ చైర్‌పర్సన్ ఎం.సుమలత, ఇతర అధ్యాపకులు ఎం.వాణి, ఈ.రాజేశ్వరి, వందన, భాగ్యలక్ష్మి, డాక్టర్ బి. అనిల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, కళాశాల సూపరింటెండెంట్ బొల్నేపాక ప్రభాకర్, డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నోల ఫ్లాష్ మాబ్

కళాశాల విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఫ్లాష్‌మా బ్‌లో అద్భుత నృత్యాలతో అదరగొట్టారు. బ్లూ జీన్స్ పాయింట్, బ్లాక్ టీషర్టులు వేసుకుని సొగసైన స్టెప్పులతో విద్యార్థులు డ్యాన్సలతో హోరెత్తించారు.

నేడు కో ఎడ్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవం

కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ కళాశాల స్పోర్ట్స్, కల్చర్ డేను సోమవారం సాయంత్రం 4గంటలకు నిర్వహిస్తారు. దీనికి ముఖ్యఅతిథిగా కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంతో పాటు ప్రత్యేక ఆహ్వానితులుగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇండియా హాకీ జట్టు రిటైర్డు కోచ్ పి.మధుకరణ్, హనుమకొండ ఏసీపీ కె.దేవేందర్‌రెడ్డిలు హాజరుకానున్నారు. సభాధ్యక్షుడిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ వ్యవహరిస్తారు. కల్చరర్, స్పోర్ట్స్ కన్వీనర్లుగా డాక్టర్ సీహెచ్ రాధిక, డాక్టర్ వి.మహేందర్, డాక్టర్ ఎం.డి. ఇసీం ఇక్బాల్, డాక్టర్ కె.శ్రీధర్‌కుమార్, డాక్టర్ ఎం.కల్పనాదేవి, ఎం.వాణి, డాక్టర్ బి.అనిల్‌కుమార్, డాక్టర్ ఎ.కుమారస్వామిలు వ్యవహరిస్తారు.

24 నుంచి కేయూ దూరవిద్య డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో అందిస్తున్న బీఏ, బీకామ్, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సుల మొదటి ఏడాది మొదటి సెమిస్టర్ పరీక్షలు మార్చి 24 నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పద్మజలు ఆదివారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. మార్చి 24, 26, 28, ఏప్రిల్ 2, 4 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడలని పేర్కొన్నారు.

ఆరోగ్య విశ్వవిద్యాలయానికి అనారోగ్యం

» స్నాతకోత్సవాన్ని మరిచిన అధికారులు
» ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇప్పటివరకు గోల్డ్‌మెడల్స్ ఇవ్వని వైనం
» కాన్వకేషన్ పేరుతో ఫీజులు మాత్రం వసూలు



వరంగల్‌లోని కాళోజీ యూనివర్సిటీ

వరంగల్ మెడికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అనారోగ్యం బారిన పడుతోంది. అనేక సమస్యలతో సమతమతమవుతూ కనీసం విద్యార్థులకు కాన్వకేషన్ నిర్వహించే స్థితిలో లేకపోవడంపై విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత అట్టహాసంగా ప్రారంభించిన రాష్ట్రస్థాయి ఆరోగ్య విశ్వవిద్యాలయం పరిపాలన నిర్లక్ష్యంతో అబాసు పాలువుతోంది.

ప్రక్షాళన చేయండి..

ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆవిర్భావం నుంచి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సిబ్బంది కొరతతో సతమతమవుతోంది. పదవీకాలం ముగిసిన వీసీ పట్టించుకోవడం లేదు. సమస్యల పరిష్కారం కోసం దూరం నుంచి వచ్చిన వారికి ఇబ్బందులే ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆరోగ్యశాఖ మంత్రి నూతన వీసీని నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

స్నాతకోత్సవాన్ని మరిచిన వర్సిటీ అధికారులు

2016-17 విద్యా సంవత్సరం నుంచి కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఎంబీబీఎస్, పీజీ వైద్య విద్య, పీజీ ఫార్మసీ, నర్సింగ్ విద్య, ఆయూష్ వైద్య విద్య కోర్సులను నిర్వర్తిస్తోంది. యేటా వందల సంఖ్యలో విద్యార్థులు పట్టాలు తీసుకుంటున్నా ఇంతవరకు స్నాతకోత్సవం నిర్వహించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

గోల్డ్ మెడల్స్ కరువు

వివిధ కోర్సులలో మెరిట్ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వివిధ విశ్వవిద్యాలయాలు గోల్డ్‌మెడల్స్ అందిస్తాయి. కానీ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం మాత్రం విశ్వవిద్యాలయం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఏ ఒక్క విద్యార్థికి ఇలాంటి మెడల్స్ అందించిన దాఖలాలు లేవు.

పదవీ కాలాన్ని మించి కొనసాగుతున్న వీసీ

ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతిగా తొలిసారి ఏర్పాటైన ఉపలకుపతి పదవీకాలం ముగిసి ఏళ్ల గడుస్తున్నా ఇంకా కొనసాగడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం సెర్చ్ కమిటీ ఏర్పాటు చేసినా ఇంతవరకు నూతన వీసీ నియామకం చేపట్టకపోవడం కూడా విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నూతన వీసీ హయాంలోనైనా స్నాతకోత్సవం, గోల్డ్‌మెడల్స్ అందించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సేవా భాగ్యం గొప్ప వరంగా స్వీకరించండి

● లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ రామకృష్ణమూర్తి
● ఘనంగా 'సంకల్ప నివేదిత' సదస్సు



గోపాల కృష్ణమూర్తిని సన్మానిస్తున్న జిల్లా లయన్స్ నాయకులు



పెద్ద సంఖ్యలో పాల్గొన్న లయన్స్ ప్రతినిధులు

మడికొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మానవుడి సేవయే మాధవ సేవగా భావిస్తూ ప్రతిఒక్కరూ చిరునవ్వుతో సేవలు చేయాలని, సేవా భాగ్యం గొప్ప వరంగా స్వీకరించాలని లయన్స్ అంతర్జాతీయ పూర్వ డైరెక్టర్ కొయంబత్తూరు నుంచి విచ్చేసిన జి.రామకృష్ణమూర్తి అన్నారు. ఆదివారం మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాల్ వేదికగా నేత్రపర్వంగా 320 ఎఫ్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సంకల్ప నివేదిత సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్టిపుల్ స్థాయిలో వరంగల్ ఉమ్మడి జిల్లాలతో కూడిన 320 ఎఫ్‌కు ఎంతో గొప్ప పేరుందని కొనియాడారు. వెంకట్‌రెడ్డి నాయకత్వంలో చారిటబుల్ కంటి ఆస్పత్రితో పాటు ఇతర అవసరార్థులకు నిర్వహించిన సేవలు వెలకట్టలేనివన్నారు. జిల్లా గవర్నర్ వెంకట్‌రెడ్డి అధ్యక్షోపన్యాసం చేస్తూ రిటెన్షన్‌లను మినహాయిస్తే 600 మంది కొత్త సభ్యులు, 6 నూతన క్లబ్‌లతో ఈ లయనిస్టిక్ సంవత్సరం ఇప్పటి వరకు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. జిల్లాలో మహబూబాబాద్, జనగామ, తొర్రూరు, హనుమకొండలో ఆరు సదస్సులను లక్ష్యాలకనుగుణంగా నిర్వహింపజేసుకున్నామన్నారు.

కనులపండుగలా బ్యానర్ ప్రజంటేషన్

వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 70 లయన్స్ క్లబ్‌ల నాయకులు, ప్రతినిధులు నిర్వహించిన బ్యానర్ ప్రజెంటేషన్ రెండు గంటల పాటు నేత్రపర్వంగా కొనసాగింది. చైర్మన్ పిడిజి ముచ్చ రాజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీజేలో ఉర్రూతలూగించేలా వస్తున్న పాటలకు అనుగుణంగా స్టెప్పులేస్తూ, పాటలకు అనుగుణంగా ఆహార్యంతో, చేతితో ఆయా క్లబ్బులు చేపట్టిన సేవా కార్యక్రమాల ప్లకార్డులను ప్రదర్శిస్తూ కొనసాగింది. చేర్యాల, తొర్రూర్ క్లబ్‌లు ప్రదర్శించిన బ్యానర్ ప్రజంటేషన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి బహుమతులనందుకున్నాయి.

నూతన గవర్నర్‌గా డాక్టర్ ఆర్య

వచ్చే 2025-26 అయనిస్టిక్ సంవత్సరానికి 2230 ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్స్ క్లబ్ ఆఫ్ ఆత్మీయ వరంగల్‌కు చెందిన డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, మొదటి జిల్లా గవర్నర్‌గా లయన్స్ క్లబ్ ఆఫ్ మనుమకొండ థౌజండ్ పిల్లర్స్ కు చెందిన నరహరి సుధాకర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, ప్రతిష్ఠాత్మక సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు పి. హరికిషన్‌రెడ్డి, రేవూరి కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ అజిత్‌కుమార్‌లు పోటీ పడుతున్నారు. కార్యక్రమంలో మల్టిపుల్‌నాయకులు నరేందర్‌రెడ్డి, దీపక్ భట్టాచార్య, ఆవుల గోపాల్‌రావు, పూర్వ చైర్మన్ ప్రొఫెసర్ వి. గోపాల్‌రెడ్డి, కన్నా పరుశురాములు, ప్రస్తుత కార్యదర్శి ఎన్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా పీడీజీలు డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కె.రాజేందర్‌రెడ్డి, బి.లక్ష్మీనర్సింహారావు, జాన్‌బన్నీ తదితరులు పాల్గొన్నారు. నివేదిత సంకలనం ఆహ్వాన సంఘం పక్షాన చైర్మన్ ఒద్దిరాజు గణేష్ స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో కె.రామ్‌గోపాల్‌రెడ్డి, పెండెం వేణుమాధవ్, టి. నరేందర్, సిరికొండ భాస్కర్, పెద్ది రేవతి, త్రివేణిరెడ్డి, తాడూరి రేణుక, నెల్లుట్ల రమాదేవి, వీణావాణి తదితరులు పాల్గొన్నారు.



WANTED
★ Wanted Female Marketing Executive's for a Reputed Pvt.Ltd Company, Salary : 12,000-20,000 Quali:- Inter/Degree, Age : 24 to 30 Contact : 7660009009, 7036229903
AJW-217389

FOR SALE
★ An Reputed Book Stall and xerox Shop for Sale. Near Nayeemnagar, Opposite to police Head Quarters, Hanamkonda. Contact : 8074797209
AJW-226245

WANTED
★ హన్మకొండ లోని ప్రముఖ కో-ఆపరేటివ్ బ్యాంకు నందు పనిచేయుటకు బ్యాంకింగ్ రంగంలో అనుభవం గల Accountants, Cashier, Service Managers కావలెను. అర్హత : డిగ్రీ/M.B.A. సం॥ప్ర॥ 9441863251.
AJW-226244

టూర్స్ & ట్రావెల్స్
★ శ్రీరంగం రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం గురువాయూర్ పొలని అరుణాచలం స్లీపర్ కోచ్ బస్ 22,500/- (20-03-2025 సాయంత్రం) పూర్తి వివరాలకు సం॥ప్ర॥ 9949758499
AJW-226095

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను
★ Wgl లో గల టెక్స్‌టైల్ పార్క్ నందు పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. అర్హత : S.S.C వయస్సు : 18 సం॥ల పైన జీతం: 13,000/- నుండి 15,000/- + E.S.I, E.P.F. సం॥ప్ర॥ 9848022808, 8978459111
AJW-491

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

3+2 స్కీం కలదు

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232



స్టేషన్ ఘన్‌పూర్ బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి, వేదికపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, నాయకులు


చేపల వలతో సీఎం రేవంత్‌రెడ్డి

హోరెత్తిన ఘన్‌పూర్ సభ

సుమారు 50 వేల మందికి పైగా హాజరైన జనం
కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొన్న ఉత్సాహం
కేసీఆర్‌పై సీఎం ఘాటు వ్యాఖ్యలతో సభలో జోష్


సభకు తరలి వస్తున్న మహిళలు

జనగామ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన- ప్రగతి బాట్ బహిరంగ సభ విజయవంతమైంది. సభకు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచే కాకుండా జనగామ నియోజకవర్గం, వరంగల్ నగరం నుంచి ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చారు. సీఎం రావడానికి గంట ముందే సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సభకు 50వేల మందిని తరలించాలని అధికారులు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి భావించగా అంతే మొత్తంలో సభకు జనం వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సీఎం 33 నిమిషాలు ప్రసంగించగా ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. సభకు వచ్చిన ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్త కోసం వాటర్, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. ముందస్తు చర్యల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. సభకు జనం భారీగా తరలిరావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. సీఎం ప్రసంగం ఆద్యంతం కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ప్రతిపక్ష నేత కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీ నేతలపై రేవంత్‌రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలకు సభికుల నుంచి విశేష స్పందన లభించింది. సీఎం సభ నేపథ్యంలో 850 పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

40 నిమిషాలు ఆలస్యంగా సీఎం రాక

సీఎం షెడ్యూల్‌కు 40నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. మధ్యాహ్నం 1గంటకు రావాల్సిన సీఎం 1.40గంటలకు హెలిక్యాప్టర్‌లో సభాస్థలి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో చేరుకున్నారు. అక్కడ సీఎంకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఘనస్వాగతం పలికారు. శాలువాలు కప్పి బొకే అందించి ఆహ్వానించారు. అక్కడి నుంచి నేరుగా స్టాళ్లను సందర్శించారు. ఒగ్గు, ఇతర కళాకారులు డప్పు చప్పుళ్లు, గిరిజన మహిళ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెంబర్తి హస్తకళలు, సిలికాన్ కాటన్ టెక్స్‌టైల్, స్వయం సహాయక సంఘాల సభ్యులు చేసిన స్వగృహ ఉత్పత్తులు, విజయ డెయిరీ, ఆయిల్‌పామ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ స్టాళ్లను సీఎం ఆసక్తిగా తిలకించారు. మహిళలను, సిబ్బందిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. తర్వాత ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి ఒక్కో బస్సు చొప్పున 7 ఆర్టీసీ బస్సులు మంజూరవగా వాటిని సీఎం ప్రారంభించారు.

అక్కడి నుంచి నేరుగా సభా వేదికపైకి మధ్యాహ్నం 1.57 గంటలకు చేరుకున్నారు. ప్రజలకు అభివాదం అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీఎంను శాలువా బొకేతో సన్మానించారు. ఆ తర్వాత జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలాకాలను వేదిక పైనుంచే రిమోట్ ద్వారా ఆవిష్కరించారు. కాగా.. బహిరంగ సభలో భాగంగా సీఎం మధ్యాహ్నం 2.54 గంటలకు నుంచి 3.27గంటల వరకు 33 నిమిషాల పాటు ప్రసంగించారు. సభ ముగిసిన అనంతరం 3.30 గంటలకు హెలికాప్టర్‌ద్వారా తిరుగు ప్రయాణమయ్యారు. మొత్తంగా ఒక గంటా 50 నిమిషాల పాటు పర్యటన సాగింది.



నృత్యం చేస్తున్న కళాకారులు, చిన్నారులు →


సీఎం సభకు ట్రాక్టర్‌పై వస్తున్న మహిళలు

మాకు ఉద్యోగాలు కల్పించండి..

- సీఎం సభలో కళాకారుల నిరసన
- కుర్చీలు ఎక్కి ఫ్లెక్సీ ప్రదర్శన


నిరసన తెలుపుతున్న కళాకారులను అడ్డుకుంటున్న పోలీసులు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కళాకారులుగా పనిచేసిన వారిని గత ప్రభుత్వం విస్మరించడంతో పాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేయడంపై రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ సీఎం సభలో నిరసన వ్యక్తం చేశారు. సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో బాధిత మహిళా కళాకారులు ఒక్కసారిగా కుర్చీల పైకి ఎక్కి వారి వెంట తెచ్చుకున్న 'మా ఉద్యమ, నిరుద్యోగ కళాకారులకు సారథిలో ఉద్యోగాలు కల్పించాలి' రాసి ఉన్న ఫ్లెక్సీని ప్రదర్శించారు. సీఎం వెంటనే స్పందించి.. 'చూశాను కూర్చోండి..' అని సూచించారు. అక్కడ ఉన్న మహిళా పోలీసులు కళాకారులను కిందకు దింపి సభ నుంచి బయటకు తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా బాధిత కళాకారులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం సమయంలో కళాకారులుగా పనిచేశామని, గత ప్రభుత్వం రాష్ట్రంలో 550 మందికి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. నిజమైన కళాకారులమైన తమలాంటి 750 మందిని విస్మరించారన్నారు. అనేకసార్లు గత సీఎంకు తమ గోడును వినిపించినా పట్టించుకోలేదని, అసెంబ్లీ ఎన్నికల ముందు నిరసన సమయంలో అప్పుడు ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తమ ప్రభుత్వం రాగానే ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాగా, అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ అపాయింట్‌మెంట్ లభించడం లేదని, పలుమార్లు ఆయన ఇంటికి వెళ్లినా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. తమ సమస్య సీఎం దృష్టికి వెళ్లాలనే ఉద్దేశంతో నిరసనను వ్యక్తం చేశామన్నారు.

హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల, సూర్యాపేట, యాదాద్రి, భువనగిరి జిల్లాలకు సంబంధించిన 200 మంది కళాకారులం సీఎంకు తమ సమస్యను శాంతియుతంగా ఫ్లెక్సీ ద్వారా ప్రదర్శించడానికి వచ్చామని వెల్లడించారు. అందరం ఒకే చోట కూర్చునే అవకాశం రాకపోవంతో కొందరు మాత్రమే నిరసన వ్యక్తం చేయాల్సి వచ్చిందన్నారు. నిరసన వ్యక్తం చేసిన తమను మహిళా పోలీసులు విచక్షణారహితంగా బయటకు లాక్కెల్లడం సరికాదని వాపోయారు. ఈ కార్యక్రమంలో కళాకారులు అనువోజు వెంకటేష్, మట్టెడ కవిత, దబ్బెటం పుష్ప, పరకాల రమ, కొండ్రా కుమార్, పున్న రమేష్, పట్టెం స్రవంతి, మోతె రమేష్, రాణి, అలేఖ్య, రోజా, స్వరూప, స్రవంతి, సంతోషిని, బాలమణి, సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా..

- మధ్యాహ్నం 1.40గంటలకు హెలిప్యాడ్‌లో ల్యాండింగ్
- 1.48గంటలకు సీఎంకు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే ఘన స్వాగతం
- 1.51 గంటలకు మహిళా శక్తి బస్సుల ప్రారంభం
- 1.52 గంటలకు స్టాళ్ల సందర్శన
- 1.57 గంటలకు వేదికపైకి చేరుకున్న సీఎం
- 1.59 గంటలకు జ్యోతి ప్రజ్వలన
- 2.04 గంటలకు రిమోట్ ద్వారా శిలా ఫలాకాల ఆవిష్కరణ
- 2.54 గంటలకు ప్రసంగం ప్రారంభం
- 3.27 గంటలకు ప్రసంగం ముగింపు
- 3.30 గంటలకు హెలికాప్టర్‌లో తిరుగుప్రయాణం


సభలో అభివాదం చేస్తున్న సీఎం

వడ్డీ మాఫీ పథకం ప్రారంభం

జనగామ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంబంధించి వడ్డీ మాఫీ పథకాన్ని సీఎం రేవంత్ స్టేషన్‌ఘన్‌పూర్ సభా వేదిక నుంచి ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ కింద గతంలో తీసుకున్న రుణాలకు సంబంధించిన వడ్డీని చెల్లించారు. మహిళలు చెల్లించిన వడ్డీని మాఫీ చేస్తూ తిరిగి వారి ఖాతాల్లో ప్రభుత్వం చెల్లించాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 92.74 కోట్ల వడ్డీ మాఫీకి సంబంధించిన చెక్కును డీఆర్‌డీఏ అధికారులు, మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి అందించారు. దీంతో పాటు బ్యాంకు లింకేజీ కింద జనగామ జిల్లాకు రూ.100.93కోట్ల రుణాలకు సంబంధించి చెక్కును సైతం అందజేశారు.


మహిళా సంఘాలకు చెక్కు అందిస్తున్న సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ

పేదోళ్ల కష్టాలు తీర్చే ప్రభుత్వం ఇది..

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పేదోళ్ల కష్టాలు తీర్చే ప్రభుత్వం.. కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన సీఎం సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై మాట్లాడని వ్యక్తి కేసీఆర్ అని, ప్రజల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడేవారన్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీకి కేవలం రెండుసార్లు మాత్రమే వచ్చారన్నారు. ఎక్కడ నిజాలు మాట్లాడాల్సి వస్తుందనే భయంతోనే కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటే భయపడుతున్నాడని విమర్శించారు. లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్.. ఇందిరమ్మ ప్రభుత్వంపై మాట్లాడడం సరికాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రోజుకు 16గంటల పాటు పని చేస్తున్నారని, అలాంటి వ్యక్తిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓడినా కూడా సిగ్గులేకుండా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఎమెల్యే కడియం శ్రీహరి పట్టువదలని విక్రమార్కుడని, నియోజకవర్గానికి రూ.800కోట్ల నిధులు తీసుకురావడం గొప్ప విషయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్షల కోట్ల రూపాయలు కేసీఆర్ వృథా చేశారన్నారు.

10 నెలల పాలనలో 47 వేల ఉద్యోగాలు ఇచ్చాం..

మంత్రి సీతక్క



బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల కాలంలో 84వేల ఉద్యోగాలు ఇస్తే, 10నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం 57 వేల ఉద్యోగాలు ఇచ్చిందని పంచాయతీరాజ్, గిరిజన శాఖామంత్రి ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. 10 ఏళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2లక్షల ఇళ్లు కూడా ఇవ్వలేదని, కానీ, ఏకకాలంలో నాలుగున్నర లక్షల ఇండ్లను ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం, మహిళల నాయకత్వాన్ని బలపర్చడం, ఉద్యోగ ఉపాధి కల్పించడమన్నారు. పేదలకు కూడు, గుడ్డ కల్పించడమన్నారు. ఉద్యోగాలు, ఇళ్లు ఇస్తుంటే ప్రతిపక్షాలు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారన్నారు. బీఆర్‌ఎస్ అంటేనే మహిళలను అణగదొక్కడం, అట్టడుగు వర్గాలను అణగదొక్కడమని, అహంకారాన్ని ప్రదర్శించడమని తెలిపారు. 30ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణకు రూపం తీసుకువచ్చామని తెలిపారు. బీసీ కుల గణన చేబడితే బీఆర్‌ఎస్, బీజేపీలు అక్కసు వెళ్లబోసుకుంటున్నాయని తెలిపారు. రాష్ట్రంలోకి అక్కాచెల్లెల్లకు సోదరుడిగా సీఎం రూ.92కోట్ల మహిళలకు అందిస్తున్నారని తెలిపారు. బీజేపీ కులాల పేరుతో రాజకీయం చేస్తోందన్నారు. ఓట్ల కోసం కులాలను, మతాలను బీజేపీ రెచ్చగొడుతోందన్నారు.

తెలంగాణను బీఆర్‌ఎస్ నాశనం చేసింది..

మంత్రి కొండా సురేఖ



బీఆర్‌ఎస్ తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేసిందని దేవాదాయశాఖ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. హైదరాబాద్‌కు సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, అందుకు తగిన వనరులు ఇక్కడ ఉన్నాయన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ఉన్నన్ని రోజులు రాష్ట్రంలో మహిళకు ఇబ్బందులు రావని భరోసా ఇచ్చారు. సీఎం ఇచ్చినమాట తప్పరని పేర్కొన్నారు. పదేళ్లలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడిందని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి తోడ్పాటుతో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందన్నారు.

సీఎం సహకారంతో వరంగల్ అభివృద్ధి

వరంగల్ ఎంపీ కడియం కావ్య



సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిలో ముందుకు వెళ్తోందని వరంగల్ ఎంపీ కడియం కావ్య పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారని, రానున్న రోజుల్లో గుజరాత్ మాడల్‌గా కాకుండా దేశంలో తెలంగాణ మోడల్‌గా నిలిచేలా కృషి చేస్తున్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అభివృద్ధిలో కడియం ముందు వరుసలో ఉంచుతున్నారని తెలిపారు. వరంగల్ అంటే సీఎంకు ఎంతో అభిమానమన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు మామునూరు ఎయిర్‌పోర్టును, రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని తీసుకురావడానికి ఎంతగానో సీఎం కృషి చేశారన్నారు.

అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న సీఎం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం, రేవంత్ రెడ్డి పిలుపు మేరకు ఆయనతో తనకు ఉన్న స్నేహం, నమ్మకంతో కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. పార్టీలో చేరిన తక్కువ సమయంలోనే నియోజ కవర్గానికి రూ.800కోట్ల నిధులు మంజూరు ఇవ్వడమే కాకుండా శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సీఎం, అధికారుల సహకారంతో 18నెలల కాలంలో శంకుస్థాపన చేసి పనులన్నింటినీ పూర్తిచేసి ప్రారంభిస్తానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి ప్రభుత్వం ద్వారా 3,500 ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని, వీటికి తోడుగా సీఎం స్టేట్ రిజర్వు కోటా నుంచి మరికొన్ని ఇండ్లు ఇవ్వాలని సీఎంను కోరారు. ఘన్‌పూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి నిధులు ఇవ్వాలని కోరారు. 15 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అవినీతి, అక్రమాలు, పదవులు, పనులు, పథకాలు అమ్ముకోవడం, తాగడం, తూలడం తప్ప ఒరిగిందేమీ లేదన్నారు. వర్ధన్నపేట, పాలకుర్తి, ఘన్‌పూర్, తుంగతుర్తి నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి దేవాదుల ఎత్తిపోతల పథకం ప్యాకేజీ-6 ఫేజ్-3 ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. చిలుపూర్, వేలేరు రెండు మండలాలు కొత్తగా ఏర్పడ్డాయని, మండల కాంప్లెక్స్‌ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రాన్ని దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని సీఎం చూస్తున్నారన్నారు.


మహిళా సంఘాలకు బస్సులను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు




సభ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రూ.6,500 కోట్లతో వరంగల్ అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం వచ్చాకే వరంగల్‌కు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్‌రోడ్డు, కాళోజీ కళాక్షేత్రం వచ్చాయని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాకే స్టేషన్‌ఘన్‌పూర్ రూ.800కోట్లు వచ్చాయని, వీటితో ఇంటిగ్రేటెడ్ స్కూల్, వంద పడకల ఆస్పత్రి, డిగ్రీ కాలేజీ నిర్మించుకోగలుగుతున్నామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ప్రతీ సమస్యను పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బలరామ్‌నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం సభకు హాజరైన ప్రజలు



కిడ్నీ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

వరంగల్ మెడికల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ముత్య కిడ్నీ సెంటరులో ఏర్పాటు చేసిన ఉచిత కిడ్నీ వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో కిడ్నీ రోగులు ఆస్పత్రికి చేరుకున్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో నెఫ్రాలజీ, యూరాలజీ సేవలను ఉచితంగా అందించారు. సీరం క్రియాటిన్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ లాంటి వివిధ రకాల రోగ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా అందించారు. ముత్య కిడ్నీ సెంటరు వైద్యులు యూరాలజిస్టు డాక్టర్ బచ్చు చందుకృష్ణ, డాక్టర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, నెఫ్రాలజీ వైద్యులు పాపయ్య, నిర్మల్ పూదోట తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన మేయర్, కమిషనర్



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌ఘన్‌పూర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభం కోసం ఆదివారం వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. శివునిపల్లి హెలిప్యాడ్ వద్ద సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

జాతరలో మంటలు.. ఆర్పివేయించిన పోలీసులు


మంటలను ఆర్పివేస్తున్న కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్

హసన్‌పర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగట్టు జాతర ఆలయంలో ఆదివారం చిన్న గండదీపం సమీపంలో మంటలు చెలరేగాయి. దీంతో కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ నేతృత్వంలో ఎస్సై ఓ.రవీందర్, శ్రీకాంత్, మాధవ్‌లు అప్రమత్తమయ్యారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి మంటలను ఆర్పివేయించారు. స్వయంగా కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలు చెలరేగకుండా వాటర్ స్ప్రే చేసి మంటలను ఆర్పివేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

హసన్‌పర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 1వ డివిజన్ పరిధి ముచ్చర్ల ప్రభుత్వ పాఠశాలలో 2003-04 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. పాఠశాల పూర్వ ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 21ఏళ్ల తరువాత తమ పూర్వ ఉపాధ్యాయులైన రిటైర్డ్ హెచ్ఎం పావుశెట్టి వెంకటేశం, కె.బుచ్చమాచార్యులు, బి.జయపాల్‌రెడ్డి, ఇ.సుమతి, కె.స్వామినాథ్, ఎం.దేవేందర్, వై.శ్రీదేవి, జి.రజనీదేవిలకు పూలమాలలు వేసి వారి సేవలను కొనియాడారు. పి.కుమారస్వామి వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్లు సీహెచ్.రాము, ఎస్.శివప్రసాద్, ఎమ్డీ.అజీజ్, సీహెచ్.సంతోష్, ఎం.అపర్ణ, బి.ప్రతిభ, జి.అనితతోపాటు సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడికి హైకోర్టు న్యాయమూర్తి పూజలు


హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

హనుమకొండ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని చారిత్రాత్మక రుద్రేశ్వరస్వామి దేవాలయాన్ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జస్టిస్ లక్ష్మణ్‌రావు దంపతులు ఆదివారం సందర్శించారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఉత్తిష్ట గణపతి దర్శనం కల్పించి రుద్రేశ్వర స్వామికి సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో తీర్థప్రసాదాల వితరణ, శేష వస్త్రాలతో పాటు మహదాశీర్వచనం నిర్వర్తించి ఆలయ ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా జస్టిస్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. కాకతీయులు ప్రజల కోసం నిర్మించిన ఇలాంటి చారిత్రక కట్టడాలను భవిష్యత్ తరాల కోసం చరిత్రను మరుగున పడకుండా కాపాడుకోవాలని అన్నారు. కాకతీయులు నిర్మించిన వారసత్వ సంపదను, చరిత్రను తెలుసుకోవల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇంత గొప్ప చరిత్ర కలిగిన ఆలయాలను, శిల్పకళను చిన్ననాటి నుంచే పిల్లలకు చరిత్రకు సంబంధించిన పుస్తకాల ద్వారా, చరిత్రకారుల నుంచి తెలుసుకొని బోధించాలని తెలిపారు. అనంతరం త్రికూటాలయం చుట్టూ ప్రదక్షిణం చేశారు. పునరుద్ధరించబడిన కల్యాణ మండపాన్ని పరిశీలించారు. వైదిక కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ఆలయ అర్చకులు నిర్వర్తించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి బి.అనిల్‌కుమార్, సిబ్బంది మధూకర్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి రమేష్‌బాబు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

తైక్వాండోలో శశాంక్‌కు బంగారు పతకం



న్యూశాయంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడెంలో జరిగిన తెలంగాణ, ఏపీ 14వ తైక్వాండో పోటీలలో హనుమకొండ హంటర్‌రోడ్ లోని న్యూశాయంపేటకు చెందిన గుజ్జేటి శశాంక్ బంగారు పతకం సాధించారు. శశాంక్ చిన్ననాటి నుంచి తైక్వాండో క్రీడపై ఉన్న మక్కువతో సాధన చేస్తూ తల్లిదండ్రుల ప్రోత్సాహంలో చదువుకుంటూ క్రీడలలో రాణిస్తున్న శశాంక్‌ను న్యూశాయంపేటకు చెందిన పలువురు అభినందించారు.

ఎర్రగట్టు వెంకన్న స్వామికి ప్రత్యేక పూజలు



జాతరకు హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రాంరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు స్వాగతం పలుకుతున్న కమిటీ

- స్వామి వారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- ఎర్రగట్టు ఆలయ ప్రాంగణంలో పెరిగిన భక్తుల రద్దీ
- గోవింద నామస్మరణతో మార్మోగిన జాతర ప్రాంగణం

హసన్‌పర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టు వెంకన్న జాతరలో భాగంగా మూడో రోజు ఆదివారం స్వామివారికి విశేష పూజ, కుంకుమార్చన, హారతి, ప్రసాద వినియోగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో వెంకట్రావు పర్యవేక్షణలో 14 మంది ఆలయ ధర్మకర్తలు స్వామివారి సన్నిధిలో పాల్గొనగా ఆలయ అర్చకులు వేదాంతం పార్థసారదాచార్యులు, ఆరుట్ల శ్రీధరాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో రాత్రి పొద్దుపోయే వరకు జాతర ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

దర్శించుకున్న పలువురు ప్రముఖులు

జాతరలో భక్తులతో పాటు ప్రముఖులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, పీసీసీ లీగల్ సెల్ అడ్వైజర్ కమిటీ చైర్మన్ నిమ్మని శేఖర్‌రావుతో పాటు డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, కార్పొరేటర్ అరుణకుమారి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎల్ఐసీ వెంకన్న, ఆలయ ధర్మకర్తలు ఆరెల్లి వెంకటస్వామి, కనపర్తి రాజు, సురేష్, కాంగ్రెస్ నాయకులు అనిల్‌కుమార్, మూల తిరుపతి, పెద్దమ్మ నర్సింహరాములు పాల్గొన్నారు.

గాడి తప్పిన జాతర ఉత్సవ కమిటీ

- సమన్వయ లోపంతో నిర్ణయాలు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు
- కొందరికి ఆదాయ వనరుగా ఎర్రగట్టు జాతర

హసన్‌పర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టు వెంకన్న జాతర నిర్వహణలో ఉత్సవ కమిటీ పాలక వర్గం గాడి తప్పిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలక వర్గం నిర్ణయాలు భక్తులకు తీరని కష్టాలను పెట్టిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జాతరకు వచ్చి భక్తుల వద్ద ఆలయ అర్చకుల నుంచి పార్కింగ్ టెండరుదారుల వరకు దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతర పాలకవర్గం సమన్వయ లోపంతో పార్కింగ్ స్థలం లేకుండానే ఓ వర్గానికి పార్కింగ్ టెండర్ రూ.5వేలకు కట్టబెట్టారు. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు జాతర ప్రాంగణం బయటే వాహనాలు పార్కింగ్ చేయడంతో ఒక్కో వాహనదారుడి వద్ద రూ.30 నుంచి రూ.100 వరకు బలవంతంగా వసూలు చేస్తున్నప్పటికీ పాలక వర్గం కిక్కుమనకుండడంపై వారి పనితీరుపై పలువురు పెదవి విరుస్తున్నారు. జాతర సమయంలో ఆలయానికి భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ అర్చకులు ఇష్టారాజ్యంగా తమకు అనుకూలమైన వారిని గర్భగుడిలోకి పిలిపించుకొని దర్శనం కల్పించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా పాలకవర్గం సమన్వయంతో పనిచేసి జాతరకు వచ్చే భక్తుల సంఖ్యతో పాటు జాతర ఆదాయాన్ని పెంచే మార్గాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

నేడు దోనగుట్ట లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

న్యూశాయంపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ న్యూశాయంపేటలోని దోనగుట్టపై వెలిసిన త్రివేద్రాద్రి సంతోష లక్ష్మీనరసింహస్వామి వారికి సోమవారం కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గ్రంధి సత్యవతి తెలిపారు. క్రిష్టా జిల్లా ముప్వ మండలంలోని పెద్దముత్తేవి క్రిష్టాశ్రమం పీఠాధిపతి గౌరవ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని, 12 గంటలకు అన్నసమారాధన, సాయంత్రం 4 గంటలకు గరుడోత్సవం, 6 గంటలకు యాగశాలలో చతుస్థాన అర్చనలు, తీర్థగోష్టి ఉంటుదన్నారు. భక్తులు ముందుగా తమ గోత్రనామాలను ఇచ్చి కల్యాణంలో పాల్గొనాలని సత్యవతి కోరారు.

విశ్వబ్రాహ్మణ జాతి ఔన్నత్యమే లక్ష్యం

▸▸ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్

వడ్డెపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : విశ్వబ్రాహ్మణ జాతి ఔన్నత్యాన్ని నిలబెట్టడమే తమ లక్ష్యమని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ అన్నారు. నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన దాసోసు శ్రవణ్‌కుమార్‌ను ఆదివారం హైదరాబాద్ హకీంపేటలోని ఆయన నివాసంలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాత్ర సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా దాసోజు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘీయుల సంక్షేమం కోసం కృషి చేస్తానని అన్నారు. దాసోజు శ్రవణ్‌కుమార్‌ను సత్కరించిన వారిలో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, రాష్ట్ర నాయకులు రాగిఫణి రవీంద్రాచారి, పులిగిళ్ల శ్రీనివాసాచారి, పెద్దకొలిమి బ్రహ్మాచారి, శేఖర్ శిల్పి, మారోజు సుదర్శనాచారి, పబ్బోజు భిక్షపతి తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరిస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర నేతలు

డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం

- స్టేషన్ ఘన్‌పూర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

మడికొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మడికొండ, రాంపూర్, పరిసర గ్రామాల ప్రజల పాలిట శాపంగా మారిన చెత్త డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం చూపుతానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దీంతో బాధిత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం స్టేషన్ ఘన్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రజా ప్రతినిధులు డంపింగ్ యార్డు సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే విషవాయువులతో కూడిన పొగవల్ల తాము తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని, ముఖ్యంగా డంపింగ్ పొగ వల్ల తాము చేయని తప్పుకు పిల్లలు, వృద్ధులు ఊపిరాడక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని బాధితులు వాపోతున్నారు. స్వయంగా సీఎం నోటి వెంట సమస్య పరిష్కారం మాట రావడంతో సమస్య పరిష్కారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గతంలో మడికొండలో జరిగిన బహిరంగ సభలో సైతం సీఎం డంపింగ్ సమస్యను ప్రస్తావించారని, ఆసమస్య ఇప్పటికీ అలాగే ఉందని ఇప్పటికైనా సీఎం మాట నీటి మూటగా కాకుండా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా చూడాలని బాధితులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏ విడుదల చేయాలి

▸▸ టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు పెండింగ్ బిల్లులు, డీలను విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జిల్లా ఉపాధ్యక్షుడు ఇప్పకాయల కుమారస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. రెండేళ్లుగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.8వేల కోట్ల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో ఏనాడూ లేని విధంగా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తే భవిష్యత్‌లో తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ఉద్యమ కార్యాచరణను ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ ముత్యాల రఘుపతి, చంద్రగిరి లక్ష్మయ్య, గొడిశాల రమేశ్, భిక్షపతి, భాస్కర్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి

నామినేటెడ్ పదవికి అవకాశం కల్పించాలి

- మంత్రి పొంగులేటికి వినతి

కాజీపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరుతూ కాజీపేటకు చెందిన ఎమ్డీ.రహ్మతుల్లా ఆదివారం ఖమ్మంలో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. వినతిపత్రంలో ఉమ్మడి వరంగల్ ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా, జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా, జాతీయ స్థాయి కోఆర్డినేటర్‌గా, ఐదురాష్ట్రాల ఇన్‌చార్జ్‌గా, రాష్ట్ర యువజన కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా, సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌పార్టీకి సేవలందించానని పేర్కొన్నారు. తన సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి ఇవ్వాలని పేర్కొన్నారు.. అందుకు మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించినట్లు రహ్మతుల్లా తెలిపారు.


మంత్రి పొంగులేటికి వినతిపత్రం ఇస్తున్న ఎం.డి.రహ్మతుల్లా

పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయం


వరంగల్ ఆర్ఎస్‌టీ రోడ్‌లోని వైశ్య భవన్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న గుండా ప్రకాశ్‌రావు

మట్టెవాడ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. వరంగల్ ఆర్ఎస్‌టీ రోడ్‌లోని వైశ్య భవన్‌లో వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుండా ప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను ప్రతీ ఒక్కరు స్మరించుకోవాలన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిరుపేద ఆర్యవైశ్యుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. పబ్బతి నాగభూషణం సునీతల కూతురు పబ్బతి రోషిని ఎంబీబీఎస్ అనంతరం హౌస్ సర్జన్ చదువుతుండగా సంఘం నుంచి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. రోషిణి పీజీ చదువుల కోసం కూడా ఆర్థిక సహాయం అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మల్యాల వీరమల్లయ్య, గాదె వాసుదేవ్, గుండా మల్లికార్జున్, గన్ను సంపత్ కుమార్, ఎర్రం శ్రీనివాస్, ఇరుకుల్ల పాపారావు, శ్రీలతాదేవి, లావణ్య, ప్రవీణ, మౌనిక, మంజుల పాల్గొన్నారు.

మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావుకు ఘనస్వాగతం


మడికొండలో విద్యాసాగర్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నేతలు

మడికొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అటల్ బిహారి వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అటల్‌జీ యాదిస్మృతి ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడానికి ఆదివారం నగరానికి వచ్చిన మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావుకు మడికొండలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువాలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతించారు. స్వాగతం పలికిన వారిలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ దువ్వ నవీన్, నాయకులు బొల్లికొండ వినోద్‌కుమార్, తక్కళ్ళపల్లి నిఖిల్‌రావు, మహేందర్ పటేల్, చట్ల అజయ్, వస్కుల మౌళి, పిట్టల రమేష్, ఎలగొండ శివ, బండ రాజు, రంజిత్, సాయి, పల్లకొండ రాజేందర్, భైరి సతీష్, కుక్కల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో ముందస్తు అరెస్టులు

కేయూ, సుబేదారి పోలీస్‌స్టేషన్లలో వర్సిటీ విద్యార్థులు


వర్సిటీ పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన కేయూ నేతలు

కేయూ క్యాంపస్ మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్ ఘన్‌పూర్ పర్యటన నేపథ్యంలో ఆదివారం కేయూ బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్ నేతలను ముందస్తుగా అరెస్టు చేశారు. కేయూ పోలీసులు బీఆర్ఎస్ నేతలు కత్తెరపల్లి దామోదర్, డాక్టర్ పాలమాకుల కొమురయ్య, జెట్టి రాజేందర్‌లను అరెస్టు చేశారు. సుబేదారి పోలీసులు కేయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, గొల్లపల్లి వీరు, కలకోట సుమన్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థి నేతలకు కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, హసన్‌పర్తి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్, రమేశ్ తదితరులు పరామర్శించి సంఘీభావం ప్రకటించారు. సీఎం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తమను అక్రమంగా నిర్బంధించడం అన్యాయమని విద్యార్థి నేతలు ఆరోపించారు.


సుబేదారి పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన కేయూ నేత సుమన్

ఆంధ్రజ్యోతి సదా మీ సేవలో...
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా !
పత్రికా పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా మాకు ఫోన్ చేసి చెప్పవచ్చును. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా వుంటారు.
సంప్రదించగలరు : హన్మకొండ
Hanamkonda ACO - 9985410935,
Hasanparthy SR - 9059882000, Hanamkonda - 9704361601
Parkal SR- 7396327489, Kazipet SR - 8519926489
ACM - 9985411664

టమాటాల నిల్వ ఇలా!

టమాటల ధర మార్కెట్లో ఒక్కొక్కసారి ఒకోలా ఉంటుంది. చవకగా దొరికినప్పుడు వాటిని సరైన పద్ధతుల్లో నిల్వ చేసుకుంటే అవసరమైనప్పుడు వాడుకోవచ్చు. ఆ పద్ధతులేమిటో చూద్దాం..

- టమాటాలను శుభ్రంగా కడిగి నీళ్లు లేకుండా తుడవాలి. ఆ తర్వాత వాటిని చిన్న చిన్న ముక్కలుగా తరిగి.. వాటిని ఒక మూకుడులో వేసి ఉడికించాలి. ఇలా ఉడికిన మిశ్రమాన్ని మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి. దీనిలో తగినంత ఉప్పు, చక్కెర, వెనిగర్ వేసి కలపాలి. ఈ సాస్‌ను గాజు సీసాలో పోసి రిఫ్రిజిరేటర్‌లో పెడితే చాలా కాలం నిల్వ ఉంటుంది.
- లేత పసుపు రంగులో ఉన్న టమాటాలను సన్నని చక్రాలుగా కోసి ఎండలో పెట్టాలి. టమాటా ముక్కల్లో నీరంతా పోయి బాగా ఎండేలా చూసుకోవాలి. తరవాత వీటిని గాలి చొరబడని డబ్బాలో పోసి ఉంచుకుంటే నాలుగు నెలల వరకూ నిల్వ ఉంటాయి.
- టమాటాలను బాగా ఉడికించి తొక్కలు తీసేయాలి. వీటిని మిక్సీలో వేసి బాగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ఐస్‌ట్రేలలో వేసి ఫ్రిజర్‌లో పెట్టాలి. ఇవి బాగా గట్టి పడిన తర్వాత జిప్‌లాక్ బ్యాగుల్లోకి మార్చుకోవాలి. ఇవి చాలా కాలం నిల్వ ఉంటాయి.
- పచ్చి టమాటాలను నీటిలో కడిగి, తడి లేకుండా పల్చని గుడ్డతో తుడిచి.. జిప్‌లాక్ బ్యాగుల్లో వేసి ఫ్రీజర్‌లో పెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటాయి.
- టమాటాలను చిన్న ముక్కలుగా కోసి ఒక గాజు సీసాలో వేయాలి. ముక్కలు మునిగేవరకు ఆలివ్ ఆయిల్ పోయాలి. ఇందులో సన్నగా తరిగిన వెల్లుల్లి ముక్కలు, వెనిగర్ వేసి కలపాలి. వెనిగర్ వల్ల టమాటా ముక్కలు తాజాగా ఉంటాయి. ఈ ముక్కలను పాస్తా, వెజిటబుల్ సలాడ్, శాండ్‌విచ్‌ల తయారీలో వాడుకోవచ్చు.
- దోరగా పసుపు రంగులో ఉండే టమాటాలను తెచ్చుకుని శుభ్రంగా కడిగి, తడి లేకుండా తుడవాలి. వీటిని సన్నని పొడవైన ముక్కలుగా కోయాలి. వీటిని బాగా ఎండబెట్టాలి. బాగా ఎండిన టమాటా ముక్కలను మిక్సీ జార్‌లో వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేయాలి. ఈ టమాటా పొడిని గాజు సీసాలో పోసి మూత పెట్టి రిఫ్రిజిరేటర్‌లో పెట్టుకుంటే చాలా కాలం నిల్వ ఉంటుంది.





జన్యు సమస్యలకూ చెక్!

మనకు వచ్చే కొన్ని రకాల వ్యాధులకు మూలం జన్యువులు. వాటి గురించి అవగాహన ఉంటే కొన్ని ఆరోగ్య సమస్యలను ముందే గుర్తించవచ్చు. బాగా ఇబ్బంది పెట్టకుండా నియంత్రించవచ్చు. యువతలో... ముఖ్యంగా అమ్మాయిలలో ఈ అవగాహనను కల్పించటానికి ప్రయత్నిస్తున్న వారిలో 'జీనోమ్ ఫౌండేషన్' రీసెర్చ్ డైరక్టర్ డాక్టర్ గాడిచర్ల కనకభూషణం ఒకరు. ప్రస్తుత ఆధునిక యుగంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న జన్యు సమస్యల గురించి 'నవ్య'తో డాక్టర్ కనకభూషణం పంచుకున్న విశేషాలు..

"కొన్ని రకాలైన ఆరోగ్య సమస్యలకు మూలాలు జన్యువుల్లో ఉంటాయి. ఉదాహరణకు ఇన్‌ఫెర్టిలిటీ, పీసీఓడీ, క్యాన్సర్ వంటి వ్యాధులకు జన్యువులు కూడా ప్రధాన కారణమని ఇటీవల కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ కోణం నుంచి చూసినప్పుడు- మూల కారణాలను తెలుసుకోకుండా- సమస్యలను సరిదిద్దటానికి ప్రయత్నిస్తే ఫలితం ఉండదు. అయితే ఈ జన్యుపరమైన సమస్యల గురించి ప్రజలకు తెలిసింది చాలా తక్కువ. విద్యావంతుల్లో కూడా వీటిపై అవగాహన తక్కువే. వారికి అవగాహన కల్పించటానికి, అవసరమైన వారికి వైద్యపరమైన సూచనలు అందించటానికి 'జీనోమ్ ఫౌండేషన్'ను ప్రారంభించాం. ప్రజలలో, ముఖ్యంగా యువతలో జన్యు ఆధారిత ఆరోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించటం మా లక్ష్యం. దీనికోసం తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నాం. వాటిలో అమ్మాయిలను పరీక్షించి, వారిలో ఏమైనా జన్యుపరమైన సమస్యలు ఉంటే చెబుతున్నాం. దీనివల్ల వారు భవిష్యత్తులో తమకు రాబోయే ఆరోగ్య సమస్యల గురించి తెలుసుకొని, సరిచేసుకోవటానికి అవకాశం ఉంటుంది.

> మాది విశాఖపట్నం. అక్కడి ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎండీ పూర్తి చేసిన తర్వాత సిదార్థ మెడికల్ కాలేజీలో గైనకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేశాను. ఆ తర్వాత 'జీనోమ్ ఫౌండేషన్'తో కలిపి పనిచేస్తున్నాను.

సంబంధం ఉంది...

చాలా మందికి జన్యువులకు, జబ్బులకు మధ్య ఉన్న సంబంధం గురించి తెలియదు. ఈ విషయంపై అవగాహన ఉంటే అనేక రకాల ఆరోగ్యసమస్యలు ముందే నివారించుకోవచ్చు. ఈ మధ్యకాలంలో ఒక కాలేజీలో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశాం. దీనిలో 300 మంది బాలికలకు పరీక్షలు నిర్వహించాం. వీరిలో 100 మందికి పైగా 'పీసీఓడీ' ఉన్నట్లు తేలింది. మరి కొంతమంది డిప్రెషన్, ఆహార అలర్జీలతో బాధపడుతున్నట్లు మేము గుర్తించాం. వీటన్నింటికీ జన్యుసమస్యలు కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. వారికి జీవశైలి వల్ల ఈ సమస్యలు వచ్చాయా? లేక జన్యువులే కారణమా? అనే విషయాన్ని కనుగొంటే అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఇదే విధంగా చిన్న వయస్సులో రొమ్ము క్యాన్సర్ వచ్చేవారి సంఖ్య పెరుగుతోంది. దీనికి జన్యువుల ప్రేరణ ఒక కారణమని శాస్త్రవేత్తలు ఎప్పుడో కనుగొన్నారు. ఎలాంటి జన్యుపరివర్తన ఉన్నవారికి రొమ్ము క్యాన్సర్ వస్తోందో కనుగొనగలిగితే.. ఆ తరహా జన్యువులు ఉన్నవారిని ముందే గుర్తించవచ్చు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రేరేపించే అంశాలకు అడ్డుకట్ట వేయమని సలహా ఇవ్వవచ్చు. దీనివల్ల రొమ్ము క్యాన్సర్ నుంచి తప్పించుకోవచ్చు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. జన్యు సమస్య ఉన్న ప్రతి వారికి వ్యాధులు వస్తాయని కూడా కచ్చితంగా చెప్పలేం. అయితే జన్యు సమస్య బయటపడటానికి దోహదం చేసే అంశాలను నియంత్రించగలిగితే చాలా వ్యాధులను నివారించవచ్చు. అందుకే మేము అనేక ప్రాంతాల్లో అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా యువతకు జన్యు సమస్యల గురించి తెలియాల్సిన అవసరం ఎంతయినా ఉంది.

> **లోపాలు సరిదిద్దలేం, కానీ...**
>
> జన్యువుల్లో ఉన్న లోపాలను సరిదిద్దడం అసాధ్యం. అయితే హార్మోన్ స్రావాలను నియంత్రించే సంకేతాలను జన్యువులు వెలువరిస్తూ ఉంటాయి. ఈ హార్మోన్ స్రావాల మీదే అవయవాల సామర్థ్యం, పనితీరు ఆధారపడి ఉంటుంది. జన్యువులు తప్పుడు సంకేతాలు ఇవ్వకుండా నియంత్రించగలిగితే జన్యు సంబంధమైన సమస్యలు నివారించుకోవచ్చు. 'జీనోమ్ ఫౌండేషన్'కు సంబంధించిన చికిత్సలన్నీ ఈ సూత్రం ఆధారంగానే పనిచేస్తాయి.

జీనోమ్ సెంటర్‌లో...

ప్రజలలో అవగాహన కల్పించటంతో పాటు- జన్యుపరమైన వ్యాధులు సంక్రమించే ముప్పు ఉన్న వ్యక్తులకు కూడా 'జీనోమ్ ఫౌండేషన్' ద్వారా సేవలు అందిస్తున్నాం. వీరికి 'జెనెటిక్ మార్కర్స్', 'జెనెటిక్ అనాలసిస్', 'గట్ మైక్రోబియం' పరీక్షలు చేసి నివారణ మార్గాలు సూచిస్తాం. కొందరు మొదటిసారి గర్భం దాల్చినప్పుడు జన్యు సమస్యలను పెద్దగా పట్టించుకోరు. మొదటి బిడ్డ పుట్టిన తర్వాత జన్యు సమస్యలు ఉన్నాయని తేలుతుంది. ఇలాంటి వారు రెండోసారి గర్భం దాల్చాలనుకున్నప్పుడు వారికి సరైన సలహాలు ఇవ్వటంలో 'జీనోమ్ సెంటర్' కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఇదే విధంగా రొమ్ము క్యాన్సర్ వచ్చిన కొందరు మహిళలకు కీమో థెరపీ సరిగ్గా పనిచేయదు. ఇలాంటి వారి జన్యువులను విశ్లేషించి, వారికి ఏ తరహా థెరపీ పనిచేస్తుందో చెబుతాం. ప్రస్తుతం మేము హైదరాబాద్‌లోని 'కిమ్స్', 'బసవతారకం', 'గాంధీ' (విశాఖపట్నం), 'కిమ్స్ ఐకాన్' (విశాఖపట్నం)లలోని క్యాన్సర్ విభాగాలతో కలిసి పని చేస్తున్నాం.





మార్పు మేస్త్రీలు...

కేరళలోని పలు ప్రాంతాల్లో మేస్త్రీలు, కార్పెంటర్లు, ప్లంబర్లు... ఇలా భవన నిర్మాణ పనులన్నిటిలో ఇప్పుడు మహిళలే ఎక్కువగా కనిపిస్తున్నారు. పదిమంది, ఇరవై మంది కాదు.. వారి సంఖ్య అయిదు వేలమందికి పైనే ఉంది. దీని వెనుక ఉన్న శక్తి... 79 ఏళ్ళ తెరేసమ్మ మాథ్యూస్. ఆమె సంకల్పం మూడున్నర దశాబ్దాలుగా ఎందరో మహిళల ప్రగతికి పునాదులు వేస్తోంది.

అది 1989వ సంవత్సరం. మహిళా కార్మికుల స్థితిగతుల మీద ఒక స్వచ్ఛంద సంస్థ తరఫున అధ్యయనం చేయడం కోసం తెరేసమ్మ మాథ్యూస్ కేరళలోని కొట్టాయం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమె ఊహకు అందనంత తీవ్ర స్థాయిలో ఉన్నాయి. వేధింపులు, వివక్ష, అసమానతలు... దాదాపు ప్రతి మహిళా వీటికి గురి అవుతున్నారని గుర్తించారు. "నేను కలిసినవారిలో చాలామంది వితంతువులు. వారు కుటుంబాలను పోషించడానికి రకరకాల పనులు చేస్తున్నారు. వారితో మాట్లాడినప్పుడు "మాకు మగవారికి ఇచ్చే వేతనంలో సగమే ఇస్తారు. వారికి 50 రూపాయలిస్తే, మాకు 25 రూపాయలే దక్కుతాయి. కానీ వారు చేసినంత పనీ చెయ్యాలి" అని ఆవేదన చెందారు. ప్రభుత్వ సంస్థలు ద్వారా జరిగే నిర్మాణ పనుల్లో కూడా ఇదే తీరు. ఇక 'సమాన పని, సమాన వేతనం' అనే మాటకు అర్థం ఏమిటి? అనిపించింది అని గుర్తు చేసుకున్నారు తెరేసమ్మ. కొందరు సీనియర్ అధికారులను కలిసి వేతనాలను సమానంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. "ఎవరు ఎంత పని చేశారనేది ముఖ్యం కాదు, మగవారికి మహిళలకన్నా ఎక్కువ చెల్లించాలి. అంతే!" అన్న మాటలు తెరేసమ్మను దిగ్భ్రాంతికి గురిచేశాయి. పైగా పని చేసే చోట మహిళలు రకరకాల వేధింపులు కూడా ఎదుర్కొంటున్నారు. వారి సమస్యకు తగిన పరిష్కారం చూపించాలని ఆమె భావించారు.

ఎన్నో అభ్యంతరాలు..

తెరేసమ్మ కేరళలోని కొట్టాయం జిల్లా పాలా పట్టణంలో పుట్టి పెరిగారు. బడిలో చదువుతున్న రోజుల్లోనే... దైవ సేవకు జీవితాన్ని అంకితం చేయాలనీ, నన్‌గా కావాలనీ నిశ్చయించుకున్నారు. "అదే సమయంలో ఒక సినిమా చూశాను. అందులో కథానాయిక గ్రామసేవిక. పేదల శ్రేయస్సుకోసం పని చేస్తుంది. వారి పిల్లలకు చదువు చెబుతుంది, ఆరోగ్యం గురించి సూచనలు ఇస్తుంది. వారితో మమేకం అవుతుంది. దాదాపు అరవయ్యేళ్ళ క్రితం... ఆ పాత్ర నాకు చాలా కొత్తగా అనిపించింది. ప్రజల్లోనే ఉంటూ, వారికోసం పని చెయ్యాలనుకున్నాను. చదువు పూర్తి చేసుకొని, 21 ఏళ్ళ వయసులో నన్‌గా మారాను. 'ఒబ్లేట్ మిషనరీస్ ఆఫ్ మేరీ ఇమ్మాక్యులేట్' అనే సంఘంలో చేరాను. అప్పటినుంచి వివిధ సంస్థలతో కలిసి సామాజిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాను" అని చెప్పారామె. 'పని ప్రదేశాల్లో లింగ వివక్షను, వేతనాల్లో అసమానత్వాన్ని రూపుమాపడానికి ఏం చెయ్యాలి?' అని ఎంతో ఆలోచించిన తరువాత... 1989లో పన్నెండు మంది మహిళలతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. వారికి నిర్మాణ పనుల్లో శిక్షణ ఇప్పించారు. వారికి ఉపాధి కల్పన అంత సులువుగా జరగలేదు. "ఇటుకలు, ఇసుక, రాళ్ళు నీరు మోసుకురావడం, గోడల్ని తడపడం లాంటి పనులే మహిళలు చేయాలి. మిగిలిన పనులకు వాళ్ళు పనికిరారు" అంటూ పురుష మేస్త్రీలు, కాంట్రాక్టర్లు, కింది స్థాయి అధికారులు అభ్యంతరపెట్టారు. అప్పుడు తెరేసమ్మ ఉన్నతాధికారులను కలుసుకున్నారు. సమస్యను వారికి వివరించారు. శిక్షణ పొందిన మహిళలకు నైపుణ్యం ఉందని, తొలుత చిన్న చిన్న పనులను ఇంజనీర్ల పర్యవేక్షణలో చేయించి, నాణ్యతను నిర్ధారించాలని కోరారు. వారి పనితనానికి తను హామీగా ఉంటానని చెప్పి ఒప్పించారు. వారి పనితీరు సంతృప్తికరంగా ఉండడంతో... ఇంకొన్ని కాంట్రాక్టులను అధికారులు వారికి అప్పగించారు. క్రమంగా ప్రైవేటు పనులు కూడా రావడం మొదలయింది.

> **స్వావలంబనకు పునాదిగా...**
>
> 
>
> కేరళలోని కొట్టాయం, అళప్పుళ, ఇడుక్కి, ఎర్నాకుళం ప్రాంతాల్లో 'అర్చన ఉమెన్స్ సెంటర్' శాఖలు నడుస్తున్నాయి. అవి వారి ఆర్థిక స్వావలంబనకు పునాదిగా నిలుస్తున్నాయి..కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన యువతులు, మహిళలు వాటిలో శిక్షణ పొందుతున్నారు. ఈ కేంద్రాల్లో మేస్త్రీ పని, కార్పెంటరీ, బ్యాంబూ-ఫెర్రో-టెక్నాలజీ, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు, ఇటుకల తయారీ లాంటి అనేక అంశాల్లో శిక్షణ ఇస్తారు. నిర్మాణరంగంలో చోటుచేసుకుంటున్న పురోగతులకు అనుగుణంగా శిక్షణలో మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రస్తుతం పర్యావరణ అనుకూల నిర్మాణ విధానాలను కూడా ఈ కేంద్రంలో బోధిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందినవారిలో చాలామంది కేరళ ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ ప్రాజెక్టుల్లో, గ్రామాల్లో నీళ్ళ ట్యాంకులు, ఇంకుడు గుంతల నిర్మాణంలో పని చేస్తున్నారు. బృందాలుగా ఏర్పడి... ప్రైవేటు నిర్మాణాలు కూడా చేపడుతున్నారు. కొట్టాయం యూనిట్‌లో మహిళా కార్పెంటర్లు ఫర్నీచర్ తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటివరకూ అయిదువేల మందికి పైగా ఈ శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీన్ని ఉపాధిగా ఎంచుకున్న మహిళలకు వారు చేసే పని, అనుభవం, నైపుణ్యాన్ని బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేలకు పైగా కనీస ఆదాయం లభిస్తోంది.

మహిళలే చుక్కాని

"అందరూ మహిళలే ఉన్న భవన నిర్మాణ కార్మిక బృందం ప్రయోగం విజయవంతం కావడం, వారు పురుషులతో సమానమైన వేతనం పొందడం, పైగా వేధింపులకు ఆస్కారం లేకపోవడంతో ఎందరో మహిళలు ఆ పని పట్ల ఉత్సాహం చూపించారు. వీలైనంతమందికి శిక్షణ ఇప్పిస్తూ వచ్చాను. వారందరికీ చక్కటి ఉపాధి లభించింది. ఇలా కొన్నేళ్ళు కొనసాగించిన తరువాత... వారి శిక్షణ కోసం పూర్తి స్థాయి సంస్థ ఒకటి అవసరమని భావించాను. 2004లో.. కొట్టాయం జిల్లాలోని ఎట్టుమనూరులో 'అర్చన ఉమెన్స్ సెంటర్'ను ప్రారంభించాను" అని వివరించారు తెరేసమ్మ. ఈ కేంద్రంలో భవన నిర్మాణానికి కావలసిన అన్ని పనుల్లో మహిళలకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. ఇప్పటి వరకూ 5 వేల మందికి పైగా మహిళలు వివిధ అంశాల్లో శిక్షణ పొందారు. వారి కాళ్ళమీద వారు నిలబడుతున్నారు. హుందాగా, గౌరవంతో జీవిస్తున్నారు. ఆ ప్రాంతాల్లో... వృత్తినైపుణ్యం, ఆత్మస్థైర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం కోరుకొనే పేద వర్గాల మహిళలకు ఇప్పుడు ఈ కేంద్రం ఒక గమ్యస్థానంగా మారింది. "ఏ కుటుంబానికైనా చుక్కాని మహిళలే. వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. ఒక మహిళగా వారికి అండగా నిలవాలన్న చిన్న ఆశయమే ఈ కేంద్రం ఏర్పాటుకు నాంది పలికింది. మహిళలు తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటేనే అస్తిత్వాన్ని కాపాడుకోగలరు. దానికి నా స్థాయిలో నేను దోహదం చేస్తున్నాను" అని అంటారు తెరేసమ్మ వినయంగా.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..



మనం ప్రవర్తించే తీరు ఆధారంగానే మన చుట్టూ ఉన్న వారు మనల్ని అంచనా వేస్తారు. అందుకే మనసులో భావాలు ఎక్కువగా బయటకు కనిపించనివ్వకుండా... శరీర కదలికలలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే - ఇతరులకు ఆత్మవిశ్వాసంతో ఉన్నట్లు కనిపిస్తారని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఆ జాగ్రత్తలేమిటో చూద్దాం..

- ఎప్పుడూ వంగి కుంగిపోయినట్లు కనిపించకూడదు. వీలైనంత వరకు వెన్నెముక నిటారుగా ఉండాలి. తలపైకి ఎత్తే చూడాలి. దీని వల్ల ఇతరులకు మనం ఆత్మవిశ్వాసంతో ఉన్నామనే విషయం అర్థమవుతుంది.
- మాట్లాడేటప్పుడు స్పష్టంగా అందరికీ వినిపించేలా మాట్లాడాలి. నంగినంగిగా, గుసగుసలాడుతున్నట్లు మాట్లాడకూడదు. ఇలా మాట్లాడటం వల్ల మనం చెప్పే విషయం ఇతరులకు అర్థం కాదు.
- ఇతరులతో మాట్లాడుతున్న సమయంలో లేదా ఒక సమూహంలో ఉన్న సమయంలో కాళ్లు, చేతులు వేగంగా కదల్చకూడదు. కదలికలు నెమ్మదిగా, స్థిరంగా ఉండేలా చూసుకోవాలి. ఇదే విధంగా ఉద్దేశపూర్వకంగా చేతులతో చేసే సైగలు అనేక భావాలను సూచిస్తాయి. అందువల్ల వాటిపై కూడా నియంత్రణ ఉండాలి.
- ఎక్కువ మంది ఉన్న సమయంలో చేతి గోళ్లు కొరుక్కోవటం, తల గోక్కోవటం వంటివి చేయకూడదు. ఈ తరహా కదలికలు ఇబ్బందిని కలిగిస్తాయి.
- కుర్చీలో లేదా సోఫాలో పడుకున్నట్లు కూర్చోకూడదు. పాదాలు నేలపై నిటారుగా ఉండేలా చూసుకోవాలి.

కడుపునొప్పి తగ్గాలంటే..!



చాలా మందికి ఎప్పుడో ఒకప్పుడు కడుపు నొప్పి వస్తుంది. గ్యాసు సమస్యలు కూడా ఏర్పడతాయి. ఇలాంటి సమయాల్లో వెంటనే మందులు వేసుకోకుండా- చిన్న చిన్న చిట్కాలు పాటించమని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

అల్లం రసం

జీర్ణ సమస్యలకు అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. దీనిలో జింజరోల్, షోగోల్ వంటి కాంపౌండ్స్ జీర్ణకోశంలో వచ్చే వాపులను, నొప్పిని తగ్గిస్తాయి. అల్లం... పిత్తం సక్రమంగా ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీని వల్ల అజీర్ణ సమస్య తగ్గుతుంది. కడుపు నొప్పి వచ్చినప్పుడు కొద్దిగా అల్లం రసాన్ని తేనెలో కలిపి తీసుకుంటే సత్వర ఉపశమనం కలుగుతుంది.

పిప్పర్‌మెంట్

పిప్పర్‌మెంట్‌లో మెంథాల్ ఉంటుంది. ఇది జీర్ణకోశంలోని వాపును తగ్గిస్తుంది. పేరుకుపోయిన గ్యాసును తొలగిస్తుంది. పేగుల్లో నొప్పిని కూడా తగ్గిస్తుంది. కడుపునొప్పి వచ్చిన వారు - కొద్దిగా పిప్పర్‌మెంట్ ఆయిల్ కలిపిన వేడినీళ్లను తాగటం వల్ల నొప్పి తగ్గుతుంది.

జీలకర్ర

జీలకర్రలో ఎనిటోహోల్ అనే పదార్థం ఉంటుంది. ఇది జీర్ణకోశంపై పనిచేసి వాపును తగ్గిస్తుంది. అజీర్తి సమస్య ఉన్నవారు క్రమతప్పకుండా జీలకర్ర నీళ్లను తాగటం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది.

పసుపు

పసుపులో కుర్‌క్యుమిన్ అనే ఒక కాంపౌండ్ ఉంటుంది. దీనికి జీర్ణవ్యవస్థలో కలిగే ఇబ్బందులను తొలగిస్తుంది. కడుపులో గ్యాస్ పేరుకుపోయినప్పుడు - గోరువెచ్చని పాలలో పసుపు వేసుకొని తాగితే ఉపశమనం లభిస్తుంది.



ఫ్రీజర్‌లో మంచు గడ్డ కడుతోందా?

ఫ్రిజ్‌లో ఉండే ఫ్రీజర్‌లో తరచూ మంచు గడ్డలా ఏర్పడడం మనం చూస్తూనే ఉంటాం. దీనిని ఇలాగే వదిలేస్తే ఫ్రిజ్ పనితీరు దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా మంచు పేరుకోవడానికి గల కారణాలు, దాన్ని తొలగించే చిట్కాల గురించి ఇలా సూచిస్తున్నారు.

మంచు ఎందుకు ఏర్పడుతుంది?

- ఫ్రిజ్ తలుపు సరిగా మూసుకోకపోతే బయటి గాలి లోపలికి వెళ్లి మంచును ఏర్పరుస్తుంది. తలుపు అంచులకు లోపల ఉండే రబ్బరు పట్టీ పాడయినా ఈ సమస్య వస్తుంది.
- ఫ్రిజ్‌లోని అదనపు నీటిని బయటికి పంపడంలో ముఖ్య పాత్ర వహించే కాయిల్ దెబ్బతింటే లోపల మంచు పేరుకుంటుంది.
- ఫ్రిజ్‌లో ఉండే వాటర్ ఫిల్టర్ సరిగ్గా పనిచేయకపోయినా ఫ్రీజర్‌లో మంచు గడ్డలా ఏర్పడుతుంది.
- ఫ్రీజర్ పైప్ మూసుకున్నప్పుడు కూడా లోపల భారీగా మంచు తయారవుతుంది.

మంచును వెంటనే తొలగించే చిట్కాలు...

- ముందుగా ఫ్రిజ్‌కు విద్యుత్ సరఫరా ఆపివేయాలి. ఒక గ్లాసు వేడినీళ్లను ఫ్రీజర్‌లో పోయాలి. వెంటనే మంచు కరిగిపోతుంది
- వెడల్పాటి పాత్రలో వేడి నీళ్లు పోసి ఫ్రీజర్‌లో ఉంచి తలుపు వేయాలి. పావు గంటలో మంచు మొత్తం కరిగిపోతుంది
- ఫ్రీజర్ తలుపు తీసి హెయిర్ డ్రైయర్ ఆన్ చేయాలి. డ్రైయర్ నుంచి వచ్చే వేడి గాలికి మంచు గడ్డ కరుగుతుంది.
- ఫ్రీజర్ నుంచి మంచు ముక్కలను తొలగించడానికి స్టీల్ లేదా ఇనప చెంచాలు, గంటెలు ఉపయోగించకూడదు. చెక్క చెంచాలు మాత్రమే వాడాలి.

ఏపీ ఈసెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుంచి ఏపీ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ ఈసెట్) 2025 నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ (మేథ్స్) అభ్యర్థులకు 2025-26 విద్యా సంవత్సరంలో బీఈ/ బీటెక్/ బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు 2025 ఏప్రిల్ 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 2025 మే 1 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఎంట్రెన్స్‌ను అనంతపురంలోని జేఎన్‌టీయూ నిర్వహిస్తోంది. ప్రవేశ పరీక్ష 2025 మే 6వ తేదీన జరుగుతుంది. పూర్తి వివరాలకు https://cets.apsche.ap.gov.in/ APSCHE/APSCHEHome.aspx వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎన్‌సీఎల్‌లో 1,765 అప్రెంటిస్ పోస్టులు

అప్రెంటిస్ పోస్టుల భర్తీకి నార్తరన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎన్‌సీఎల్) దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. మొత్తం 1,765 పోస్టులు ఉన్నాయి. ఇందులో గ్రాడ్యుయేట్స్ 152, డిప్లొమా 597, ట్రేడ్ అప్రెంటిస్ 941 ఉన్నాయి. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సంస్థ అధికారిక వెబ్‌సైట్ nclcil.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి తేదీ 2025 మార్చి 18. అభ్యర్థుల వయస్సు 2025 మార్చి1వ తేదీ నాటికి 18 నుంచి 26 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

గడువు పెంపు

‘కొమెడెక్’

కర్నాటకలోని ఇంజనీరింగ్ కాలేజీల అడ్మిషన్లకు ఉద్దేశించిన కొమెడెక్ యూజీసెట్-2025కి (కన్సార్టియం ఆఫ్ మెడికల్, ఇంజనీరింగ్, డెంటల్ కాలేజెస్ ఆఫ్ కర్నాటక) దరఖాస్తు దాఖలు గడువును పొడిగించారు. జాతీయ స్థాయిలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే ఈ పరీక్షను ప్రతీ సంవత్సరం తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులు రాస్తుంటారు. ఆసక్తి గల అభ్యర్థులు https://comedk.org/ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మార్చి 20 తేదీ వరకు పెంచారు. కరెక్షన్ విండో ఏప్రిల్ 11 నుంచి 14 వరకు ఓపెన్‌గా ఉంటుంది. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష మే10న జరుగుతుంది. ఫలితాలు మే 24న వెల్లడిస్తారు.

పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ దరఖాస్తు దాఖలు గడువును 2025 మార్చి 31 వరకు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ వివరాలను తెలిపింది. తొలుత ఈ గడువు 2025 మార్చి 12 వరకు ఉంది. ఆసక్తి గల అభ్యర్థులు pminternship.mca.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్కీమ్ ద్వారా భారతదేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. ఇందులో ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్, ట్రావెల్ - హాస్పిటాలిటీ, మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ తదితర రంగాలు ఉన్నాయి. రిలయన్స్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఎల్ అండ్ టీ, టెక్ మహీంద్ర, బజాజ్ ఫైనాన్స్, మహీంద్ర అండ్ మహీంద్ర మొదలైన దిగ్గజ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభిస్తుంది. పదో తరగతి అర్హత ఉన్నవారు మొదలుకుని గ్రాడ్యుయేషన్ వరకు అందరూ ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

మంచి కాలేజీ అయితేనే సరైన ప్లేస్‌మెంట్

దిక్సూచి
DIKSUCHI

ఐసెట్ ప్రిపరేషన్ ప్లాన్



తెలుగు రాష్ట్రాల్లో ఎంబీఏ లేదా ఎంసీఏ(మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్/ మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) చేయాలంటే ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలి. ఈ పరీక్షలో ర్యాంకు సాధిస్తే మంచి కాలేజీలో సీటు సంపాదించవచ్చు. ఏదో ఒక కాలేజీలో సీటు సులభమే. కానీ ప్లేస్‌మెంట్ సరిగ్గా ఉండాలంటే మాత్రం తప్పనిసరిగా మంచి కాలేజీలో చదవాలి. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఐసెట్ నోటిఫికేషన్ వెలువడింది. ఆంధ్రప్రదేశ్‌లో మే మొదటివారంలో ఎంట్రెన్ జరుగుతుండగా, తెలంగాణలో జూన్ మొదటి వారంలో నిర్వహిస్తున్నారు. రెండు సెట్‌ల పరీక్షల స్వరూపం ఒక్కటే. మొత్తం ప్రశ్నలు 200 ఉంటాయి. కామన్‌గా మూడు సెక్షన్లు ఉంటాయి. అవి అనలిటికల్ ఎబిలిటీ, మేథమెటికల్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ. కాకపోతే ఒక్కో రాష్ట్రంలో ఈ ప్రశ్నలు ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ ఉండోచ్చు. ఐసెట్ ఎంట్రెన్స్ రాయాలంటే కనీసం 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా పరీక్ష రాయవచ్చు. ఎంసీఏలో చేరాలంటే మాత్రం ఇంటర్‌లో మేథ్స్ చదివి ఉండాలి. ఐసెట్‌లో 200 ప్రశ్నలకు 150 నిమిషాల్లో సమాధానాలు పూర్తి చేయాలి. అంటే ప్రతీ ప్రశ్నకు 45 సెకన్లు మాత్రమే సమయం ఉంటుందన్నమాట. అనలిటికల్, మేథమెటికల్ ఎబిలిటీల వంటి సెక్షన్లకు ఈ సమయం సరిపోదు. ఎంత ఎక్కువ ప్రాక్టీసు ఉంటే అంత వేగంగా సమాధానాలు గుర్తించగలుగుతారు. షార్ట్‌కట్‌లు తెలుసుకోవాలి. సమాధానం రాకుంటే సమయం వృథా కాకుండా పరీక్ష చివర్లో ప్రయత్నించాలి. సాధారణంగా 150 నుంచి 170 మధ్య టాప్ స్కోర్లు ఉంటాయి. 120 దాటిన వారికి కూడా మంచి కాలేజీల్లో సీట్లు లభించే అవకాశం ఉంటుంది. పలానా కాలేజీలో ఈ స్కోరుకు సీటు పక్కా అని చెప్పడానికి ఉండదు. ప్రతీ సంవత్సరం మారే అవకాశం ఉంటుంది. అందుకే సాధ్యమైనంత మంచి ర్యాంకు తెచ్చుకోవాలి.

నోటిఫికేషన్ వివరాలు

- తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ 2025 (టీజీ ఐసెట్) నోటిఫికేషన్ విడుదల అయింది. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ దీనిని నిర్వహిస్తోంది. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 మే 3. ప్రవేశ పరీక్ష 2025 జూన్ 8, 9వ తేదీన నిర్వహిస్తారు.
- ఏపీ కామన్ ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీఐసెట్) కోసం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈసారి విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. 2025 ఏప్రిల్ 9 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్ష 2025 మే 7న జరుగుతుంది.

అడ్మిషన్స్



ఏపీ ‘ఈఏపీసెట్’

ఆంధ్రప్రదేశ్ ‘ఈఏపీసెట్’ దరఖాస్తుల స్వీకరణ మొదలైంది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలనుకున్న విద్యార్థులు https://cets.apsche.ap.gov.in వెబ్‌సైట్ చూడవచ్చు. దరఖాస్తుల దాఖలుకు చివరి తేదీ 2025 ఏప్రిల్ 24. కరెక్షన్లకు మే 6వ తేదీ నుంచి మే 8 వరకు అవకాశం ఉంటుంది. మే 12 నుంచి ఈఏపీసెట్ వెబ్‌సైట్‌తోపాటు, రాష్ట్రప్రభుత్వ వాట్సాప్ నంబర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అగ్రికల్చర్, ఫార్మాస్యూటికల్ కోర్సులకు ఎంట్రెన్స్ మే 19, 20 తేదీల్లో, ఇంజనీరింగ్ కోర్సులకు మే 21 నుంచి 27 నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 46 కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని రెండు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉర్దూ మాధ్యమాన్ని ఎంచుకున్నవారు కర్నూలులోని ప్రాంతీయ కేంద్రంలో ఎంట్రెన్స్ రాయాల్సి ఉంటుంది.

ఎంట్రెన్స్ విధానం:

- ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లో మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 80 మేథ్స్, 40 ఫిజిక్స్, 40 కెమిస్ట్రీ నుంచి ఉంటాయి. ఇవన్నీ కూడా ఆబ్జెక్టివ్, మల్టీపుట్ చాయిస్ ప్రశ్నలు.
- అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ ప్రశ్నపత్రంలో కూడా 160 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో బయాలజీ 80(బోటనీ 40, జువాలజీ 40), ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 40 ఉంటాయి.

ఫీజు: దరఖాస్తుతోపాటు జనరల్ అభ్యర్థులు రూ.600/-, బీసీ అభ్యర్థులు రూ.550/-, ఎస్సీఎస్టీ అభ్యర్థులు రూ. 500/- చెల్లించాలి.

SCHOLARSHIP ALERT

DRBT
Summer Internship Programme

IDRBT Summer Internship Programme (ISIP) 2025 is provided by the Institute for Development and Research in Banking Technology (IDRBT). The internship offers graduate and postgraduate students an opportunity to carry out projects in technological field.

Eligibility: Application is open to students enrolled in recognised post-graduate technology/management programs or four-year engineering degree course in reputed Indian institutions. Only those in their penultimate year of studies are eligible.

Rewards: A monthly stipend of Rs.12,500/-
Last Date to Apply: 15-04-2025
Application mode: Via email: isip@idrbt.ac.in
Short Url: www.b4s.in/aj/IDSI1



Flipkart
Foundation Scholarship

Flipkart Group is committed to strengthening the retail sector including the Kirana Stores which form a significant part. As part of our endeavour, the Flipkart Foundation is supporting a scholarship for children of Kirana Store Owners to make them future-ready. This scholarship is dedicated to empowering children of Kirana Store Owners enrolled in professional STEM (Science, Technology, Engineering, Math) undergraduate programs.

Eligibility: Applicants must be currently studying in the 1st year of professional undergraduate STEM (Science, Technology, Engineering, Math) courses at government colleges in India.

- One parent must be a Kirana Store Owner (KSO).
- Applicants must have scored at least 60% in their Class 12 exams.
- The annual family income should not exceed INR 5 lakh from all sources.

Rewards: Fixed scholarship of INR 50,000
Last Date to Apply: 16-04-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/FLIP1

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కోర్ట్ నన్ను గెలిపించింది

నాని



ప్రియదర్శి కథానాయకుడిగా రామ్ జగదీష్ తెరకెక్కించిన చిత్రం ‘కోర్ట్’. హీరో నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం విజయవంతంగా కొనసాగుతోన్న సందర్భంగా మేకర్స్ ఆదివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. నాని మాట్లాడుతూ “నేను ఎప్పుడూ స్క్రిప్ట్, ప్రేక్షకుల అభిరుచినే నమ్ముతాను. ఈ సినిమా నన్ను, నా నమ్మకాన్ని గెలిపించింది” అని అన్నారు. “ఈ సినిమా కథ విని చాలా గొప్ప అనుభూతిని పొందాను” అని ప్రియదర్శి చెప్పారు. “జీవితాలనే మార్చేయగల శక్తి సినిమా సొంతం. ఈ విజయం చిత్రబృందానికి అంకితం” అని రామ్ జగదీష్ అన్నారు.

విలన్ వస్తున్నాడు



మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన చిత్రం ‘ఎల్ 2 ఎంపురాన్’. ఈ నెల 27న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. అయితే ఈ చిత్రం విడుదల వాయిదా పడిదంటూ కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీన్ని ఖండిస్తూ చిత్రబృందం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 27న ‘ఎల్ 2 ఎంపురాన్’ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపింది. ‘సరైన సమయమిది. అందరూ జాగ్రత్తగా ఉండండి. విలన్ మీ కోసం వచ్చేస్తున్నాడు’ అంటూ పృథ్వీరాజ్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు.

అన్ని వర్గాలనూ అలరిస్తుంది

నవీన్ యెర్నేని



సుశాంత్, జాన్యజోషి, విధి నటించిన హిందీ చిత్రం ‘పింటూ కి పప్పీ’. ఈనెల 21న మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా పలు భాషల్లో విడుదలవుతోంది. శివ్ హరే దర్శకత్వంలో విధి ఆచార్య నిర్మించారు. తెలుగులో ‘కిస్ కిస్ కిస్సిక్’ పేరుతో విడుదలవుతోంది. మురళీ శర్మ, గణేశ్ ఆచార్య, విజయ్‌రాజ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ “సినిమా రషెస్ చూశాను. చాలా బాగా వచ్చింది. అన్ని వర్గాలను ఆకట్టుకునే అంశాలున్నాయి. తొమ్మిది పాటలూ అద్భుతంగా ఉన్నాయి. సినిమా బ్లాక్‌బస్టర్ అవ్వాలి” అని ఆకాంక్షించారు. గణేశ్ ఆచార్య మాట్లాడుతూ “అందమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబ ప్రేక్షకులతో పాటు యూత్‌నూ ఆకట్టుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది” అని చెప్పారు. హీరో సుశాంత్ మాట్లాడుతూ “సినిమా మంచి కమర్షియల్ ప్యాకేజీలా ఉంటుంది” అని తెలిపారు.

ఆగస్టులోనే రెండో యుద్ధం



బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం ‘వార్-2’. ఆర్యన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ తెరకెక్కిస్తోంది. కాగా, ఈ సినిమాను ఆగస్టు 14న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గతంలోనే ప్రకటించింది. అయితే కొన్ని రోజుల క్రితం షూటింగ్‌లో హృతిక్ కాలికి గాయం అవడం వల్ల చిత్రీకరణకు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల మరింత జాప్యం జరిగి విడుదల వాయిదా పడుతుందంటూ బాలీవుడ్ మీడియాలో ప్రచారం జరిగింది. దీన్ని చిత్రబృందం ఖండించింది. హృతిక్ కోలుకోగానే మిగిలిన భాగాన్ని పూర్తి చేసి, ముందు ప్రకటించిన విధంగానే ఆగస్టు 14న ‘వార్ 2’ను విడుదల చేస్తామని యూనిట్ పేర్కొంది.

వినోదం గ్యారంటీ



నితిన్ కథానాయకుడిగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘రాబిన్‌హుడ్’. శ్రీలీల కథానాయిక. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. ఈనెల 28న విడుదలవుతోంది. చిత్రబృందం భీమవరంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో హీరో నితిన్ మాట్లాడుతూ “సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకుల్ని నిరుత్సాహపరచదు. పూర్తి వినోదం గ్యారంటీ” అని అన్నారు. “మనసుపెట్టి తీసిన చిత్రమిది. కచ్చితంగా మీ అంచనాలను అందుకుంటుంది. సినిమా విజయంపై నమ్మకం ఉంది” అని వెంకీ కుడుముల చెప్పారు. “ఈ సినిమాను థియేటర్లలో మీ కుటుంబసభ్యులతో మిత్రులతో కలసి చూడండి. బాగా ఎంజాయ్ చేస్తారు” అని వై. రవిశంకర్ తెలిపారు.

‘పుష్ప 3’.. మరో మూడేళ్లలో



అల్లుఅర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ‘పుష్ప 2: ద రూల్’ ఎంతటి ఘన విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఆ చిత్రానికి కొనసాగింపుగా ‘పుష్ప 3: ద ర్యాంపేజ్’ ఉంటుందని మేకర్స్ అప్పట్లోనే ప్రకటించారు. ‘రాబిన్‌హుడ్’ ప్రెస్‌మీట్‌లో ‘పుష్ప 3’ గురించి నిర్మాత వై. రవిశంకర్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. “పుష్ప 3’ని 2028లో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం. అల్లు అర్జున్ ప్రస్తుతం తను చేయబోయే ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమై ఉన్నారు” అని ఆయన తెలిపారు.

సంక్రాంతి కానుకగా మెగాస్టార్ సినిమా

- అనిల్ రావిపూడి





మెగాస్టార్ చిరంజీవి హీరోగా తను దర్శకత్వం వహిస్తున్న చిత్రం వచ్చే సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వస్తుందని ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. తన ఆరాధ్య దైవం సింహాచలం వరాహలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో ఆదివారం ఆయన సినిమా స్క్రిప్ట్‌నకు ప్రత్యేక పూజలు చేయించారు. తన బృందంతో కలిసి ఆదివారం ఉదయం సింహాచలం చేరుకున్న అనిల్ రావిపూడి ముందుగా ఆలయంలో కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం అంతరాలయంలో స్క్రిప్ట్‌నకు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మెగాస్టార్ ఇమేజ్‌కు తగ్గట్లుగా ఈ సినిమాకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే 90 శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయిందని, మరో నెలరోజుల్లో సెట్స్‌మీదకు వెళ్తామన్నారు. మూడు నెలల షూటింగ్ పార్టు అనంతరం, పోస్టు ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసుకుని వచ్చే సంక్రాంతికి సినిమాను విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. మెగాస్టార్ సినిమాల్లో పాటలు, సంగీతానికి ఉండే ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భీమ్స్‌ను సంగీత దర్శకుడిగా ఎంచుకున్నామన్నారు. ప్రముఖ నేపథ్య గాయకుడు రమణ గోగులతో పాటలు పాడించాలని నిర్ణయించామని తెలిపారు.

సింహాచలం (ఆంధ్రజ్యోతి)



కొత్త తేదీన జాన్వీ చిత్రం

వరుణ్ ధావన్, జాన్వీకపూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘సన్నీ సంస్కారీ కీ తుల్సీ కుమారి’. ఈ చిత్రం విడుదల తేదీ మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ చిత్రం ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలవ్వాల్సి ఉంది. అయితే సెప్టెంబర్ 12న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాణసంస్థ ధర్మా ప్రొడక్షన్స్ ఆదివారం ప్రకటించింది. కుటుంబ అనుబంధాలు, ప్రేమ, భావోద్వేగాల మిళితంగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని యూనిట్ పేర్కొంది. ‘బవాల్’ తర్వాత వరుణ్, జాన్వీ జంటగా నటిస్తున్న చిత్రమిది. శశాంక్ ఖేతన్ దర్శకత్వం వహిస్తున్నారు. రోహిత్ సరాఫ్, సన్యా మల్హోత్రా కీలకపాత్రలు పోషిస్తున్నారు.

రెహ్మాన్‌కు అస్వస్థత

● చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్



ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ. ఆర్ రెహ్మాన్ ఆదివారం ఉదయం స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే ఆయన్ను చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత ఆయన డిశ్చార్జ్ అయ్యారు. డీహైడ్రేషన్, గ్యాస్ట్రిక్ సమస్య కారణంగా ఆయన ఒకింత అస్వస్థతకు గురవ్వడంతో, ఇందుకోసం చికిత్స తీసుకున్నారని రెహ్మాన్ సోదరి రెహానా వెల్లడించారు. ‘డీ హైడ్రేషన్, గ్యాస్ట్రిక్ ట్రబుల్ కారణంగా రెహ్మాన్ అస్వస్థతకు గురయ్యారు. చికిత్స తర్వాత కోలుకున్నారు. మధ్యాహ్నం ఆయనను డిశ్చార్జ్ చేసి ఇంటికి పంపించాం’ అని వైద్యులు పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ హాస్పిటల్ నిర్వాహకులకు ఫోన్ చేసి రెహ్మాన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మాజీ భార్య అనొద్దు : సైరా బాను



రెహ్మాన్ అనారోగ్యానికి గురయ్యారంటూ వచ్చిన వార్తలపై ఆయన భార్య సైరా బాను స్పందించారు. ఆయన ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అలాగే, తన గురించి ప్రస్తావించేటపుడు రెహ్మాన్ మాజీ భార్య అని పిలవొద్దు అని ఆమె కోరారు. తాము ఇంకా అధికారికంగా విడాకులు తీసుకోలేదన్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నానని, అందుకే రెహ్మాన్‌కు దూరంగా ఉంటున్నాననీ ఆమె వెల్లడించారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు



ప్రదీప్ మాచిరాజు కథానాయకుడిగా నటిస్తున్న ప్రేమకథా చిత్రం ‘అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి’. దీపికా పిల్లి కథానాయిక. మాంక్స్ అండ్ మంకీస్ బేనర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి నితిన్, భరత్ దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం విడుదల తేదీని ప్రకటించింది. ఏప్రిల్ 11న ‘అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి’ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. కొత్త తరహా ప్రేమకథతో తెరకెక్కిన చిత్రమిదనీ, కుటుంబ ప్రేక్షకులను, యువతను ఆకట్టుకునే హంగులతో తెరకెక్కించామనీ మేకర్స్ తెలిపారు. వెన్నెల కిశోర్, సత్య, గెటప్ శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి రధన్ సంగీతం అందిస్తున్నారు. కథ, మాటలు: సందీప్ బొల్లా, సినిమాటోగ్రఫీ:ఎంఎన్ బాల్‌రెడ్డి, ఎడిటర్: కోడాటి పవన్‌కల్యాణ్

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
వరంగల్ ● సోమవారం 17 మార్చి 2025

ఫ్యామిలీ ఉండాల్సిందే!



విరాట్ కోహ్లీ

బెంగళూరు: ఆస్ట్రేలియా పర్యటనలో టీవీ ఇండియా వైఫల్యం తర్వాత ఆటగాళ్లపై బీసీసీఐ కఠిన ఆంక్షలను అమలు చేస్తోంది. ఇందులో ప్లేయర్స్ వెంట కుటుంబ సభ్యుల బసపై పరిమితి కూడా ఉంది. 45 రోజులకుపైగా విదేశీ పర్యటన ఉంటే కుటుంబ సభ్యులు కేవలం రెండు వారాలపాటు మాత్రమే ఉండేందుకు అనుమతిస్తారు. అయితే ఈ నిర్ణయంపై విరాట్ కోహ్లీ అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 'మైదానంలో కఠిన పరిస్థితులు ఏర్పడినప్పుడు కుటుంబ సభ్యులతో గడిపితే సాంత్వనగా ఉంటుంది. అలాంటి వేళ వారి మద్దతు అవసరమే. ఏ క్రికెటర్‌ను అడిగినా ఇదే చెబుతాడు. మ్యాచ్ ఆడాక రూమ్‌కి వెళ్లి ఒంటరిగా, ఎవరితోనూ మాట్లాడకుండా ఉండలేను. క్రికెట్ ఆడడం మా బాధ్యత. అదయ్యాకే కుటుంబం గురించి ఆలోచిస్తాం. నేనైతే ఫ్యామిలీతో ఎంజాయ్ చేసే సమయాన్ని వదులుకోను' అని విరాట్ తేల్చాడు.

తిండిపై చర్చ ఎందుకు?: తన వ్యక్తిగత విషయాలపై బ్రాడ్‌కాస్టర్లు చర్చించాల్సిన అవసరం లేదని కోహ్లీ స్పష్టం చేశాడు. "బ్రాడ్‌కాస్ట్ షోలో క్రికెట్ గురించే మాట్లాడుకోవాలి కానీ 'విరాట్ నిన్న లంచ్‌లో ఏం తిన్నాడు? అతడికిష్టమైన ఛోలే భటూరే ఢిల్లీలో ఎక్కడ దొరుకుతుందనే విషయాలపై చర్చ అనవసరమ"ని కోహ్లీ సూచించాడు.


శాంసన్ వస్తున్నాడు..



బెంగళూరు: ఐపీఎల్ ఆరంభానికి ముందు రాజస్థాన్ రాయల్స్ అభిమానులకు శుభవార్త. ఆ జట్టు కెప్టెన్ సంజూ శాంసన్ చేతివేలి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఈమేరకు అతడికి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందింది.

ఆస్ట్రేలియన్ జీపీ విజేత నోరిస్

» హామిల్టన్‌కు పదో స్థానం



మెల్‌బోర్న్: వరల్డ్ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్‌కు ఝలక్ ఇచ్చిన మెక్ లారెన్ ఎఫ్1 డ్రైవర్ లాండో నోరిస్ ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రీ విజేతగా నిలిచాడు. వర్షంతోపాటు నాటకీయ పరిణామాలు చోటు చేసుకొన్న రేసులో పోల్‌పొజిషన్ నుంచి ఫైనల్ రేసును ఆరంభించిన నోరిస్ కేవలం 0.895 సెకన్ల తేడాతో రెడ్‌బుల్‌కు చెందిన వెర్‌స్టాపెన్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానంలో నిలిచాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్ మూడోస్థానం దక్కించుకొన్నాడు. కాగా, ఫెరారీ తరఫున తొలిసారి బరిలోకి దిగిన ఏడుసార్లు చాంపియన్ లూయిస్ హామిల్టన్ 10వ స్థానంలో నిలిచాడు. ఫెరారీ టీమ్ వ్యూహాత్మక తప్పిదాలతో రేస్‌ను ఓడాల్సి వచ్చిందని హామిల్టన్ తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు.

ఆఖరి రోజు 12 పతకాలు

ప్రపంచ శీతాకాల క్రీడలు

ట్యూరిన్ (ఇటలీ): ప్రత్యేక ఒలింపిక్స్ ప్రపంచ శీతాకాల క్రీడల ఆఖరి రోజు పోటీల్లో భారత్ క్రీడాకారులు పన్నెండు పతకాలు కైవసం చేసుకున్నారు. ఆదివారం ముగిసిన ఈ పోటీల్లో భారత్ ఎనిమిది స్వర్ణాలు సహా మొత్తం 33 పతకాలు సాధించింది. ఆఖరి రోజు జరిగిన 25 మీటర్ల స్నోషూయింగ్‌లోని వివిధ విభాగాల్లో భారత్ పతకాలు గెల్చుకుంది.

పాక్ జట్టు కంటే భారత్ మెరుగు

ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ: పాకిస్థాన్ కంటే భారత క్రికెట్ జట్టు మెరుగైనదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఆదివారం లెక్స్ ఫ్రిడ్‌మన్ అనే అమెరికా పాడ్‌కాస్టర్ నిర్వహించిన చర్చలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెక్స్ అడిగిన పలు క్రీడాసంబంధిత ప్రశ్నలకు మోదీ తనదైన శైలిలో బదులిచ్చారు. తాను క్రీడల్లో నిష్ణాతుడిని కాదని, సాంకేతిక అంశాలు తనకు తెలియదని, అయితే తాజాగా ముగిసిన చాంపియన్స్ ట్రోఫీ ఫలితాల ఆధారంగా పాక్ కంటే భారత్ జట్టు మెరుగైందని చెప్పగలనని మోదీ అన్నారు. ప్రపంచంలో గొప్ప ఫుట్‌బాలర్ ఎవరని వ్యాఖ్యాత అడగ్గా.. 80వ దశకంలో డిగో మారడోనాను మించిన వారు లేరు. ఈ తరంలో లియోనెల్ మెస్సీ గొప్ప ఆటగాడని మోదీ చెప్పారు. భారత్‌లోనూ ఫుట్‌బాల్‌కు ఆదరణ పెరిగిందన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఓ చిన్న పట్టణంలో ఫుట్‌బాల్‌కున్న ఆదరణ చూసిన ఆశ్చర్యపోయానని అన్నారు. 'క్రీడలు ప్రజలను దగ్గర చేస్తాయి. ప్రపంచ మొత్తాన్ని ఉత్తేజపరిచే శక్తి క్రీడలకు ఉంది. దేశాలకు అతీతంగా క్రీడా స్ఫూర్తి ప్రజలను దగ్గర చేయగలదు. మానవ పరిణామ క్రమంలో క్రీడలు కీలక పాత్ర పోషించాయి' అని మోదీ చెప్పారు.

ఆరో టైటిల్ వేటలో..

ఐపీఎల్ మరో 5 రోజుల్లో

పునర్వైభవం కోసం ముంబై..

● పాండ్యా కెప్టెన్సీకి పరీక్ష



రోహిత్, కెప్టెన్ హార్దిక్

గతేడాది కెప్టెన్సీ మార్పు.. పేలవ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన ముంబై ఇండియన్స్ ఈసారి అసలుసిసలు సత్తా చాటాలనుకొంటోంది. ఐదుసార్లు మెగా లీగ్ విజేతగా నిలిచిన ముంబై.. రికార్డుస్థాయిలో ఆరో టైటిల్‌పై గురిపెట్టింది. రోహిత్ శర్మ స్థానంలో హార్దిక్ పాండ్యాను సారథిగా ప్రకటించడంతో అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మైదానంలో పాండ్యాకు అవహేళనలు కూడా ఎదురయ్యాయి. అయితే, ఆ తర్వాత జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో భారత్‌ను విజేతగా నిలపడంలో హార్దిక్ కీలకపాత్ర పోషించాడు. తాజాగా చాంపియన్స్ ట్రోఫీలో కూడా ఆకట్టుకోవడంతో.. ఈసారి ఫ్యాన్స్ అండగా నిలుస్తారని భావిస్తున్నారు. గత సీజన్ చివరి మ్యాచ్‌లో స్లోఓవర్ రేట్ కారణంగా పాండ్యాపై ఒక మ్యాచ్ వేటుపడింది. దీంతో ఈ 18వ అంచెలో తొలి మ్యాచ్‌కు అతడు దూరం కానుండడంతో.. తాత్కాలికంగా రోహిత్ జట్టును నడిపించే అవకాశం ఉంది. మెగా వేలం తర్వాత జరుగుతున్న లీగ్ కావడంతో జట్టు కుదురుకోవడానికి కొంత సమయం పట్టనుంది. వెన్నునొప్పితో బాధపడుతున్న స్టార్ పేసర్ బుమ్రా ఆలస్యంగా బరిలోకి దిగే చాన్సులున్నాయి. రోహిత్, హార్దిక్, బుమ్రా, సూర్యకుమార్, తిలక్ వర్మ కోర్ టీమ్. బ్యాటర్లు ర్యాన్ రికెల్టన్ (దక్షిణాఫ్రికా), రాబిన్ మింజ్ ఈసారి ప్రత్యేక ఆకర్షణ. ట్రెంట్ బౌల్ట్, శాంట్నర్, రీస్ టోప్లే, విల్ జాక్స్, బెవాన్ జాకబ్స్‌తో టీమ్ పటిష్ఠంగా కనిపిస్తోంది. బ్యాటింగ్‌లో జట్టు ఎంతో బలంగా ఉంది. తరచూ గాయపడే దీపక్ చాహర్ పేస్ భారాన్ని ఏమేరకు మోస్తాడో చూడాలి. ఏడు, ఎనిమిది స్థానాల్లో సరైన ఫినిషర్ లేని లోటు కనిపిస్తోంది.

ముంబై జట్టు

బ్యాటర్లు: రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, బెవాన్ జాకబ్స్, రాబిన్ మిన్జ్, నమన్ ధిర్, రికెల్టన్, కృష్ణన్ శ్రీజిత్
ఆల్ రౌండర్లు: హార్దిక్ పాండ్యా, రాజ్ బవా, కోర్బిన్ బాష్, విల్ జాక్స్, శాంట్నర్, తిలక్ వర్మ
బౌలర్లు: జస్‌ప్రీత్ బుమ్రా, అశ్వన్ కుమార్, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్, ముజిబుర్ రహ్మాన్, విఘ్నేష్ పుతుర్, సత్యనారాయణ రాజు, కర్ణ్ శర్మ, అర్జున్ టెండూల్కర్, రీస్ టోప్లే.

ధోనీకి ఘనంగా గుడ్‌బై చెప్పాలి!

ఆల్‌రౌండర్ల అండతో సీఎస్‌కే



ధోనీ, కెప్టెన్ రుతురాజ్

ఐపీఎల్ చరిత్రలో అత్యంత నిలకడైన జట్టు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే). ధోనీ చివరి లీగ్‌గా భావిస్తున్న నేపథ్యంలో యువ తరం ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వేలం తర్వాత జట్టులో భారీ మార్పులు రావడంతో.. కుదురుకోవడానికి కొంత సమయంపట్టే అవకాశం ఉంది. మొత్తంగా చూస్తే ఈసారి ఆల్‌రౌండర్లపైనే చెన్నై ఎక్కువగా ఆధాపడేలా కనిపిస్తోంది. మహీ టీమ్‌లో ఉంటే ఫ్యాన్స్‌కు ఉండే జోషే వేరు. అతడిపై భారం లేకుండా చూడాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఓవరాల్‌గా ముంబైతో సమంగా ఐదు టైటిళ్లు సాధించిన చెన్నై.. ఈసారి టైటిల్‌తో ధోనీకి ఘనంగా వీడ్కోలు పలకాలనుకొంటోంది. గత సీజన్‌లో ఐదో స్థానంలో నిలిచిన సీఎస్‌కే ప్లేఆఫ్స్ బెర్త్‌ను త్రుటిలో చేజార్చుకొంది. కాగా, రుతురాజ్ గైక్వాడ్ బ్యాటర్‌గా ఆకట్టుకొంటున్నా.. కెప్టెన్‌గా ధోనీ స్థాయిని అందుకోలేక పోతున్నాడు. ధోనీ, జడేజా దూరమైతే ఇప్పుడిప్పుడే ఆలోటును భర్తీ చేయడం కష్టమే..! కాన్వే, రచిన్ రవీంద్ర, గైక్వాడ్, ధోనీతో జట్టు బ్యాటింగ్ బలంగా కనిపిస్తోంది. అయితే, మ్యాచ్ విన్నరైన పేసర్ లేకపోవడం ఆందోళన కలిగించే అంశం. అశ్విన్, శివం దూబే, రవీంద్ర జడేజా లాంటి ఆల్‌రౌండర్లతో మిడిలార్డర్ బలంగా ఉంది. పేస్ బౌలింగ్ విభాగంలో మహీష్ పతిరన, ఖలీల్ అహ్మద్, సామ్ కర్రాన్, నాథన్ ఎల్లీస్ జట్టులో ఉన్నారు.

చెన్నై జట్టు

బ్యాటర్లు: రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), డెవాన్ కాన్వే, ధోనీ, రాహుల్ త్రిపాఠి, వన్ష్ బేడీ, రషీద్
ఆల్ రౌండర్లు: రవీంద్ర జడేజా, శివం దూబే, రవిచంద్రన్ అశ్విన్, రచిన్ రవీంద్ర, అన్షుల్ కాంబోజ్, సామ్ కర్రాన్, దీపక్ హుడా, జేమీ ఓవర్టన్, విజయ్ శంకర్, రామకృష్ణ ఘోష్, కమలేష్ నాగర్‌కోటి, ముకేష్ చౌదరి
బౌలర్లు: పతిరన, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్, గుర్‌జప్‌నీత్ సింగ్, నాథన్ ఎల్లీస్, శ్రేయాస్ గోపాల్.

పాక్ 91 ఆలౌట్

కివీస్ చేతిలో చిత్తు

క్రైస్ట్‌చర్చ్: చాంపియన్స్ ట్రోఫీలో దారుణ వైఫల్యంతో ఇంటా బయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న పాక్ జట్టుకు తాజాగా మరో పరాభవం. ఆదివారం న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో పాక్ 9 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడింది. రిజ్వాన్, బాబర్ ఆజమ్‌లపై వేటు వేసి మరీ ఎంపిక చేసిన ఈ జట్టు ముందుగా బ్యాటింగ్‌కు దిగి 18.4 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. 11/4తో ఇబ్బందుల్లో పడిన జట్టు ఖుష్దిల్ (32) పోరాటంతో ఆ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. ఎనిమిది మంది బ్యాటర్లు పది పరుగుల్లోపే అవుటయ్యారు. జేకబ్ డఫీకి నాలుగు (4/14), మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ జేమిసన్‌కు మూడు (3/8), సోధికి రెండు వికెట్లు దక్కాయి. అనంతరం ఛేదనలో కివీస్ 10.1 ఓవర్లలో 92/1 స్కోరుతో గెలిచింది.

ఇండియాదే 'మాస్టర్స్'

చెలరేగిన రాయుడు

ఫైనల్లో విండీస్ ఓటమి





రాయుడు (74)


రాయ్‌పూర్: అంబటి రాయుడు (74) అదరగొట్టడంతో అంతర్జాతీయ మాస్టర్స్ లీగ్ (ఐఎంఎల్) తొలి సీజన్‌లో ఇండియా మాస్టర్స్ విజేతగా నిలిచింది. ఆదివారం వెస్టిండీస్ మాస్టర్స్‌తో జరిగిన ఫైనల్లో 6 వికెట్ల తేడాతో సచిన్ సేన గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లారా సేన 20 ఓవర్లలో 7 వికెట్లకు 148 పరుగులు చేసింది. లెండిల్ సిమ్మన్స్ (57), ఓపెనర్ డ్వేన్ స్మిత్ (45) మాత్రమే రాణించారు. వినయ్ కుమార్‌కు మూడు, షాబాజ్ నదీమ్‌కు రెండు వికెట్లు పడ్డాయి. ఆ తర్వాత ఛేదనలో ఇండియా మాస్టర్స్ 17.1 ఓవర్లలో 4 వికెట్లకు 149 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు రాయుడు, సచిన్ ఆరంభం నుంచే ఎదురుదాడి ఆరంభించారు. ముఖ్యంగా రాయుడు స్ట్రయిక్ ఎక్కువగా తీసుకుని భారీ షాట్లతో ఆకట్టుకున్నాడు. అటు ఉన్న కాసేపు సచిన్ తన మాస్టర్ క్లాస్ ఆటతీరుతో అభిమానులను అలరించాడు. థర్డ్ మ్యాన్ దిశగా బాదిన ఓ ఫోర్, సిక్సర్ చూశాక సచిన్‌లో సత్తా ఏమాత్రం తగ్గలేదనిపించింది. ఎనిమిదో ఓవర్‌లో తను అవుట్ కావడంతో తొలి వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరో ఎండ్‌లో రాయుడు వరుస బౌండరీలతో చెలరేగుతూ 34 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే 15వ ఓవర్‌లో అతడు వెనుదిరిగినా అప్పటికే విజయం ఖాయమైంది. చివర్లో బిన్నీ (16 నాటౌట్) దూకుడుతో 17 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది.

సంక్షిప్త స్కోర్లు

వెస్టిండీస్ మాస్టర్స్: 20 ఓవర్లలో 148/7 (సిమ్మన్స్ 57, స్మిత్ 45; వినయ్ 3/26, నదీమ్ 2/12);
ఇండియా మాస్టర్స్: 17.1 ఓవర్లలో 149/4. (రాయుడు 74, సచిన్ 25; నర్స్ 2/22)

'మెటల్ కింగ్' అనిల్ అగర్వాల్

పట్టుదలతో శిఖరాగ్రానికి



అనిల్ అగర్వాల్. భారత పారిశ్రామిక సామ్రాజ్యంలో ఈ పేరు తెలియని వారుండరు. పాట్నాకు చెందిన ఈ పారిశ్రామిక దిగ్గజం అంతర్జాతీయంగా 'మెటల్ కింగ్'గా పేరు ప్రతిష్ఠలు గడించారు. జీవితంలో అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నా తట్టుకుంటూ ప్రస్తుతం 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.34,800 కోట్లు) నికర ఆస్తులతో ప్రపంచ కుబేరుల్లో ఒకరిగా ఎదిగి, ఎంతో మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రేరణగా నిలిచారు. ఆయనే వేదాంత రిసోర్సెస్ అధినేత అనిల్ అగర్వాల్.

కుటుంబ నేపథ్యం : అనిల్ అగర్వాల్ 1954 జనవరి 24న బిహార్ రాజధాని పాట్నాలో ఒక మార్వాడి కుటుంబంలో జన్మించారు. తండ్రి ద్వారకా ప్రసాద్ అగర్వాల్‌కు ఒక చిన్న అల్యూమినియం కండక్టర్ల తయారీ వ్యాపారం ఉండేది. పాట్నాలోని మిల్లర్ హైస్కూల్‌లో అనిల్ హైస్కూలు విద్య పూర్తి చేశారు. ఆ పై చదువులకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. దాంతో తండ్రి బిజినెస్‌లో చేరాలని ఉన్నా అప్పటికే ఆ వ్యాపారం గాలిలో దీపంలా మారింది.

ముంబై పయనం: ఇక ఏదైతే అదవుతుందని ప్రయాణ ఖర్చులకు సరిపడా డబ్బులతో అనిల్ ముంబై రైలెక్కారు. పొట్టకూటి కోసం అక్కడ అనేక చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. చివరికి ఒక స్క్రాప్ (లోహాల తుక్కు) డీలర్ వద్ద పని చేస్తూ, ఆ వ్యాపారాన్ని ఔపోసన పట్టి, 1976లో తానే స్క్రాప్ బిజినెస్ ప్రారంభించారు. ముంబైతో పాటు ఇతర రాష్ట్రాల్లోని కేబుల్ కంపెనీల నుంచి స్క్రాప్ కొని, దాన్ని కరిగించి మెటల్‌గా మార్చి ముంబైలోని వివిధ కంపెనీలకు అమ్మడం ప్రారంభించారు.

పారిశ్రామికవేత్తగా : ఈ స్క్రాప్ బిజినెస్ చేస్తూనే అగర్వాల్ మరింత ఎదిగేందుకు బుర్రకు పదును పెట్టారు. 1976లో బ్యాంకు లోన్‌తో షంషేర్ స్టెర్లింగ్ కార్పొరేషన్ అనే కంపెనీని కొనుగోలు చేసి ఎనామిల్డ్ కాపర్ సహా అనేక ఉత్పత్తులు తయారు చేసి అమ్మడం ప్రారంభించారు. పదేళ్ల పాటు ఈ రెండు వ్యాపారాల్ని నెట్టుకొచ్చారు. తర్వాత 1986లో జెల్లీఫిల్డ్ కేబుల్స్ తయారీ కోసం స్టెరిలైట్ ఇండస్ట్రీస్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ బిజినెస్ లాభ నష్టాలు కీలక ముడి పదార్థాలైన రాగి, అల్యూమినియంపై ఆధారపడి ఉండేవి. దాంతో 1993లో దేశంలోనే తొలిసారిగా ప్రైవేటు కాపర్ స్మెల్టర్, రిఫైనరీని ఏర్పాటు చేశారు. 1995లో ఖాయిలా పడిన మద్రాస్ అల్యూమినియం కంపెనీని, 2001లో ప్రభుత్వ రంగంలోని భారత్ అల్యూమినియం కంపెనీని (బాల్కో) కొనుగోలు చేసి కీలక ముడి పదార్థాలైన కాపర్, అల్యూమినియం ధరలు తగ్గించుకున్నారు. 2002లో మరో ప్రభుత్వ రంగ సంస్థ హిందూస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్) ఈక్విటీలోనూ మెజారిటీ వాటా 65 శాతం కొని లోహాల రంగంలో పట్టు పెంచుకున్నారు.

అంతర్జాతీయ మార్కెట్లకు: 2003లో తన గ్రూప్ ప్రధాన కంపెనీ వేదాంత రిసోర్సెస్ షేర్లను లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో లిస్టు చేశారు. ప్రస్తుతం ఈ గ్రూప్ ద్వారానే అనిల్ అగర్వాల్ దేశ, విదేశాల్లోని తన ఖనిజ, మెటల్ కంపెనీలను నిర్వహిస్తున్నారు.

సవాళ్లు : అనిల్ అగర్వాల్ వ్యాపారంలో చాలా సవాళ్లే ఎదుర్కొన్నారు. తమిళనాడు తూత్తుకుడిలోని స్టెరిలైట్ ఇండస్ట్రీస్ కాపర్ స్మెల్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ పేరుతో మూసివేయడం అతి పెద్ద సవాలు. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్లో రాగి, అల్యూమినియం ధరలు పడిపోయాయి. దాంతో కంపెనీ అప్పుల చెల్లింపుల్లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. కొన్ని ఆర్థిక సంస్థలు అప్పుల చెల్లింపు గడువు పొడిగించగా కొన్ని కుదరదన్నాయి. దాంతో ఆ అప్పులు చెల్లించేందుకు అధిక వడ్డీతో కొత్త అప్పులు చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితి చూసి, ఇంకేముంది వేదాంత మరో దివాలా కంపెనీ కాబోతోందనే వార్తలు గుప్పుమన్నాయి.

కొత్త రంగాల్లోకి : ఈ సవాళ్లను తట్టుకుని వేదాంత గ్రూప్ ఇప్పుడు సెమీ కండక్టర్లతో సహా అనేక కొత్త రంగాల్లోకి విస్తరిస్తోంది. రాజస్థాన్‌లోని తన చమురు, గ్యాస్ క్షేత్ర ఉత్పత్తి సామర్థ్యాన్నీ మరింత పెంచుతోంది. ఏదేమైనా అనిల్ అగర్వాల్ వ్యాపార నైపుణ్యాలు, పట్టుదలే ఈ రోజు వేదాంతా గ్రూప్‌ను ప్రముఖ అంతర్జాతీయ లోహాల కంపెనీగా నిలబెట్టాయి. ఈ విధంగా అగర్వాల్ ఎంతోమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మార్గదర్శిగా నిలిచారు.

ఎఫ్‌పీఐ నిధులకు రెక్కలు

» రెండున్నర నెలల్లోనే రూ.1.42 లక్షల కోట్లు తరలింపు
» మార్చిలో 15 రోజుల్లోనే రూ.30,000 కోట్లు..

న్యూఢిల్లీ: దేశీయ ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ఉపసంహరణ యథేచ్ఛగా సాగుతోంది. ప్రపంచ స్థాయిలో వాణిజ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో మార్చి నెల తొలి 15 రోజుల కాలంలో (13వ తేదీ నాటికి) వారు రూ.30,015 కోట్ల నిధులు తరలించుకుపోయారు. ఎఫ్‌పీఐలు జనవరి నెలలో రూ.78,027 కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్లు తరలించుకుపోవడంతో నూతన సంవత్సరంలో తొలి రెండున్నర నెలల కాలంలోనే వారు తరలించుకుపోయిన సొమ్ము మొత్తం రూ.1.42 లక్షల కోట్లకు చేరింది. ఎఫ్‌పీఐలు నికరంగా నిధులు ఉపసంహరించడం వరుసగా ఇది 14వ వారం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలపై నెలకొన్న అస్థిరతల, టారిఫ్‌ల ద్వారా ఏర్పడిన మాంద్యం కారణంగా వర్ధమాన మార్కెట్ల విషయంలో ఎఫ్‌పీఐలు అప్రమత్త వైఖరి అనుసరిస్తున్నాయి. దీనికి తోడు డాలర్ బలపడడం, అమెరికన్ బాండ్లలో రాబడులు పెరగడంతో అమెరికాలో పెట్టుబడులు వారికి ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని విశ్లేషకులంటున్నారు. 2025 సంవత్సరంలో ఇతర మార్కెట్లతో పోల్చితే చైనా మార్కెట్లు మెరుగ్గా ట్రేడవుతున్నందు వల్ల దేశం నుంచి ఎఫ్‌పీఐ నిధులు చైనాకు తరలిపోతున్నాయని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వీకే విజయకుమార్ అన్నారు.

హైదరాబాద్‌లో యాపిల్ ఎయిర్‌పాడ్స్ తయారీ

న్యూఢిల్లీ: అమెరికా టెక్ దిగ్గజం యాపిల్ కంపెనీ ఉత్పత్తి మ్యాప్‌లో హైదరాబాద్ చేరబోతోంది. హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ యూనిట్‌లో ఏప్రిల్ నుంచి యాపిల్ 'ఎయిర్ పాడ్స్' తయారీ ప్రారంభం కానుంది. స్థానిక మార్కెట్ కోసంగాక పూర్తిగా ఎగుమతుల కోసం కంపెనీ ఈ ఎయిర్‌పాడ్స్ తయారు చేయించనుంది. ఐఫోన్ల తర్వాత యాపిల్ కంపెనీ మన దేశంలో తయారు చేసే రెండో ఉత్పత్తి ఎయిర్‌పాడ్స్ కావడం విశేషం.

ఇళ్ల ధరలు మరింత పెరుగుతాయ్...

» క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బొమన్ ఇరానీ

న్యూఢిల్లీ: ఇటీవల బడ్జెట్లో ప్రకటించిన చర్యలతో పాటు, ఆర్‌బీఐ రెపో కోత ప్రభావంతో దేశంలో ఇళ్ల డిమాండు బలంగానే ఉంటుందని క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బొమన్ ఇరానీ అన్నారు. దేశంలో ఇళ్ల డిమాండు మందగించే సంకేతాలేవీ లేవని ఆయన తేల్చి చెప్పారు. అయితే మార్కెట్లో కాలానుగుణంగా ఏర్పడే స్వల్పకాలిక ఆటుపోట్ల గురించి చింతించాల్సిన పని లేదన్నారు. ఈ ఏడాది ఇళ్ల ధరల్లో వృద్ధి ద్రవ్యోల్బణానికి దీటుగానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రధానంగా మౌలిక వసతులపై దృష్టి సారిస్తోందని; ఫలితంగా గృహనిర్మాణం, కార్యాలయం, మాల్స్, వేర్‌హౌసింగ్ రంగాల్లో నూతన అవకాశాలు ఏర్పడుతున్నాయని ఆయన అన్నారు.

బిజినెస్

22,100 దిగువన బేరిష్

(మార్చి 17-21 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ : 22397 (-156)

గత వారంలో నిఫ్టీ 22675-21314 పాయింట్ల మధ్యన కదలాడి 156 పాయింట్ల నష్టంతో 22397 వద్ద ముగిసింది. రాబోయే వారాంతంలో 22100 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

20, 50, 100, 200 డిఎంఏలు 22446, 22447, 22440, 22836 వద్ద ఉన్నాయి.

బ్రేకౌట్ స్థాయి : 22600
బ్రేక్ డౌన్ స్థాయి : 22100
నిరోధ స్థాయిలు : 22500, 22600, 22700 (22400 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 22200, 22100, 22000 (22300 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన : వారం ప్రారంభ స్థాయి కీలకం. ఆ పైన మాత్రమే పొజిషన్లు శ్రేయస్కరం.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



17వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	425
వరంగల్	397	గోదావరి	405
చిత్తూరు	443	విశాఖపట్నం	405
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	83	విజయవాడ	87
వరంగల్	83	గుంటూరు	87
కరీంనగర్	83	ఒంగోలు	87
మహబూబ్‌నగర్	83	చిత్తూరు	92
కర్నూలు	83	నెల్లూరు	97
విశాఖపట్నం	81	అనంతపురం	97
గోదావరి	87		

అప్రమత్తతే మంచిది

పుంజుకుంటున్న దేశ ఆర్థిక వ్యవస్థ, ఏప్రిల్‌లో ఆర్‌బీఐ కీలక రెపోరేటు మరో పావు శాతం తగ్గిస్తుందన్న అంచనాలు మార్కెట్లో పాజిటివ్ సెంటిమెంట్‌ను పెంచుతున్నాయి. మరోవైపు డొనాల్డ్ ట్రంప్ సుంకాల భయం మార్కెట్‌ను ఇంకా వెంటాడుతోంది. దీంతో ఈ వారంలో కూడా మన మార్కెట్ మిశ్రమంగానే చలించే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు మరింత దిగజారితే మాత్రం సూచీల్లో మరింత కుదుపు తప్పకపోవచ్చు. ఈ కరెక్షన్‌లోనూ కొన్ని మెటల్, కమోడిటీస్, ఫైనాన్స్ కంపెనీల షేర్లు కొంత బలం ప్రదర్శిస్తున్నాయి. దీర్ఘకాలిక లాభాల కోసం చూసే మదుపరులు ప్రస్తుతం ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్న మంచి కంపెనీల షేర్లలో పెట్టుబడులు ప్రారంభించవచ్చు.

ఈ వారం స్టాక్ రికమండేషన్లు

డీమార్ట్ : జీవిత కాల గరిష్ఠ స్థాయి నుంచి ఈ కంపెనీ షేర్లు ఇప్పటికే 40 శాతం వరకు దిద్దుబాటుకు లోనయ్యాయి. ప్రస్తుతం ఈ షేర్లలో అక్యూములేషన్ జరుగుతోంది. ఈ సంవత్సరం ప్రారంభం నుంచే ఈ కౌంటర్‌లో చక్కటి బేస్ ఏర్పడింది. గత ఏడు సెషన్స్‌లో డీమార్ట్ షేర్లు 15 శాతం మేర పెరిగి గత వారం రూ.3,797 వద్ద ముగిశాయి. రూ.4,250 టార్గెట్‌తో మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.3,750 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.3,650ని గట్టి స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఆర్ఈసీ లిమిటెడ్ : గత ఏడాది జూలై నుంచి డౌన్ ట్రెండ్‌లో ఉన్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం బేస్ ఏర్పడుతోంది. గత వారమే రెసిస్టెన్స్‌ను బ్రేక్ చేసింది. నిఫ్టీతో పోలిస్తే మాత్రం కొద్దిగా బలహీనంగానే ఉంది. గత వారం రూ.406 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.455 టార్గెట్‌తో రూ.400/390 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.384ను కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పాటించాలి.

వరుణ్ బేవరేజెస్ లిమిటెడ్ : కొద్ది నెలలుగా ఈ కౌంటర్ డౌన్‌ట్రెండ్‌లో ఉంది. వేసవి ప్రారంభం కావడంతో కంపెనీ షేర్లపై మదుపరులకు మళ్లీ ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఈ కంపెనీ షేర్లు ఆకర్షణీయమైన ధరల్లోనే లభిస్తున్నాయని చెప్పాలి. గత వారం రూ.488 వద్ద ముగిశాయి. రూ.575 టార్గెట్‌తో మదుపరులు రూ.475 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ : రూ.450.

అదానీ గ్రీన్ : ఈ కంపెనీ షేర్లు మరోసారి కీలక స్థాయి రూ.870 వద్ద మద్దతు తీసుకున్నాయి. గత త్రైమాసికంలో అమ్మకాలు తగ్గినా అదానీ గ్రీన్ ఈపీఎస్ పెంచుకుంది. గురువారం రూ.873 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,050 టార్గెట్‌తో రూ.840 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.810ని గట్టి స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

చెన్నై పెట్రో : కొద్ది నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో ఉన్న ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం కోలుకుంటున్నట్టు కనిపిస్తున్నాయి. రూ.440 వద్ద భారీ వాల్యూమ్స్‌తో వీ షేప్ రికవరీ కనిపిస్తోంది. నిఫ్టీతో పోలిస్తే గత నెల 10.27 శాతం, గత వారం 8.18 శాతం మేర పెరిగాయి. గత వారం రూ.570 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.700 టార్గెట్‌తో రూ.550 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.525ను స్ట్రిక్ట్ స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ప్రధాన నిరోధం 22,700

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తదుపరి నిరోధం 22700 వరకు వెళ్లి రియాక్షన్‌కు గురైనా ఇటీవల ఏర్పడిన గరిష్ఠ స్థాయి 22000 కన్నా చాలా పైన క్లోజయింది. తక్షణ ముప్పు లేదనేందుకు ఇది సంకేతం. గత మూడు వారాలుగా సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ధోరణిలో 22700-22000 పాయింట్ల మధ్యన కదలాడుతోంది. అమెరికా మార్కెట్లో గత శుక్రవారం నాటి పునరుజ్జీవం వల్ల ఈ వారంలో నిఫ్టీ పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ రికవరీలో ఇటీవల ఏర్పడిన గరిష్ఠ స్థాయిల్లో పరీక్షకు గురి కావచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత సానుకూలత కోసం నిఫ్టీ నిరోధ స్థాయి 22550 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 22700. ఇదే స్వల్పకాలిక నిరోధం కావడం వల్ల ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు : ప్రస్తుత ప్రధాన నిరోధం 22550 వద్ద విఫలమైతే బలహీనపడుతుంది. అప్రమత్తం కావాలి. ప్రధాన మద్దతు స్థాయి 22300.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 440 పాయింట్ల మేరకు నష్టపోయి 48000 వద్ద ముగిసింది. అయితే ఈ స్థాయిలో గత రెండు నెలలుగా పలు బాటమ్‌లు ఏర్పడ్డాయి. రికవరీ బాట పడితే సానుకూలత కోసం ప్రధాన నిరోధం 48600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 48000 కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ మరోసారి 25 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. 22700 స్థాయిలో కన్సాలిడేషన్‌కు ఆస్కారం ఉంది. సానుకూలత కోసం ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,490, 22,550
మద్దతు	22,400, 22,340

హామీలను నెరవేర్చకుండా
సీఎం టైం పాస్ చేస్తున్నారు

» రైతు భరోసా, ఉద్యోగాలు ఇవ్వడమే లేదు: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, సుభాష్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సీఎం రేవంత్‌రెడ్డి టైం పాస్ చేస్తున్నారని.. రైతు భరోసా, ఉద్యోగాలు ఇవ్వకుండా మభ్యపెడుతున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం కవిత ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు ఇచ్చిన హామీలను మరచిపోయిందని, బీఆర్‌ఎస్ హయాంలో రంజాన్ మాసంలో మసీదులకు లక్ష రూపాయలు ఇచ్చేదని, కాంగ్రెస్ సర్కారు వచ్చాక ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాగా, గ్రూప్-1 పరీక్షలు, ఫలితాలపై అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న అనుమానాలను ప్రభుత్వం, టీజీపీఎస్సీ నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో పలు వర్సిటీల విద్యార్థులు, ప్రతినిధులు కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి చర్చించారు. తమ అనుమానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, శాసనమండలిలో ఈ అంశాన్ని లేవనెత్తాలని వారు కోరారు. అనంతరం హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ భాషలో కవితలు, కథల పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విద్యార్థుల ఆందోళనపై సర్కారు ఉక్కుపాదం

» సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీ కుట్ర: కేటీఆర్



హైదరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పాలన అందిస్తామంటూ ఇచ్చిన ఏడో గ్యారెంటీని కాంగ్రెస్ తుంగలో తొక్కిందని ఆదివారం ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. వర్సిటీ విద్యార్థుల ఆందోళనలపై నిషేధం విధించడం దుర్మార్గపు చర్య అని, ఇది ఎమర్జెన్సీ రోజులను గుర్తుచేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల భోజనంలో పురుగులు, బ్లేడ్లు వస్తుండడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. అలాంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాల్సిన ప్రభుత్వం విద్యార్థుల గొంతు నొక్కుతోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ సింగరేణి సంస్థను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. రెండు బొగ్గు బ్లాకులను ఇప్పటికే ప్రైవేటుపరం చేసి, ఇప్పుడు ఉన్నతస్థాయి ఉద్యోగాలను కూడా ప్రైవేటుకు కట్టబెట్టాలనుకోవడం మరో ప్రమాద హెచ్చరిక అని తెలిపారు. సింగరేణిని కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జంగ్ సైరన్ మోగిస్తామని హెచ్చరించారు.

బీజేపీవి మతోన్మాద రాజకీయాలు: జాన్ వెస్లీ

సిరిసిల్ల రూరల్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద రాజకీయాలకు పాల్పడుతోందని, దక్షిణ భారతదేశంలో పార్లమెంట్ సీట్లు తగ్గించడానికి ప్రయత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అన్ని పార్టీల నేతలతో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి బీజేపీ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒత్తిడి తేవాలన్నారు. ఆదివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ బీసీ కుల గణనకు ఎందుకు అడ్డుపడుతోందని ప్రశ్నించారు. సిరిసిల్లలో లక్షలాది మంది కార్మికులు నివాసం ఉంటున్నారని, వారి కోసం ఏర్పాటు చేస్తామన్న ఈఎస్‌ఐ హాస్పిటల్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకుంటే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విద్యార్థుల ఆత్మహత్యల కట్టడికి చర్యలు

» గురుకులాల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి

హైదరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ప్రతి పది మంది విద్యార్థుల్లో ఒకరు ఆత్మహత్య ఆలోచనలతో, అందరిలో ఉన్నా ఎప్పుడూ ఒంటరివారిమనే భావనతో బతకడం దండగ అనే తలంపుతో ఉంటున్నారని సర్వే ద్వారా వెల్లడైందని గురుకులాల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి తెలిపారు. దేశంలో మెల్బోర్న్ వర్సిటీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌తోపాటు పలు ఇండియన్ మెడికల్ కాలేజీలు సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ఆందోళన కలిగించే ఈ విషయాలను వెలుగులోకి వచ్చాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గురుకులాల్లోని విద్యార్థులకు ఆత్మహత్య ఆలోచనలు రాకుండా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గురుకులాల్లో ఉపాధ్యాయులకు విద్యార్థుల మానసిక ఆరోగ్యం, వారి మానసిక పరివర్తనపై శిక్షణ ఇప్పించాలని నిర్ణయించామన్నారు. విద్యార్థుల్లో కుంగుబాటును దూరంచేసి మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు మాస్టర్ ట్రైనర్ రవీ నేతృత్వంలో మ్యాజిక్ ఆఫ్ ఛేంజ్ సంస్థతో కలిసి సోమవారం నుంచి విడతల వారీగా ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో గురుకుల టీచర్లకు శిక్షణ ఇప్పించనున్నట్లు వెల్లడించారు.

'అత్యవసర అంబులెన్స్'లకు ప్రత్యేక యాప్!

» నిజంగా అవసరమైన వారికి ట్రాఫిక్ పోలీసుల సహకారం

» త్వరలో అందుబాటులోకి తేనున్న హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అంబులెన్స్ సైరన్లు, అంబులెన్సులను ఇటీవలి కాలంలో కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఇష్టానుసారంగా, ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా వెళ్తున్నారు. ఇకపై ఇలాంటి కేటుగాళ్ల ఆట కట్టించడమే లక్ష్యంగా హైదరాబాద్ నగర ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తేనున్నారు. హైదరాబాద్‌లో సుమారు 6 వేల అంబులెన్స్‌లు వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వాటిలో 10 శాతం మంది డ్రైవర్లు అంబులెన్స్‌లను దుర్వినియోగం చేసినా నగర ట్రాఫిక్‌పై తీవ్ర ప్రభావం పడే అవకాశముంది. ఈ క్రమంలో అంబులెన్స్ సేవలను క్రమబద్ధీకరించడానికి ప్రత్యేక యాప్‌ను తెస్తున్నారు. ఐటీ సెల్ అధికారులు, సిటీ పోలీస్ ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో యాప్‌ను రూపొందిస్తున్నారు. విధి విధానాలు, ఆస్పత్రి యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైవర్లు పాటించాల్సిన నిబంధనలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అంబులెన్స్ బయల్దేరేటప్పుడు ఆస్పత్రి నిర్వాహకులు ముందుగానే యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. కచ్చితంగా ట్రాఫిక్ క్లియర్ చేయాల్సిన అవసరముందా? లేక సాధారణ ట్రాఫిక్‌లో వెళ్లొచ్చా? డ్రైవర్ పేరు, ఫోన్ నంబర్, ఇలా పలు వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. అత్యవసరమని ఆస్పత్రి భావిస్తే, కూడళ్ల వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ వెళ్లే మార్గంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తారు. త్వరలోనే ఈ యాప్ అందుబాటులోకి రానుంది.

పోలీసు క్లినిక్స్‌లో మందులు కరువు!

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని వివిధ యూనిట్లలోని పోలీసు ఆసుపత్రుల్లో కనీసం జ్వరం గోళీలు కూడా దొరకని దుస్థితి నెలకొంది. స్పెషల్ పోలీసు బెటాలియన్లు, పోలీసు అకాడమీ, ఎస్పీఎఫ్ తదితర పోలీసు యూనిట్లలో వైద్యులు అందుబాటులో ఉంటున్నారు కానీ, వారు ఉచితంగా మందులు ఇవ్వలేని నిస్సహాయస్థితిలో పడ్డారు. పోలీసుల్లో చాలామంది వివిధ రకాల అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇక వీరి వృద్ధ తల్లిదండ్రులకు పోలీసు ఆసుపత్రులే దిక్కు. అయితే, ఇక్కడ జ్వరం, ఒళ్లునొప్పుల్లాంటి సమస్యలకు గోళీలు కూ డా ఉండటం లేదు. చాలా యూనిట్లలో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు 'ఆంధ్రజ్యోతి' జరిపిన పరిశీలనలో స్పష్టమైంది. వాస్తవానికి పోలీసు శాఖకు మందుల సరఫరాకు సంబంధించిన పాతబిల్లులు ట్రెజరీలో ఏడాదికిపైగా పెండింగ్‌లో ఉండటంతో ఈ పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. పోలీసు ఆసుపత్రుల్లో మందులు లేకపోతే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు బయట మెడికల్ షాపుల్లో కొనుక్కుని ఆ డబ్బును రీయింబర్స్‌మెంట్ కోసం పెట్టుకుంటే ఆ చిన్న మొత్తాలు కూడా మంజూరవడం లేదని పోలీసు సిబ్బంది వాపోతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని పోలీసు సిబ్బంది అంతర్గత సంభాషణల్లో కోరుకుంటున్నారు.

ఇంకా లభ్యం కాని ఏడు మృతదేహాలు

» ఎస్‌ఎల్‌బీసీలో 23 రోజులుగా శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు

» చెప్పాపెట్టకుండా వెళ్లిపోతున్న రెస్క్యూ కార్మికులు

దోమలపెంట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్ ప్రమాదం తర్వాత.. 23 రోజులుగా సహాయక చర్యలు కొనసాగుతున్నా.. ఇంకా ఏడుగురి మృతదేహాలు లభ్యమవ్వలేదు. ఈ ప్రమాదంలో 8 మంది మృతిచెందగా.. గత వారం టీబీఎం ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్ మృతదేహాన్ని వెలికి తీసిన విషయం తెలిసిందే.! మిగతా మృతదేహాల కోసం ఆర్మీ, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి, రైల్వే, హైడ్రా, అన్వి రోబో టెక్ తదితర 12 బృందాలు, కాడవర్ డాగ్స్ నిర్విరామంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఆదివారం డీ-2 ప్రాంతంలో పూర్తిగా ఐరన్ ప్లేట్లు, టీబీఎం విడిభాగాలు, తెగిపోయిన కన్వేయర్ బెల్ట్ శిథిలాలను తొలగించారు. దాంతో ఎక్స్‌కవేటర్ అక్కడి దాకా వెళ్లి, మట్టి శిథిలాలను తొలగించగలుగుతోంది. అయితే.. డీ-1 ప్రాంతంలో దాదాపు 20 అడుగుల మేర మట్టి, బురద, రాళ్లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో సెగ్మెంట్ బ్లాకులు దెబ్బతిని, నెర్రెలు బారాయి. దీంతో.. మరో ప్రమాదం జరగకుండా ఉండేందుకు సింగరేణి గనుల్లో వినియోగించే టైగర్‌క్లాక్స్‌ను సొరంగం పైకప్పునకు సపోర్టుగా పెట్టారు. నీటి ఊట ఏమాత్రం తగ్గడం లేదని, సొరంగం పైకప్పులను అనుక్షణం గమనిస్తూ సహాయక బృందాలు పనిచేస్తున్నాయని సింగరేణి జీఎం బైద్య 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా, సహాయక చర్యల్లో పాల్గొంటున్న కొందరు కార్మికులు అధికారులకు చెప్పాపెట్టకుండా వెళ్లిపోతున్నారు. దీంతో కలెక్టర్ సంతోష్ ఆదివారం ఎస్‌ఎల్‌బీసీకి చేరుకున్నారు. కార్మికులను కలిసి మాట్లాడారు. వారికి అందుతున్న భోజనం, వసతి తదితర సదుపాయాలను గురించి అడిగి, తెలుసుకున్నారు. సహాయక చర్యల్లో పాల్గొనే వారికి అసౌకర్యం కలగకుండా చూడాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు.



సహాయక చర్యల్లో సింగరేణి జీఎం బైద్య, కార్మికులు

పోడుకు ప్రాణ జలం

పోడు భూములకు 'ఇందిర గిరి జల వికాసం'!?.. రూ.12,600 కోట్లతో గిరిజనులకు సాగునీరు



హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతుల పోడు సాగుకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టాలిచ్చిన పోడు భూముల్లో సేద్యానికి అవసరమైన సాగు నీటిని అందించేందుకు 'ఇందిర గిరి జల వికాసం' పేరిట కొత్త పథకాన్ని అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ పథకాన్ని బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. కొత్త పథకం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) రూ.600 కోట్లు.. వచ్చే నాలుగేళ్లలో ఏడాదికి రూ.3000 కోట్ల చొప్పున రూ.12,600 కోట్లను ఖర్చు చేయాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ నిధులతో పట్టా పోడు భూముల్లో బోర్లు వేయించి, సోలార్ పంపు సెట్లను అందించనుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎం-కుసుమ్ పథకం కింద వచ్చే నిధులను కూడా వినియోగించుకోనున్నారు. దీంతోపాటు గిరిజనుల కోసం కేంద్రం ప్రారంభించిన ధాత్రి అభియాన్ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ-జేజీయూఏ) పథకం కింద కూడా నిధులు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఇందిర గిరి జల వికాసం పథకానికి నీటి పారుదల, విద్యుత్తు, రెడ్కో, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఐటీడీఏల ద్వారా నిధులను కేటాయించి వినియోగించనుంది. గిరిజనుల ప్రత్యేక అభివృద్ధి నిధుల్లో ఖర్చు చేయని వాటినీ ఈ పథకం అమలుకు వాడుకోనుంది. ఉద్యానవన, అటవీ శాఖలతోనూ సమన్వయం చేసుకోనున్నట్లు తెలుస్తోంది.

నిధుల కేటాయింపు.. ఖర్చు ఇలా.. (అంచనా)

సంవత్సరం	బడ్జెట్ (రూ.కోట్లలో)	లబ్ధి చేకూరనున్న రైతులు
2024-25	600	10,000
2025-26	3,000	50,000
2026-27	3,000	50,000
2027-28	3,000	50,000
2028-29	3,000	50,000
మొత్తం	12,600	2,10,000

6 లక్షల ఎకరాలు.. 2 లక్షల మందికి లబ్ధి..

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,30,735 మంది పోడు రైతుల పరిధిలోని 6.68 లక్షల ఎకరాలకు పట్టాలున్నాయి. వీటిలో 23,886 మంది రైతులకు చెందిన 69,039 ఎకరాలకు గిరిజన శాఖ ఇప్పటికే రూ.141.57 కోట్లతో సాగునీటి సదుపాయాన్ని కల్పించింది. తర్వాత గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మిగిలిన రైతులు ఎవరికీ నీటి సదుపాయం కల్పించలేదు. ఫలితంగా ఆ భూముల్లో వర్షం పడితేనే పంటలు పండే పరిస్థితి నెలకొంది. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇచ్చిన పోడు భూముల్లో బోర్లు వేయించి, నీటి సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. గిరిజన శాఖ నుంచి నివేదిక తెప్పించగా.. 2,10,000 మంది రైతులకు చెందిన 6 లక్షల ఎకరాలకు నీటి సదుపాయం కల్పించాల్సి ఉందని తేలింది. వీరందరికీ దశల వారీగా కొత్త పథకం కింద నీరందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. సోలార్ పంపు సెట్లను అధికంగా ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని సర్కారు యోచిస్తోంది. రాష్ట్రంలోని పోడు భూముల్లో చాలా వరకు నల్లరేగడి నేలలే ఉన్నాయి. వర్షపు నీటితో మాత్రమే ప్రస్తుతం పంటలు సాగవుతున్నాయి. గిరిజనులు పెద్దగా ఎరువులు కూడా వినియోగించరు. అలాంటి సారవంతమైన భూముల్లో సంప్రదాయ పంటలు కాకుండా.. లాభసాటిగా ఉండే పంటలనే సాగు చేయించాలనే ఆలోచనలో ఉన్నట్లు అధికార వర్గాలు అంటున్నాయి. వ్యవసాయ శాఖ ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర వాణిజ్య పంటలను ప్రోత్సహిస్తోంది. గిరిజనులకు కూడా ఆయా పంటలపై అవగాహన కల్పించి, సాగు చేయిస్తే లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నట్లు తెలిసింది.

పథకం కింద ఏం అందిస్తారంటే..

- గ్రామీణ ఉపాధి పథకం, ఐటీడీఏ, డీఆర్‌డీఏ కింద భూములను సాగుకు అనుకూలంగా అభివృద్ధి చేస్తారు.
- 150/200 అడుగుల లోతులో లేదా భూగర్భ జలాల పరిస్థితిని బట్టి ఆ భూముల్లో బోర్లు వేయిస్తారు.
- 5 హెచ్‌పీ లేదా 7.5 హెచ్‌పీ సామర్థ్యంతో నడిచే సోలార్ పంపు సెట్లను అందిస్తారు.
- ఒక హెక్టారు ఉన్న రైతులకు నేరుగా బోర్లు వేయించి, పంపు సెట్లు అందిస్తారు. అంతకంటే తక్కువ ఉన్న రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి ఈ సదుపాయాలను కల్పించి ఉమ్మడి సాగు చేయిస్తారు.

ఆర్‌ఎంపీలను నియంత్రించడం అసాధ్యం

వైద్య వ్యవస్థతో అనుసంధానం చేయాలి

చర్చా వేదికలో ప్రొఫెసర్ కోదండరాం సూచన

వైద్యుల నిరసనతో ఒక్కసారిగా వేడెక్కిన వేదిక

మంగళ్‌హాట్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎంపీ, పీఎంపీలను పారా మెడికల్ వ్యవస్థతో అనుసంధానం చేసేందుకు సమాలోచనలు జరగాలని ఎమ్మెల్సీ కోదండరాం సూచించారు. వారు ఇప్పటికే నర్సింగ్ హోమ్‌లు, వైద్యులతో అనుసంధానమై ఉన్న విషయం వాస్తవమే కదా అని ప్రశ్నించారు. నకిలీ వైద్యులంటూ ఎన్ని కేసులు పెట్టినా వారిని నియంత్రించడం సాధ్యం కాదని, వారిని ప్రజా ఆరోగ్య వ్యవస్థలో ఉపయోగించుకునేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వడం ఉత్తమమని చెప్పారు. ఆదివారం కోఠిలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రధాన కార్యాలయంలో 'ప్రజారోగ్యానికి వ్యతిరేకంగా నకిలీ వైద్యం' అనే అంశంపై ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దువ్వూరు ద్వారకానాథ్ రెడ్డి అధ్యక్షతన చర్చా వేదిక నిర్వహించారు. ప్రజలు ప్రమాదకర వైద్యం బారిన పడకుండా ఉండేందుకు అందరం కృషి చేయాల్సిన అవసరం ఉందని, దీనికి ఆర్‌ఎంపీ, పీఎంపీలకు తగిన శిక్షణ ఇప్పించి పారా మెడికల్ వ్యవస్థలో భాగం చేయాలని కోదండరాం అన్నారు. అయితే ఆయన అభిప్రాయంపై వైద్యులు నిరసన వ్యక్తం చేయడంతో చర్చా వేదిక వేడెక్కింది. అడ్డగోలు మందులు ఇచ్చి ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్న నకిలీ వైద్యులను ప్రభుత్వం ఉపేక్షించకూడదని, వారిపై కఠిన చర్యలకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని వైద్యులు డిమాండ్ చేశారు. నకిలీ వైద్యులకు ఒక సంవత్సరం పాటు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేయాలనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కోదండరాం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ విద్యా కమిషన్ మాదిరిగా వైద్య కమిషన్, అలాగే ఆర్‌ఎంపీల, ఐఎంఏ కమిటీలు ఏర్పాటు చేసి సమస్యలకు పరిష్కారం వెతకవచ్చన్నారు. రాష్ట్రంలో దాదాపు 40 వేల మంది ఆర్‌ఎంపీలు ఉన్నారని, వారు రోగులకు ఇస్తున్న మందులు ప్రమాదకరంగా మారుతున్నాయని ఇక్కడి వైద్యులు చెబుతున్నారని, అలాంటప్పుడు ఆర్‌ఎంపీలకు సరైన శిక్షణ ఇస్తే మార్పు తీసుకురావచ్చని కోదండరాం అన్నారు.

ఎంపీ డీకే అరుణ ఇంట్లోకి ఆగంతకుడు

అరగంట పాటు ఇల్లంతా వెతికి వెనక్కి

మా ఇంటి వద్ద గట్టి భద్రత కల్పించాలి

ఘటనపై అనుమానాలున్నాయ్: అరుణ



బంజారాహిల్స్/మహబూబ్‌నగర్/హైదరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ నివాసంలోకి ఆగంతకుడు ప్రవేశించాడు. ఇల్లంతా వెతికి అరగంట తర్వాత వెళ్లిపోయాడు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 56లో నివసించే డీకే అరుణ ఈ నెల 15న మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. ఇంట్లో ఆమె కుమార్తె, మనవరాలు, పని వాళ్లు ఉన్నారు. 16న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి గోడ దూకి, వంట గది పక్కనే ఉన్న కిటికీ తొలగించి, ఇంట్లోకి వెళ్లాడు. హాల్‌లో తిరిగాడు. బెడ్‌రూంలో ఏదో వెతికాడు. అక్కడ ఉన్న సామాన్లను చిందరవందర చేశాడు. అరగంట తర్వాత వచ్చిన దారిన వెళ్లిపోయాడు. కాగా, ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాల వైరును ఆగంతకుడు కోసేశాడు. దీంతో ఇది తెలిసిన వారి పనే అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. కాగా, తన నివాసంలోకి ఆగంతకుడు చొరబడటం ఆందోళన కలిగిస్తోందని డీకే అరుణ అన్నారు. ఇళ్లంతా తిరిగి ఒక్క వస్తువును కూడా దొంగిలించలేదంటే.. ఎవరైనా తనకు ప్రాణహాని తలపెట్టాలని చూస్తున్నారేమో..? అని అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. మహబూబ్‌నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం అరుణ మీడియాతో మాట్లాడారు. రెండు రోజులుగా తాను మహబూబ్‌నగర్‌లో ఉన్నానని తెలిపారు. తన ఇంటి వద్ద గట్టి భద్రతను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తన భర్తకు గన్‌మెన్లను ఇవ్వాలని కొద్దిరోజుల క్రితమే లేఖ రాశానని తెలిపారు. కాగా, ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్.. పోలీసు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అరుణకు పూర్తి స్థాయి భద్రత కల్పించాలని కోరారు. అంతకు ముందు సంజయ్.. డీకే అరుణకు ఫోన్ చేసి మాట్లాడారు.

రేవంత్ వ్యాఖ్యలు అభ్యంతరకరం

» బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జ్ మాలవీయ

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలను నగ్నంగా చేసి ఊరేగించే హక్కు సీఎం రేవంత్‌రెడ్డికి ఏ చట్టం ఇస్తుందని బీజేపీ ఐటీ సెల్ ఇన్‌చార్జ్ అమిత్ మాలవీయ ప్రశ్నించారు. అసెంబ్లీ వేదికగా రేవంత్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని అన్నారు. తెలంగాణలో ఇటీవల చేపట్టిన కుల గణన సమాచారాన్ని విశ్లేషించడానికి ఫ్రెంచ్ ఆర్థిక వేత్త థామస్ పికెట్టీని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిందని మాలవీయ పేర్కొన్నారు. సున్నిత అంశమైన జనాభా వివరాలను విదేశీయులకు ఎలా ఇస్తారని మాలవీయ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

తిట్ల పోటీ పెడితే రేవంత్‌కే ఫస్ట్ ప్రైజ్

» ముఖ్యమంత్రిపై మాజీ మంత్రి హరీశ్ ఫైర్

» కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్



హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అందాలు పోటీలు పెడుతున్న ప్రభుత్వం.. అబద్ధాలు, తిట్ల పోటీలు కూడా పెడితే అందులో ముఖ్యమంత్రికే మొదటి బహుమతి వస్తుందని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్‌ను మార్చురీకి పంపాలని అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్.. ఆ మాటను మార్చి బీఆర్‌ఎస్ పార్టీని అన్నానని చెప్పడం హాస్యాస్పదమని హరీశ్ అన్నారు. సీఎం తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడమే కాక కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడిన తీరు చూస్తే ఆయన కాంగ్రెస్ ముసుగేసుకున్న బీజేపీ వ్యక్తిని అర్థమైందన్నారు. ప్రతిపక్ష నేత పదవి కోసం కేటీఆర్, హరీశ్ కొట్టుకుంటున్నారని సీఎం చెప్పిన మాటలను కొట్టిపారేశారు. రాష్ట్రానికి శనిలాంటి సీఎం రేవంత్‌రెడ్డిని గద్దె దించేందుకు తాను, కేటీఆర్ పోటీపడి పనిచేస్తామని చెప్పారు. జర్నలిస్టులను పట్టుకొని బట్టలూడదీసి రోడ్డుమీద కొడతామన్న రేవంత్ రెడ్డి భాష జుగుప్సాకరంగా ఉందని అన్నారు. సీఎం భాషను మార్చుకోవాలని హితవు పలికారు. సీఎంకే కాదు ఎదుటివారికి భార్యాబిడ్డలు, కుటుంబాలు ఉంటాయని, తనదాకా వస్తే కానీ సీఎంకు తెలియలేదా? అని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను కాల్చిపారేయాలని, ప్రగతిభవన్‌ను పేల్చేయాలని, అలాగే కేటీఆర్ కుమారుడిని ఉద్దేశించి అన్న మాటలను, తన(హరీశ్‌రావు) ఎత్తుపై సీఎం రేవంత్ గతంలో అన్న మాటలను ఈ సందర్భంగా గుర్తుచేసిన హరీశ్‌రావు.. అసలు నువ్వు మనిషివా..? పశువువా..? అంటూ ముఖ్యమంత్రిని నిలదీశారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలన్న కాంగ్రెస్ ఇప్పుడు రుసుము చెల్లించాలని పేదలను వేధిస్తోందని ఆరోపించారు. ఫార్మాసిటీ భూములను రైతులకు తిరిగివ్వాలని, లేదంటే ఫార్మాసిటీని నిర్మించి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగులు ప్రభుత్వాన్ని బండకేసి కొట్టారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేల కోట్ల రుణమాఫీ మాత్రమే చేసిందని హరీశ్ తెలిపారు. మధిర, కొడంగల్, సిద్దిపేట ఎక్కడైనా సరే వందశాతం రుణమాఫీ జరిగినట్టు నిరూపిస్తే ముక్కునేలకు రాస్తానని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి సవాల్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగాలివ్వలేదని అసత్యాలు చెబుతున్న రేవంత్ రెడ్డికి దమ్ముంటే.. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన ఉద్యోగాల కల్పనపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లే గ్రూప్-1, 2, 3 పోస్టుల భర్తీలో అచ్చంగా తెలంగాణ పిల్లలకు ఉద్యోగాలు వస్తున్నాయని చెప్పారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ఉద్యోగాల సంఖ్య ఆరేడు వేలకు మించదని అన్నారు. గత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్లు, నియామక ప్రక్రియను తన గొప్పగా చూపెట్టేందుకు సీఎం అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.

మేం చేసిన అప్పు 4,17,496 కోట్లు

బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వం చేసిన అప్పులు రూ.4,17,496 కోట్లు మాత్రమేనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఈ అంశంలో సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం ఆపాలని సూచించారు. 2014 జూన్ 2 నుంచి 2023 డిసెంబరు 7వరకు ప్రభుత్వం తీసుకున్న ఎఫ్‌ఆర్‌బీఎం, ప్రభుత్వ గ్యారెంటీ రుణాల వివరాలను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. 2024 మార్చి 31నాటికి మొత్తం ఎఫ్‌ఆర్‌బీఎం రుణాలు రూ.3,89,673 కోట్లు అని హరీశ్ తెలిపారు. అందులో 2014 జూన్ 2నాటికి రూ.72,658 కోట్లు ఉన్నాయని, అలాగే, 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి31 మధ్య ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోని రుణాలు రూ.15,118కోట్లు తీసుకున్నట్లు చెప్పారు. దీనిప్రకారం బీఆర్‌ఎస్ పాలనలో రూ.3,01,897కోట్లే ఎఫ్‌ఆర్‌బీఎం రుణాలుగా తీసుకున్నామని వివరించారు. అదే విధంగా 2014 జూన్2 నుంచి 2023 డిసెంబరు7 మధ్య ప్రభుత్వ గ్యారెంటీతో తీసుకున్న అప్పులు రూ.1,15,59 కోట్లు అని ఈ మొత్తం కలిపి బీఆర్‌ఎస్ హయాంలో రూ.4,17,496కోట్లు మాత్రమే అప్పు చేసినట్లు ఆయన వివరించారు. ఇక, కాంగ్రెస్ అధికారం చేపట్టాక 2023 డిసెంబరు 7 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ గ్యారెంటీతో రూ.1,27,208కోట్లు, ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలో రూ.15,118కోట్లు అప్పు చేశారన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను త్వరలోనే బయట పెడతానని హరీశ్‌రావు పేర్కొన్నారు.

నలుగురు పిల్లలని అనాథలుగా వదిలేసి
భార్యాభర్తల ఆత్మహత్య

» సిద్దిపేట జిల్లా ఎల్లారెడ్డిపేటలో ఘటన

తొగుట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సమస్యల నేపథ్యంలో తల్లిదండ్రులు తీసుకున్న తీవ్ర నిర్ణయాలు అభంశుభం తెలియని నలుగురు చిన్నారులను రోడ్డున పడేశాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల పిల్లల పోషణ భారంగా మారిందనే మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన భార్య మరణించిందనే వార్త విన్న కాసేపటికే ఆమె భర్త కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో వారి సంతానం అనాథలుగా మిగిలారు. ఈ హృదయవిదారక ఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఎల్లారెడ్డిపేటకు చెందిన కెమ్మసారం నాగరాజు (35) మొదటి భార్య కొంతకాలం క్రితం అనారోగ్యంతో మరణించింది. ఆ దంపతులకు మీనాక్షి(9), మహేష్ (7) అనే సంతానం ఉన్నారు. మొదటి భార్య మరణించడంతో నాగరాజు.. రామాయంపేటకు చెందిన భాగ్య (32)ను రెండో వివాహం చేసుకున్నాడు. వీరికి లక్ష్మి(5), శ్రావణ్(4) అనే పిల్లలు ఉన్నారు. నాగరాజు కుటుంబం స్థానికంగా ప్రభుత్వం ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో నివాసముంటోంది. కూలీపనులు చేసుకుని నాగరాజు భార్యాబిడ్డలను పోషించుకుంటున్నాడు. అయితే, ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో భాగ్య ఆదివారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో తమ ఇంట్లోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన ఇరుగుపొరుగు ఆమెను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. భాగ్య అప్పటికే చనిపోయిందని వైద్యులు చెప్పారు. అప్పటి దాకా అక్కడే ఉన్న నాగరాజు భార్య మరణవార్త విన్న వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాసేపటికి తన కుటుంబీకులకు ఫోన్ చేసి తాను కూడా పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి కట్ చేశాడు. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. నాగరాజు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులు అతడు ఉన్న లొకేషన్‌ను వెళ్లారు. సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి సమీపంలోని చెట్ల మధ్య అచేతనంగా పడి ఉన్న నాగరాజును రాత్రి ఎనిమిది గంటలప్పుడు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదు చేసిన తొగుట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, తల్లిదండ్రుల మరణంతో అనాథలుగా మారిన చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ స్వామి. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పోచయ్య, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకులు దేవరాయ ఎల్లం తదితరులు కోరారు.



అనాథలుగా మారిన చిన్నారులు





స్టేషన్‌ఘన్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు; అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

తాగుబోతోడు జాతిపితా?

(మొదటిపేజీ తరువాయి)

అబద్ధాలను విషప్రచారం చేసేటోడు తెలంగాణకు జాతిపిత ఎట్లయితడని తాటిచెట్టు లాగా పెరిగినాయన (హరీశ్‌రావు)ను అడుగుతున్నా" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.

15 నెలల్లో రూ.1.53 కోట్ల అప్పులు కట్టినం

తెలంగాణ వచ్చినప్పుడు ధనిక రాష్ట్రమని.. దాన్ని కేసీఆర్ చేతిలో పెడితే అప్పుల ఊబిలో కూరుకుపోయిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆ రోజు నెలకు రూ.500 కోట్ల అసలు, మిత్తి కట్టే అప్పుంటే.. ఈ రోజు అసలుకే ప్రతి నెలా రూ.6500 కోట్లు కడుతున్నామని చెప్పారు. మొత్తంగా రూ.8.29 లక్షల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. వీటికి అసలు, మిత్తి రూ.1.59 లక్షల కోట్లు చెల్లించాల్సి వచ్చిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.20 లక్షల కోట్ల ఆదాయాన్ని తెచ్చుకుందని, ఆ డబ్బంతా ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. 'కేసీఆర్ చేసిన అప్పులకు రూ.1.53 లక్షల కోట్లు బ్యాంకులకు అసలు, మిత్తి కట్టినం. ఈ సొమ్ము ఉండుంటే 15 నెలల్లో 30 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేవాళ్లం. రాష్ట్రంలో ఇల్లు లేని పేదలు లేకుండా చేసేవాళ్లం. 75 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసేవాళ్లం' అని రేవంత్ అన్నారు. పాపాల భైరవుడు ఫాంహౌస్‌లో రెస్ట్ తీసుకుంటూ, తన వాళ్లతో మమ్మల్ని తిట్టిస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం, అప్పులపై ఉన్నది ఉన్నట్లుగా అసెంబ్లీలో చెబుతానని, ఆ ఆదాయాన్ని ఎలా వాడాలనేదానిపై ప్రజల సూచనలు తీసుకొని ముందుకెళ్తామని చెప్పారు. కేసీఆర్ చేసిన అప్పులకు రూ.88 వేల కోట్లు అసలు, రూ.65 వేల కోట్ల మిత్తి కట్టామంటే రాష్ట్రంలో ఎంత దారుణమైన పరిస్థితి ఉందో ప్రజలు ఆలోచన చేయాలని కోరారు. ఇక అప్పులు చేయబోమన్నారు. తెలంగాణ ఆదాయాన్ని పెంచి, ప్రజలకు పంచాలనే ఆలోచనతో ఉన్నామని తెలిపారు. కేసీఆర్ పాపాల చిట్టా అసెంబ్లీలో చెప్తానని, ఇది ఇంటర్వెల్ మాత్రమేనని; 19, 20 తేదీల్లో జరిగే సమావేశాల్లో ఇంకా చెబుతానన్నారు.



సభలో సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి; చిత్రంలో మంత్రులు సీతక్క, సురేఖ, పొంగులేటి, ఎంపీ కడియం కావ్య

కేసీఆర్.. ప్రాజెక్టులపై చర్చకు రా..

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరిట రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అందులో ఒక్క కాళేశ్వరానికే రూ.1.02 లక్షల కోట్లు పెట్టిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. మూడేళ్లలోనే కాళేశ్వరం కట్టడం.. కూలడం జరిగిపోయాయని విమర్శించారు. అది కాళేశ్వం కాదని, కూలేశ్వరమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాం లో ఒక్క ప్రాజెక్టు కట్టలేదని బావాబామ్మర్దులు మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల గురించి ఈ పిల్ల కాకులకు ఏం తెలుసని ధ్వజమెత్తారు. దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలని సవాల్ చేశారు. అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఎందుకు, రూ.55 లక్షల జీతం ఎందుకని నిలదీశారు. ప్రభుత్వ టీచర్లు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు జీతం తీసుకొని విధులకు రాకుండా ఎక్కడైనా ఉంటారా? అని రేవంత్ అన్నారు. '80 వేల పుస్తకాలు చదివిన మేధావి.. జీతం తీసుకుని ఫాంహౌస్‌లో పడుకుంటారా..? అసెంబ్లీకి వచ్చి మీ అనుభవంతో ప్రజలకు ఉపయోగపడే సూచనలు ఎందుకు చేయ డం లేదు? క్యాప్సికం పండిస్తే కోట్ల ఆదాయం వస్తాయన్న కేసీఆర్.. ఆ నైపుణ్యం ఏమిటో ప్రజలకు చెప్పా లి. బయటకు రావడం ఇబ్బందైతే ఫాంహౌస్‌కే రోజూ వెయ్యి మందిని పంపిస్తాం. ఆ నైపుణ్యం ఏంటో చెప్పాలి. నిరుద్యోగులకు ఆ నైపుణ్యాన్ని నేర్పిస్తే వారు కూడా మీలాగే సంపాదించుకుంటారు' అని రేవంత్ ఎద్దేవా చేశారు.

ఇబ్బందులున్నా.. గ్యారెంటీలు అమలు చేస్తున్నాం..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా.. గ్యారెంటీలను అమలు చేస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కోట్ల మంది ఆడబిడ్డలు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణిస్తే, ప్రభుత్వం ఆర్టీసీకి రూ.5 వేల కోట్లు చెల్లించిందని చెప్పారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును 50 లక్షల కుటుంబాలకు అందిస్తున్నామని, రూ.20,610 కోట్లు రైతులకు రుణమాఫీ చేశామని వివరించారు. పది నెలల్లోనే 57,946 మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 11 వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని, గ్రూపు పరీక్షలు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించి, ఫలితాలు కూడా వెల్లడించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆదాయానికి, ఖర్చులకు పొంతన కుదరడం లేదని, అయినప్పటికీ ఇచ్చిన హామీలు అమలు చేస్తుంటే తనను తిట్టిస్తున్నారని సీఎం చెప్పారు. కొందరు దొంగలు, తేడు దొంగలు ఉన్నారని, అలాంటి వారిని వదిలిపెట్టేది లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సభలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కేఆర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని కూలగొట్టే యత్నాలు

బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.లక్ష కోట్లను దోచుకుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. దోచుకున్న డబ్బులతో ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలగొట్టాలని చూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారంటూ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కర్రుకాల్చి వాత పెట్టినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రావడం లేదన్నారు. నిజాలు బయట పడతాయనే కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, అధికారం పోయినా వాళ్ల అహంకారం తగ్గడం లేదని ధ్వజమెత్తారు. తెలంగాణలో పంటలు ఎండడానికి కారణం గత పాలకులేనన్నారు. ప్రభుత్వం హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తోందని మంత్రి కొండా సురేఖ చెప్పారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి సీతక్క ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సభ సందర్భంగా బీఆర్ఎస్ నేత తాటికొండ రాజయ్యను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.


మాకు ఉద్యోగాలు కల్పించండి

సీఎం సభలో కళాకారుల నిరసన.. కుర్చీలు ఎక్కి ఫ్లెక్సీ ప్రదర్శన

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమంలో కళాకారులుగా పనిచేసిన వారిని గత ప్రభుత్వం విస్మరించగా.. ప్రస్తుత ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చేస్తోందని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాకారులు ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్ సీఎం సభలో నిరసన వ్యక్తం చేశారు. సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో మహిళా కళాకారులు ఒక్కసారిగా కుర్చీల పైకి ఎక్కి వారి వెంట తెచ్చుకున్న 'మా ఉద్యమ, నిరుద్యోగ కళాకారులకు సారథిలో ఉద్యోగాలు కల్పించాలి' అని రాసి ఉన్న ఫ్లెక్సీని ప్రదర్శించారు. సీఎం వెంటనే స్పందించి.. 'చూశాను కూర్చోండి..' అని సూచించారు. అక్కడ ఉన్న మహిళా పోలీసులు వారిని కిందకు దింపి సభ నుంచి బయటకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో తాము కళాకారులుగా పనిచేశామని, గత ప్రభుత్వం రాష్ట్రంలో 550 మందికి తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. నిజమైన కళాకారులమైన తమలాంటి 750 మందిని విస్మరించిందన్నారు.



నిరసన తెలియజేస్తున్న కళాకారులను అడ్డుకుంటున్న పోలీసులు



ఢిల్లీ టూర్ నన్ను పూర్తిగా మార్చేసింది

సినిమాల్లోకి వెళ్లేందుకు ఈ టూర్ పనికొచ్చింది

- పార్టీ రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో ఇప్పుడు నా అవసరం లేదు
- సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధితో పాటు సినిమాపైనా దృష్టి పెడతా
- ఉగాది రోజున జగ్గారెడ్డి - ఎ వార్ ఆఫ్ లవ్ సినిమా కార్యాలయాన్ని ప్రారంభిస్తాం
- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జగ్గారెడ్డి

హైదరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన తన ఢిల్లీ టూర్.. తనను పూర్తిగా మార్చేసిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వెల్లడించారు. తాను సినిమా రంగంలోకి వెళ్లేందుకు ఈ టూర్ పనికొచ్చిందన్నారు. అయితే సినిమాకు, తన రాజకీయానికి సంబంధం లేదని తెలిపారు. తాను రాజకీయాల్లోనే ఉన్నానని, ఈ సినిమా ద్వారా రాజకీయాల్లో తాను కొత్తగా తీసుకునే అడ్వాంటేజ్ కూడా ఏమీ లేదని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో జగ్గారెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. మూడు నెలల కిందట తనను కలిసిన డైరెక్టర్ రామానుజం.. సినిమా కథను వినిపించేందుకు సమయం కోరారని చెప్పారు. 2013 నుంచి తనలాంటి వ్యక్తి కోసం చూస్తున్నానని చెప్పారని అన్నారు. తొలుత ఆ డైరెక్టర్‌కు తాను సమయం ఇవ్వలేననుకున్నానని, అయితే ఆ తర్వాత ఆయన చూపించిన ఫొటోను చూశాక ఆ సినిమాకు కనెక్ట్ అయ్యానని వెల్లడించారు. జగ్గారెడ్డి.. ఎ వార్ ఆఫ్ లవ్ సినిమాను కచ్చితంగా చేయాలని నిర్ణయం తీసుకున్నానని చెప్పారు. ఎ వార్ ఆఫ్ లవ్ క్యాప్షన్‌ను డైరెక్టర్ ముందే రాసుకున్నారని, అయితే ఈ సినిమాలోని తన పాత్రకు, ప్రేమకు సంబంధం లేదన్నారు. డైరెక్టర్ తనకు కథను వినిపించే క్రమంలో.. తన జీవితంలో జరిగిన కొన్ని విషయాలను ఆయనకు చెప్పానన్నారు. విద్యార్థి నాయకుడిగా జీవితాన్ని మొదలు పెట్టిన తాను.. కౌన్సిలర్ అయిన తీరు.. ఆ తర్వాత మునిసిపల్ చైర్మన్‌గా ఎన్నికైన విధానాన్ని ఈ సినిమాలో చూపించనున్నట్లు పేర్కొన్నారు. లవ్, ప్యాక్షన్, ఎమోషనల్, పొలిటికల్ డ్రామాగా ఈ సినిమా ఉం టుందని చెప్పుకొచ్చారు. సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఈ సినిమాపైనా దృష్టి పెడతానని జగ్గారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో ఉంది కా బట్టి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి సంగారెడ్డికి ఎక్కువ నిధులు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తానని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో పార్టీకి ఇప్పుడు తన అవసరంలేదన్నారు. సినిమాకు సంబంధించిన కార్యాలయాన్ని ఈ ఉగాదికి ప్రారంభించనున్నట్లు తెలిపారు. సంగారెడ్డికి చెందిన మొగిలయ్య 18 ఏళ్ల కిందట రాసిన పాటను నెల రోజుల్లో విడుదల చేస్తామని జగ్గారెడ్డి వెల్లడించారు.

మీకు.. కేసీఆర్‌కు తేడా ఏంటి?

- అప్పులు, అసభ్య పదజాలంలో ఎవరు తక్కువ
- హామీల అమలెప్పుడో బడ్జెట్ సమావేశాల్లో చెప్పండి
- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాళ్లు



హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అప్పులు చేయడం, అవినీతికి పాల్పడటం, అసభ్యంగా మాట్లాడటంలో మాజీ సీఎం కేసీఆర్ కంటే ఏమీ తక్కువ తినలేదన్నట్లుగా సీఎం రేవంత్ వ్యవహరిస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ప్రజాపాలన అంటే అప్పుల పాలననా..? అని నిలదీశారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కట్టలేకపోతున్నానని అంటూనే.. 15 నెలల్లో రూ.లక్షా 52వేల కోట్ల అప్పు చేశారంటే కేసీఆర్‌కు, మీకు ఉన్న తేడా ఏంటి..? అని రేవంత్‌ను ప్రశ్నించారు. "మీరు సీఎం అయ్యాక తెలంగాణకు ఏం ఒరిగింది..? ఏం మార్పు వచ్చింది..? ఇసుక వ్యాపారంలోనా..? లిక్కర్ దోపిడీలోనా..? బెల్ట్‌షాపులు పెంచడంలోనా..? భూముల అమ్మకాల్లోనా..? అప్పులు చేయడంలోనా..? అహంకారపూరిత మాటల్లోనా..?" అంటూ విరుచుకుపడ్డారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గ్యారెంటీలు, హామీలపై బడ్జెట్ సమావేశాల్లో స్పష్టత ఇవ్వాలని.. వాటిని ఎప్పటిలోగా అమలు చేస్తారో, కార్యాచరణ ఏంటో చెప్పాలని రేవంత్‌ను డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ పుణ్యమా అని శాసనసభలో భాష మారిందని విమర్శించారు. కేసీఆర్ భాషను రేవంత్ కొనసాగిస్తూ, డొక్క చీరుస్తా, తొక్కి పడేస్తా, అంతు చూస్తా అంటూ కొత్త భాషకు తెరలేపారని అన్నారు. జాతీయ విద్యా విధానం, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్, డీఎంకేలు దివాళాకోరుతనంతో వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ఆర్‌బీఐ కరెన్సీ తమిళనాడులో చెల్లుబాటు అవుతుందా..? లేదా..? రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో ప్రధాని మోదీని, హిందీ భాషను బూచిగా చూపించి కాంగ్రెస్, డీఎంకేలు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. తమిళనాడు లిక్కర్ స్కాంలో డీఎంకే నాయకుల పాత్ర ఉందని కిషన్‌రెడ్డి ఆరోపించారు. డీఎంకే పాలన, స్టాలిన్ కుటుంబ అవినీతి, దోపిడీ, నియంతృత్వ ధోరణిపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత నుంచి తప్పించుకోవడానికి రాజకీయ నాటకాలు ఆడేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలపై పార్టీలో చర్చిస్తామని కిషన్‌రెడ్డి చెప్పారు.

కాంగ్రెస్‌వి ముస్లిం బుజ్జగింపు రాజకీయాలు

న్యూఢిల్లీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ముస్లింలకు ప్రభుత్వ టెండర్లలో 4శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇది కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు ఉదాహరణ అని తెలిపారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల ఉద్యోగాలు.. హక్కులను కర్ణాటక ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ తదుపరి లక్ష్యం తెలంగాణ కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

తెలుగు విశ్వ విద్యాలయానికి

పొట్టి శ్రీరాములు పేరు కొనసాగించాలి

- ఎన్టీఆర్, కేబీఆర్, సంజీవరెడ్డి పేర్లను తీసే దమ్ముందా: సంజయ్



కరీంనగర్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/సిరిసిల్ల మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం సరికాదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. దేశ భక్తుడు, గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు, ఆర్యవైశ్యుల ఆరాధ్య నేత అయిన గొప్ప వ్యక్తి పేరును తొలగించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ.. సీపీ ఐ నాయకులు ప్రతిపాదిస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి కులాభిమానంతో పొట్టి శ్రీరాములు పేరును తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టారని తెలిపారు. ఆంధ్రా మూలాలు ఉన్నాయని పొట్టి శ్రీరాములు పేరును తొలగించారని.. ఎన్టీఆర్, కాసు బ్రహ్మానందరెడ్డి, నీలం సంజీవరెడ్డి పేరిట ఉన్న పార్కుల పేర్లను తొలగించే దమ్ముందా..? అని ప్రశ్నించారు. ట్యాంక్ బండ్‌పై ఉన్న అనేక మంది ఆంధ్రుల విగ్రహాలను కూడా తొలగిస్తారా..? అని నిలదీశారు. తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని.. ఆర్యవైశ్యులు, దేశభక్తులకు సీఎం క్షమాపణ చెప్పాలని సంజయ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు రాష్ట్రాన్ని శ్రీలంకలా మారుస్తోందని సంజయ్ విమర్శించారు. 15 నెలల్లోనే ప్రభుత్వం రూ.లక్షన్నర కోట్ల అప్పు చేసిందని.. రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం మోపబోతోందని ధ్వజమెత్తారు. ఆదివారం సిరిసిల్లలోని మున్నూరు కాపు ఫంక్షన్ హాల్‌లో జరిగిన జిల్లా బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో సంజయ్ మాట్లాడారు. ఒక వర్గాన్ని సంతృప్తి పరచడం కోసం తబ్లీగీ జమాత్ వంటి సమావేశాలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. అటువంటి కార్యక్రమాలతో ప్రభుత్వ ప్రతిష్ఠ పెరగదని.. ఆరు గ్యారెంటీలు సహా హామీలన్నీ నెరవేరిస్తేనే సర్కారు గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. కులగణన పేరుతో సేకరించిన సమాచారాన్ని అర్బన్ నక్సల్స్ చేతిలో పెట్టారని.. అలా చేస్తే ప్రజల ఆస్తులు భద్రంగా ఉంటాయా..? దోపిడీకి గురవుతాయా..? ఆలోచించాలన్నారు. ఇప్పటికే విద్యా కమిషన్ పేరుతో అర్బన్ నక్సల్స్ చేతిలో విద్యా వ్యవస్థను పెట్టి, హింసను సృష్టించి, తుపాకీ రాజ్యం చేయాలనుకుంటున్నారని.. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సంజయ్ అన్నారు.

గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారు: ఏలేటి

రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. నిర్మల్ జిల్లాలో ఏ గ్రామంలోనైనా సంపూర్ణంగా రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేసీఆర్ ప్రభుత్వంపై ఆరోపణలు చేసిన రేవంత్.. చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. ఆదివారం బీజేఎల్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఉత్తుత్తి ఫైట్ చేస్తున్నాయన్నారు. కేటీఆర్ దుబాయ్‌లో ఏం చేశారో రికార్డులు ఉన్నాయంటున్న సీఎం రేవంత్.. వాటిని బయటపెట్టి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు.

మూసీ ప్రక్షాళన పూర్తి చేస్తాం

- గోదావరి జలాలు అందిస్తాం: మంత్రి తుమ్మల
- 2026 జనగణన అనంతరం ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతాం: మంత్రి ఉత్తమ్



తుంగతుర్తిలో కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల; చిత్రంలో మంత్రి ఉత్తమ్

మోత్కూరు/తుంగతుర్తి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మూసీ ప్రక్షాళన పూర్తి చేసి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అప్పులు, ఆర్థిక భారం ఉన్నప్పటికీ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణతో పాటు కులగణన చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆదివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే మందుల సామేలు ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. సభలో తుమ్మల మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ 2026లో జనాభా గణన అనంతరం పెరిగిన ఎస్సీ జనాభాను అనుసరించి రిజర్వేషన్లను 17.5 లేదా 18 శాతానికి పెంచుతామని తెలిపారు. కొత్త రేషన్ కార్డులు ఇస్తామని, వచ్చే నెల నుంచి సన్నబియ్యం ఇస్తామని తెలిపారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-2లో కాల్వల పొడిగింపు, మరమ్మతులు పూర్తి చేసి గోదావరి జలాలు అందిస్తామని ఆయన తెలిపారు.

అభివృద్ధి పథకాలను అడ్డుకుంటే సహించం

- విద్య, వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం: మంత్రి పొంగులేటి

ఇల్లెందు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పేదవాడి కష్టాలను గత ప్రభుత్వం విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుకుంటే సహించబోమని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం పూబెల్లి గ్రామంలో ఆదివారం 83 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఇల్లెందు పట్టణంలో రూ.37 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో ఇల్లెందు నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు నిర్మించనున్న వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల కలలను సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్లను ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున మొదట విడతగా ఇచ్చిందన్నారు. ఇల్లెందు నియోజకవర్గంలోని పూబెల్లిలో 83 ఇళ్లను నిర్మిస్తున్నామని చెప్పారు.

రూ.1,000 కోట్లతో ఏఎమ్మార్పీ కాల్వల మరమ్మతులు: మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రూ.1000 కోట్లతో ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వల డిస్ట్రిబ్యూటరీ లైనింగ్, మరమ్మతుల పనులు చేపట్టనున్నట్లు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా నల్లగొండ నియోజకవర్గంలోని పలు చెరువులను పరిశీలించిన మంత్రి సాగునీటి పరిస్థితిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాన కాల్వ లైనింగ్ పనులు చేపట్టేందుకు రూ.850 కోట్లు, మరో రూ.350కోట్లతో డిస్ట్రిబ్యూటరీ మరమ్మతులకు టెండర్లను పిలవనున్నట్లు తెలిపారు. ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ఆయకట్టు సుమారు 2 లక్షల 20వేల ఎకరాలకు స్థిరీకరించగా ఇప్పటివరకు 2 లక్షల 15 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పంట పొలాలు కోత దశలో ఉన్నందున సాగునీటిని అందిస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

బోగస్ విత్తన కంపెనీలపై కఠిన చర్యలు: అన్వేష్

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): "సీడ్ బౌల్ ఆఫ్ తెలంగాణగా పేరుగాంచిన రాష్ట్రంలో బోగస్ విత్తనోత్పత్తి కంపెనీలు రాజ్యమేలుతున్నాయి. అలాంటి కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటాం" అని విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని హాకా భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొన్ని విత్తన కంపెనీలు, ఏజెంట్లు రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ములుగు జిల్లాలో పర్యటించినప్పుడు వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో అనేక మల్టీ నేషనల్ కంపెనీలు నకిలీ విత్తనాలు సరఫరా చేసి రైతులను నట్టేట ముంచాయన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. విత్తన కంపెనీల మోసాలపై సమగ్ర వివరాలతో కూడిన నివేదికను త్వరలో సీఎంకు అందజేయనున్నట్లు తెలిపారు.

బూతు పురాణానికి పేటెంట్ కేసీఆర్‌దే..

- పదేళ్లలో ఆయన తిట్లతో పుస్తకమే రాయొచ్చు: చామల
- బూతులకు బ్రాండ్ అంబాసిడర్.. కేసీఆరే: బీర్ల

హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బూతు పురాణానికి పేటెంట్ అంటూ ఉంటే అది మాజీ సీఎం కేసీఆర్‌దేనని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. హరీశ్‌రావుకు.. కేసీఆర్ మాటలు నీతుల్లా, ఎదుటివారి మాటలు బూతుల్లా కనిపిస్తున్నాయా.. అని ప్రశ్నించారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ బూతు మాటలు, తిట్లతో ఒక పుస్తకమే రాయొచ్చని ఆదివారం ఓ ప్రకటనలో ఎద్దేవా చేశారు. బూతులకు బ్రాండ్ అంబాసిడర్ కేసీఆర్ అని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ధ్వజమెత్తారు. కేంద్రమంత్రిని అసభ్య పదజాలంతో దూషించిన చరిత్ర ఆయనదేనని ఓ ప్రకటనలో విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇతర పార్టీల నేతలను కేసీఆర్ ఎలా దూషించారో అందరికీ తెలుసన్నారు. ఆయన దూషణలు హరీశ్‌రావుకు వినసొంపుగా ఉన్నాయా అంటూ నిలదీశారు.

సీఎంను కలిసిన గిరిజన వర్సిటీ వీసీ శ్రీనివాస్



హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క-సారక్క గిరిజన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్‌గా ఇటీవల నియమితులైన వైఎల్ శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎంతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

దస్తగిరిని ముక్కలు ముక్కలుగా నరికేస్తాం..

- అప్రూవర్ దస్తగిరి భార్య షబానాకు బెదిరింపు

పులివెందుల, మార్చి 16(ఆంధ్రజ్యోతి): "మరో ఏడాదిలో దస్తగిరిని ముక్కలు ముక్కలుగా నరికేస్తాం. దస్తగిరి ఏమైనా సాధించాడా హారతులు పడుతున్నావు" అంటూ వైసీపీ కార్యకర్తలైన ఇరువురు మహిళలు ఖుల్సుం, పర్వీన్‌లు తీవ్రస్థాయిలో బెదిరించారని వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి భార్య షబానా వెల్లడించారు. ఈ ఇద్దరు మహిళలు తనపై దాడి చేసినట్టు చెప్పారు. ఆదివారం రాత్రి ఏపీలోని పులివెందులలో ఆమె మీడియాతో మాట్లాడారు. తన తండ్రికి ఆరోగ్యం బాగా లేకపోవడంతో పులివెందుల ఆస్పత్రిలో చికిత్స చేయించినట్టు తెలిపారు. అనంతరం శనివారం రాత్రి తొండూరు మండలంలోని మల్లేల గ్రామానికి తీసుకెళ్లామన్నారు. అక్కడ తన బంధువుల ఇంటి వద్దకు పలకరించేందుకు వెళ్లగా ఖుల్సుం, పర్వీన్‌లు తన బంధువుల ఇంట్లోకి చొరబడి తనపై దాడి చేశారని తెలిపారు. ఇంతలో దస్తగిరి అక్కడికి రావడంతో అయనను కూడా తిడుతూ సవాల్ విసిరారన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె చెప్పారు.

ఫ్యాటీ లివర్‌ను తేలిగ్గా తీసుకోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. దీంతోపాటు.. ప్రజల్లో పెరుగుతున్న ప్రాసెస్డ్ ఆహార వినియోగం గురించి, జన్యుక్రమం ఆధారంగా చికిత్సలు, అవయవ దానానికి బదులుగా సెల్ డొనేషన్, వైద్య పరిశోధనలు విస్తృతంగా పెరగాల్సిన అవసరం.. తదితర అంశాలపై ఆయన సవివరంగా మాట్లాడారు. అందులో కొన్ని ముఖ్యాంశాలు..



ఫ్యాటీ లివర్ కేసులు ఎలా పెరుగుతున్నాయి

మనకి స్వాతంత్య్రం వచ్చిన కొత్తల్లో దేశంలో 10% మందిలో ఈ సమస్య ఉండేది. అదిప్పుడు 40 శాతానికి చేరింది. చివరికి బడికెళ్లే పిల్లల్లో సైతం మేం పరీక్షలు చేయిస్తే.. 40% మందికి ఆ సమస్య ఉన్నట్టు తేలింది. మొదటి రెండు దశల్లో ఉన్నప్పుడు దీన్ని గుర్తిస్తే.. కొన్ని ఔషధాలు, జీవనశైలి మార్పులతో రివర్స్ చేయగలం. మూడో దశలో గుర్తిస్తే.. రివర్స్ చేయలేం. దాని తీవ్రతను మాత్రమే తగ్గించగలం. ఫ్యాటీ లివర్‌ను గుర్తించి సరైన చికిత్స చేయించుకోకపోతే.. దాని ప్రభావం గుండె, మూత్రపిండాలపైన కూడా పడుతుంది. రక్తపోటు పెరుగుతుంది. ఉదాహరణకు.. గుండెపోటుతో వచ్చే చాలామందికి వైద్యపరీక్షల్లో ఫ్యాటీలివర్ కూడా ఉన్నట్టు తేలుతుంది. ఆ విషయం చెప్తే.. 'అవును సార్, పదేళ్ల నుంచి నాకు ఈ సమస్య ఉంది' అని అప్పుడు చెప్తారు. వారు ఆ సమస్యను పట్టించుకోకపోవడం వల్ల దాని ప్రభావం గుండెపై పడిందన్న విషయం వారికి అప్పుడు తెలుస్తుంది. కాబట్టి, ఫ్యాటీ లివర్ అంత ప్రమాదకరం కాదులే అనే దృక్పథాన్ని మార్చుకోవాలి.

కారణం ఏమిటి? ఎలా గుర్తించాలి?

ఇటీవల పెరిగిన జంక్ ఫుడ్ వినియోగం.. దానికి తోడు సరైన వ్యాయామం లేకపోవడం ఫ్యాటీ లివర్ సమస్యను మరింత పెంచుతోంది. దురదృష్టవశాత్తు కొంతమందిలో జన్యుపరంగానూ ఈ సమస్య వచ్చే ప్రమాదం ఉంది. ఫ్యాటీ లివర్ ఉన్నదీ లేనిదీ తెలుసుకోవడం ఖర్చుతో కూడుకున్న పని. స్కానింగ్‌లు చేయాల్సి వస్తుంది. కానీ మేం కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా.. ఫ్యా టీలివర్ డయాగ్నోసిస్‌ను సులభతరం చేశాం. నాలుగు సాధారణ రక్త పరీక్షలు (సీబీపీ, లివర్ ఫంక్షన్ టెస్ట్, లిపిడ్ ప్రొఫైల్, ప్లేట్‌లెట్స్) చేసి వాటిలో వచ్చే ఫలితాలను ఏఐ ద్వారా విశ్లేషించి ఫ్యాటీ లివర్ ఉందీ లేనిదీ తెలుసుకునే ప్రక్రియను రూపొందించాం. ఇప్పటికే 10 వేల మందిపై దీన్ని పరీక్షించాం. ఈ పరిశోధన ఫలితాల్ని.. ఏఐ టూల్‌ను త్వరలో అందరికి అందుబాటులోకి తీసుకొస్తాం. దీంతో.. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఫ్యాటీ లివర్‌ను తేలిగ్గా గుర్తించే వీలు కలుగుతుంది.

ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి?

ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాసెస్డ్ ఆహారం అస్సలు తీసుకోకూడదు. కూల్ డ్రింక్స్ తాగకూడదు. రోజుకు గంట వ్యాయామం చేయాలి. ప్రజల్లో చాలామందికి ఇవన్నీ తెలుసు. అయినా చేయరు. నా దగ్గరకు వచ్చే వారిలో చాలా మంది తాము చాలా బిజీ అంటారు. వాళ్లను నేను అడిగేది ఒక్కటే ప్రశ్న.. 'మీరు నా కంటే బిజీనా?' అని. నేను ఉదయం ఆరున్నర గంటలకు ఆస్పత్రికి వస్తాను. రాత్రి పదకొండున్నర వరకూ పని చేస్తాను. పదకొండున్నర నుంచి పన్నెండున్నర వరకూ గంట పాటు వ్యాయామం చేస్తాను.

జన్యుపరీక్షల ద్వారా ముందే తెలుసుకోవచ్చా?

శరీరంలో జన్యువుల పరిస్థితిని పరీక్షించడానికి.. మా దగ్గర లైఫ్ స్టైల్ క్లినిక్ ప్రారంభించాం. అక్కడ జన్యుపరీక్షలు జరిపి రోగి మొత్తం జన్యుక్రమం పరిస్థితిని అంచనా వేస్తాం. తద్వారా సదరు వ్యక్తికి పదేళ్ల తర్వాత క్యాన్సర్ వస్తుందా? బీపీ, ఫ్యాటీ లివర్ వస్తుందా? చివరకు ఏ వయసులో బట్టతల వస్తుందన్న వివరాలు కూడా చెప్పొచ్చు. ఈ పరీక్షకు రూ.30 వేలు ఖర్చు అవుతుంది. శరీరంలో జన్యువులు శాశ్వతం కాబట్టి.. ఈ పరీక్షను జీవితంలో ఒక్కసారి చేయించుకుంటే సరిపోతుంది. దీంతోపాటు, ఫార్మకోజీనోమిక్స్ మీదా మేం దృష్టి కేంద్రీకరించాం. రోగుల శరీర తత్వం ఆధారంగా వారికి ఏ మందు బాగా పనిచేస్తుందో తెలుసుకుని ఆ మందులు ఇచ్చే పద్ధతి ఇది. ఉదాహరణకు.. ఒకే రోగానికి వాడే ట్యాబ్లెట్ ఒకరికి రోజుకు ఒకటి వేసుకుంటే సరిపోతుంది. మరికొందరికి రెండు రోజులకు ఒకటి వేసుకోవాల్సి రావచ్చు. ఏ జన్యువు ఏ ఔషధానికి ఎలా స్పందిస్తుందన్నది ఫార్మకోజీనోమిక్స్ ద్వారా తెలుస్తుంది. అందుకే నా దగ్గరకు వచ్చే వారికి మందులు రాయబోయే ముందు.. వారిని ఈ పరీక్ష చేయించుకోమని చెబుతాను. దీనికి రూ.5 వేల దాకా అవుతుంది. దీన్ని కూడా జీవితంలో ఒక సారి చేసుకుంటే సరిపోతుంది. మనదేశంలో ఈ పరీక్ష మా దగ్గర మాత్రమే అందుబాటులో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఐదారు ఆస్పత్రుల్లోనే ఇలా చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆరోగ్యంలో గట్ బ్యాక్టీరియా పాత్ర ఏమిటి?

బ్యాక్టీరియా మన శరీరాన్ని నియంత్రిస్తుంది. అందునా గట్ బ్యాక్టీరియా మన ఆరోగ్యంలో కీలక భూమిక పోషిస్తుంది. మనం తినే ఆహారాన్ని కడుపులో ఉండే సూక్ష్మజీవులు వాడుకుని.. కొన్ని రసాయనాలను ఉత్పత్తి చేస్తాయి. ఆ రసాయనాలు మన ఆరోగ్యంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అందుకే మా దగ్గర నాలుగేళ్లుగా బ్యాక్టీరియాకు సంబంధించిన జీనోమికల్ అనాలసిస్ చేస్తున్నాం. దీంతో ఒక్కొక్కరి శరీరంలో ఉన్న బ్యాక్టీరియా ఆధారంగా వారు ఏ ఆహారం తింటే మంచిది? ఎలాంటి ఆహారం తినకూడదు? అనే విషయాన్ని చెప్పగలం. కొందరిలో వారు తీసుకునే ఆహారమే వారిలో కుంగుబాటుకూ కారణమవుతుంది!

ఏఐజీలో చేస్తున్న ఇతర పరిశోధనలేమిటి?

ఆస్ట్రేలియాకు చెందిన శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత.. బ్యారీ మార్షల్ పేరిట ప్రత్యేకంగా ఒక ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. అందులో అనేక పరిశోధనలు చేస్తున్నాం. మరో రెండు నెలల్లో మేం బ్యాక్టీరియా పర్సనలైజ్డ్ మెడిసిన్‌ను అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. దీని ద్వారా.. బాధితుల పేగుల్లో ఏ బ్యాక్టీరియా తక్కువ ఉందో గమనించి దానికి తగ్గ క్యాప్సూల్స్ వేస్తాం. ఈ క్యాప్సూల్స్‌ను 'స్టూల్ (మలం)' నుంచి సేకరించి తయారు చేస్తారు. ఉదాహరణకు కొంతమంది ఎంత తిన్నా సన్నగా ఉంటారు. అలా సన్నగా ఉన్న వ్యక్తికి సంబంధించి స్టూల్‌ను క్యాప్సూల్స్ రూపంలో తీసుకుని లావుగా ఉన్న వారికి ఇస్తే సన్నగా అవుతారు. వారానికి ఒకసారి చొప్పున ఏడాది పాటు వేసుకుంటే వారు సులువుగా సన్నబడే అవకాశం ఉంటుంది. అమెరికాలో అల్సరేటివ్ కొలైటిస్ సమస్యతో బాధపడుతున్న ఒక మహిళకు.. ఆరోగ్యవంతుడైన దాత నుంచి స్టూల్స్ సేకరించి క్యాప్సూల్ రూపంలో ఇస్తే ఆ సమస్య తగ్గింది. కానీ, సన్నగా ఉండే ఆమె లావుగా అయ్యింది. ఆ ఘటన ఆధారంగా దీనిపై పరిశోధనలు చేస్తున్నారు. అయితే, మలాన్ని క్యాప్సూల్ రూపంలో ఇస్తామంటే ఎవరూ అంగీకరించరు కాబట్టి.. పొడి రూపంలోకి మార్చి ఇస్తున్నాం. వాటిని 'క్రాప్సూల్స్' అంటారు. ఇప్పుడున్న చాలా మందులకు బదులుగా భవిష్యత్తులో ఇవే వస్తాయి. బీపీకి ఒక క్రాప్సూల్.. షుగర్‌కి ఒకటి.. ఇలా వస్తాయి. మధుమేహానికి సంబంధించి ఒక బ్యాక్టీరియాను (అకర్‌మెన్సియా మ్యూసినోఫిలా) ఇప్పటికే కనుగొన్నారు. ఆ బ్యాక్టీరియా ఇస్తే.. ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, మధుమేహం వంటివి తగ్గిపోతాయి.

అవయవ దానం నిబంధనల్ని మార్చాలా..?

పదేళ్ల క్రితంతో పోలిస్తే తెలంగాణ, తమిళనాడులో అవయవదానం పెరిగింది. మన రాష్ట్రంలో జీవన్‌దాన్ ద్వారా బాగా చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తక్కువగా ఉంది. ఇందులోని సమస్య ఏంటంటే.. అవయవాలను బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా ఉన్నాయి. బ్రెయిన్ డెడ్ అయినవారి కుటుంబాల భావోద్వేగాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొందరు ఈ నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్నారు. అలాంటి వారి విషయంలో జాగ్రత్తలు అవసరం. అలా గే దీనిపై దేశమంతా ఒకే విధానం లేదు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పద్ధతి. ఢిల్లీ, పశ్చిమబెంగాల్ లో కుటుంబ సభ్యులతో పాటు బంధువుల నుంచి తీసుకోవచ్చు. మన రాష్ట్రంలో మాత్రం కుటుంబ సభ్యుల (భార్య, భర్త, కూతురు, కొడుకు) నుంచి మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. అలా అని నిబంధనల్ని సరళతరం చేస్తే దుర్వినియోగం చేసే ప్రమాదం ఉంది.

అవయవదానం భవిష్యత్‌లో ఎలా ఉండనుంది?

రానున్న రోజుల్లో అవయవదానం కంటే సెల్ డొనేషన్ ఎక్కువ కానుంది. మన శరీరంలో బోన్ మ్యారో నుంచే అన్ని కణాలూ వస్తాయి. కాలేయంగానీ, గుండెగానీ.. అన్నీ దాన్నుంచే వస్తాయి. బోన్ మ్యారో నుంచి ప్రైమరీ సెల్స్‌ను తీసుకొని వాటిని ల్యాబ్‌లో కాలేయంగా, మూత్రపిండంగా మార్చవచ్చు. అందుకే మేం దీనికి సంబంధించి ఒక స్టెమ్‌సెల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. అక్కడ మేం ఇప్పటికే బోన్‌మ్యారో కణాలను కాలేయకణాలుగా మార్చి 50 మంది పేషెంట్లకు కాలేయ మార్పిడి అవసరం లేకుండా చికిత్స చేశాం. భవిష్యత్తులో ఈ విధానం గొప్పగా అభివృద్ధి చెందనుంది. లివర్ సిర్రోసిస్, హృద్రోగాలు, మధుమేహం.. అన్నింటికీ ఈ విధానంలో చికిత్స చేయొచ్చు. అలాగే.. జన్యుమార్పిడి చేసిన జంతువుల అవయవాలను కూడా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా మార్పిడి చేసే దిశగా పరిశోధనలు చేస్తున్నారు. ఇలా సెల్‌డొనేషన్, జన్యుమార్పిడి జంతువుల అవయవాలు అందుబాటులోకి వస్తే భవిష్యత్తులో అవయవ మార్పిడి పెద్ద సమస్య కాబోదు.

మంచి అలవాట్లు

ఆరోగ్య కరమైన ఆహారం తినడం, రోజూ వ్యాయామం చేయడం, ప్రాసెస్డ్ ఆహారానికి, ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండడం, ఆరోగ్యానికి మేలు చేసే అలవాట్లు. పండ్ల రసాలు తాగడం కన్నా.. పండ్లు తినడం మంచిది. అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్‌ను నిరుత్సాహపరిచే విషయంలో ప్రభుత్వాలు సెలెబ్రిటీల సహాయం కూడా తీసుకోవాలి. సినీనటులు చెప్తే ప్రజలు విని పాటించే ప్రయత్నం చేస్తారు.

రైస్‌బ్రాన్ ఆయిల్.. ఆలివ్ నూనెతో సమానం

అసలు మన ఆహారంలో నూనెల వినియోగం తగ్గించాలి. అన్ని నూనెల్లోకీ రైస్‌బ్రాన్ ఆయిల్ ఉత్తమం. దాన్ని తయారుచేసింది మన హైదరాబాద్ ఐఐసీటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)నే అనే విషయం చాలా మందికి తెలియదు. శాచురేటెడ్ ఆయిల్స్ (సంతృప్త నూనెలు-కొబ్బరి నూనె, పామాయిల్ వంటివి) మంచివి కావు. రైస్‌బ్రాన్ ఆయిల్ ఆలివ్ ఆయిల్‌తో సమానం.

బీమా ప్రీమియం భారంగా మారడంపై..?

ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్య. ఈ సందర్భంగా అమెరికాలో తీసుకొచ్చిన ఒబామా కేర్ గురించి చెప్పాలి. బీమా సంస్థలతో ఒబామా ఎంతో పోరాటం చేశారు. ప్రీమియంలకు పరిమితులు పెట్టారు. ట్రంప్ వచ్చిన తర్వాత కూడా దాన్ని మార్చలేదు. అలాంటి విధానం మన దేశంలోనూ తీసుకురావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించాలి. ప్రివెంటివ్ కేర్‌ను కూడా బీమా పరిధిలోకి తీసుకురావాలి. వినియోగదారుల వైద్యపరీక్షలకు అయ్యే మొత్తాన్ని బీమా సంస్థలు భరించేలా చర్యలు తీసుకోవాలి.

వైద్య పరిశోధన రంగంలో మనం ఫోకస్ చేయాల్సిన అంశాలేంటి?

ఇంజనీర్లు.. వైద్యులు కలిసి పని చేస్తే వైద్యరంగంలో అద్భుతాలు సాధించొచ్చు. మనం పెద్దగా పట్టించుకోని ఈ అంశానికి చైనా, అమెరికా బాగా ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ క్రమంలోనే మేం ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి ఆరు ప్రాజెక్టులపై పనిచేస్తున్నాం. ట్రిపుల్ ఐటీ, బెంగళూరులతో కలిసి కొత్త ఔషధాలు, యంత్రాల తయారీపై పరిశోధనలు చేస్తున్నాం. ఇలా మేం అభివృద్ధి చేసిన ఒక హై ఫ్రీక్వెన్సీ అల్ట్రాసౌండ్ పరికరంతో.. సర్జరీ అవసరం లేకుండానే లివర్ క్యాన్సర్ కణాలను నాశనం చేయవచ్చు.

బిజీగా ఉంటూ పరిశోధనలెలా చేస్తున్నారు?

మా నాన్నగారు పాథాలజిస్టు. ఆయన పరిశోధనలకు చాలా ప్రాధాన్యం ఇచ్చేవారు. నేను బాగా ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఒక రోజు పిలిచి.. "నువ్వో పెద్ద ఫెయిల్యూర్" అన్నారు అకస్మాత్తుగా. అప్పటికే దేశంలో పేరున్న గ్యాస్ట్రో ఎంటరాలజిస్టుల్లో ఒకడినైన నన్ను అలా ఎలా అంటారని అడిగితే.. "నువ్వు పరిశోధనలు చేస్తున్నావా? నీవి ఎన్ని రిసెర్చ్ పేపర్లు పబ్లిష్ అయ్యాయి?" అని అడిగారు. 35 ఏళ్ల క్రితం జరిగిందిది. అప్పటికే మా నాన్నగారి పరిశోధనలకు సంబంధించి నాలుగు వందల రిసెర్చ్ పేపర్లు పబ్లిష్ అయ్యాయి. ఆయన అలా అడిగాక నాలో ఆలోచన మొదలైంది. అప్పటి నుంచి పరిశోధనల మీద ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాను. నావి ఇప్పటికి 1100 పరిశోధన పత్రాలు ప్రచురితమయ్యాయి. దేశంలోనే అత్యధికం ఇది. భవిష్యత్ తరాలకు నా వంతుగా చేయాల్సింది చేస్తున్నా.

బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దు

- ప్రమోట్ చేసే ఇన్‌ఫ్లూయెన్సర్లను అన్‌ఫాలో చేయండి
- అమాయకులు బలైపోతుంటే పశ్చాత్తాపం లేదు
- యూట్యూబర్ హర్షసాయిపై మండిపడ్డ సజ్జనార్

హైదరాబాద్ సిటీ, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'చేస్తున్నదే తప్పు.. అదేదో సంఘసేవ చేస్తున్నట్టు ఎంతో గొప్పగా చెప్పుకుంటున్నాడు. తాను బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయకుంటే ఎవరో ఒకరు చేస్తారని ఈయన చేస్తున్నాడట.. బుద్ధుందా అసలు?'.. అంటూ తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్.. యూట్యూబర్ హర్షసాయిపై మండిపడ్డారు. 'ఎంతో మంది అమాయకుల ప్రాణాలు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలైపోతుంటే కనీసం పశ్చాత్తాపం లేదు. వీళ్లకు డబ్బే ముఖ్యం. డబ్బే సర్వస్వం. ఎవరు ఎక్కడ పోయినా, సమాజం, బంధాలు, బంధుత్వాలు చిన్నాభిన్నమైనా సంబంధం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన హర్షసాయి వీడియోను సజ్జనార్ ఎక్స్‌లో పోస్టు చేస్తూ పై విధంగా స్పందించారు. 'ఈయనకు రూ.100 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు ఆఫర్ చేశారట. అంతగనం డబ్బు ఎక్కడి నుంచి వస్తుందో ఆలోచించండి. మీ ఫాలోయింగ్‌ని మార్కెట్‌లో పెట్టి కోట్లకు కోట్లు సంపాదిస్తున్న ఇలాంటి వాళ్లనా.. మీరు ఫాలో అవుతోంది.. ఒక్కసారి ఆలోచించండి. వెంటనే ఈ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే ఇన్‌ఫ్లూయెన్సర్స్‌ను అన్‌ఫాలో చేయండి. వారి అకౌంట్లను రిపోర్ట్ కొట్టండి. ఆన్‌లైన్ బెట్టింగ్ భూతాన్ని అంతమొందించడంలో మీ వంతు బాధ్యతను నిర్వర్తించండి'.. అంటూ సజ్జనార్ సందేశాత్మక ట్వీట్‌ను పోస్టు చేశారు. ఇటీవల కాలంలో హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలువురు బెట్టింగ్ యాప్‌లతో ప్రాణాలు తీసుకోగా, వారి కుటుంబాలు చిన్నాభిన్నమైన పరిస్థితులను గుర్తు చేస్తూ ఆయన నేటి యువతరం బెట్టింగ్ యాప్‌ల జోలికి పోవద్దని, ప్రాణాలకు మీదకు తెచ్చుకోవద్దని, కుటుంబాలను రోడ్డుమీద పడవేసుకునేలా చేసుకోవద్దని సూచించారు. కాగా, సజ్జనార్ చేసిన ఈ పోస్టుకు పలువురు మద్దతు తెలిపారు.

నేటి నుంచి రాజీవ్ యువ వికాసం దరఖాస్తులు

- వచ్చేనెల 5 వరకు అవకాశం

హైదరాబాద్, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. వెనుక బడిన తరగతులు, కులాలకు చెందిన నిరుద్యోగ యువత ఈ పథకం కింద ఆర్థిక సాయం పొందడానికి వచ్చేనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ వర్గాలకు చెందిన యువతీ-యువకులకు ఆర్థిక సాయం అందించి ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ పథకం ప్రకటించిందని అందులో పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 17 నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు https://tgobmmsnew. cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సంబంధిత జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిని సంప్రదించాలన్నారు.

మార్ఫింగ్ ఫొటోలతో బెదిరించి.. టెన్త్ విద్యార్థినిపై తోటి విద్యార్థి లైంగిక దాడి

- వారు సన్నిహితంగా ఉన్న వీడియో తీసి.. బాలికను వేధించిన మరో ఇద్దరు విద్యార్థులు
- ముగ్గురు బాలుర అరెస్టు.. హోమ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తనతో పాటు చదువుతోన్న బాలిక ఫొటోలను సేకరించిన తోటి విద్యార్థి పథకం ప్రకారం ఆ ఫొటోలను అశ్లీల చిత్రాలుగా మార్ఫింగ్ చేశాడు. అనంతరం వాటిని ఆ బాలికకు చూపించి తాను చెప్పినట్లు వినకపోతే సామాజిక మాధ్యమాల్లో పెడతానని బెదిరించి ఆమెను లోబర్చుకొని లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారు ఏకాంతంగా ఉన్న సమయంలో వీడియో తీసిన మరో ఇద్దరు విద్యార్థులు బాలికకు ఆ వీడియో చూపించి లైంగికంగా వేధించసాగారు. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఓ పాఠశాలలో 10వ తరగతి చదువుతోన్న బాలుడు అదే తరగతిలోని ఓ బాలికతో స్నేహంగా ఉండేవాడు. ఈ క్రమంలో బాలిక ఫొటోలను సేకరించిన అతడు వాటిని మార్ఫింగ్ చేసి అశ్లీల చిత్రాలుగా మార్చాడు. వాటిని బాలికకు చూపించి తాను చెప్పినట్లు వినాలని లేదంటే ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. వారు ఏకాంతంగా ఉన్న సమయంలో మరో విద్యార్థి వీడియో తీసి దాన్ని తన స్నేహితుడికి పంపాడు. అనంతరం ఆ వీడియోను బాలికకు చూపించి వారిరువురూ బాలికను వేధించసాగారు. బాలిక మనోవేదనను గమనించిన తోటి విద్యార్థినులు.. ఆమె తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు.


నిలువు రాళ్లను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి తదితరులు

నిలువురాళ్లకు 'యునెస్కో తాత్కాలిక జాబితా'లో చోటు!

- దేశంలోని మరో ఐదు ప్రదేశాలతో కలిపి ఎంపిక చేసిన కేంద్రం
- ఆదిమానవుల వారసత్వ సంపద నిలువు రాళ్లు
- యునెస్కో తాత్కాలిక జాబితాలో చోటు గర్వకారణం: జూపల్లి

మహబూబ్‌నగర్/కృష్ణ/హైదరాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నిలువురాళ్లను యునెస్కో వారసత్వ సంపదగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధం చేసింది. దేశంలోని మరో ఐదు ప్రదేశాలతో కలిపి నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని ముడుమాల్‌లో ఉన్న నిలువురాళ్లను కూడా ఎంపిక చేశారు. ఈ నిలువురాళ్లను పురాతన కాలంలో సమయం, వాతావరణ పరిస్థితులను తెలుసుకోవడం కోసం పరిశోధనాలయంగా వినియోగించుకునేవారని పురావస్తు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 1980లో ఇంగ్లండ్‌కు చెందిన అల్చిన్ ద్వారా నిలువురాళ్ల చరిత్ర వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం యునెస్కో గుర్తింపునకు పంపనున్న తాత్కాలిక జాబితాలో చోటు దక్కగా.. శాశ్వత గుర్తింపు వచ్చే వరకు పనిచేస్తామని జై మక్తల్ అధ్యక్షుడు సందీప్ మక్తాలా ఆదివారం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి నిలువురాళ్లను పరిశీలించిన సందర్భంగా తెలిపారు. భారత్ చేసిన ప్రతిపాద నలను పరిశీలించాక యునెస్కో బృందం ఈ ప్రాంతానికి వస్తుంది. ఇక్కడ పరిశోధనలు చేసిన తర్వాత గుర్తింపు ఇచ్చే అవకాశం ఉంటుంది. ఈ నిలువురాళ్లు ఇంగ్లండ్‌లోని వీల్‌షైర్ ప్రాంతంలో ఉన్న స్టోన్‌హెంజ్ తరహాలో ఉన్నాయని భావిస్తుండగా.. వాటికి ఎప్పుడో ప్రపంచ వారసత్వ జాబితాలో చోటు దక్కింది. నిలువురాళ్లకు యునెస్కో గుర్తింపునకు పంపించనున్న తాత్కాలిక జాబితాలో చోటు దక్కడం తెలంగాణకు గర్వకారణమని మంత్రి జూపల్లి అన్నారు. ఈ రాళ్లు ఆదిమానవుల వారసత్వ సంపదగా నిలుస్తున్నా యని చెప్పారు. నాలుగు వేల ఏళ్ల కిందట ఈ నిలువురాళ్ల ద్వారా ఖగోళ విషయాలను, కాలగమనాన్ని తెలుసుకోవడం అద్భుతమని తెలిపారు. యు నెస్కో శాశ్వత గుర్తింపు లభిస్తే ప్రపంచ పటంలో ముడుమాల్ నిలువురాళ్లు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు.

బూతు మాటలు లేకుండా ధిక్కార స్వరం వినిపించలేమా?

- భావ ప్రకటనకు తప్ప బూతుకు స్వేచ్ఛ లేదు
- సోషల్ మీడియాను నియంత్రించాలి
- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి
- బూతులు ఎవరు తిట్టినా తప్పే, అందుకు శిక్షలున్నాయి : జస్టిస్ చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి

పంజాగుట్ట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాహిత్య చరిత్ర, సామాజిక నేపథ్యంలోగానీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లోగానీ బూతు పదం, భాష ఎక్కడా వినలేదు, చూడలేదు, చదవలేదని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ జర్నలిస్టుల సంఘం (టీయూజేఎస్) ఆధ్వర్యంలో "సోషల్ మీడియాలో వాడుతున్న భాష సమంజసమేనా? సోషల్ మీడియాలో పార్లమెంటరీ లాంగ్వేజ్-స్వీయ నియంత్రణ" అనే అంశంపై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. టీయూజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఎం రహమాన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, సీపీఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి, పీవోడబ్ల్యూ కన్వీనర్ వి.సంధ్య, దర్శకుడు రఫీ, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, జర్నలిస్టు సంఘాల నాయకులు తదితరులు పాల్గొని మాట్లాడారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. తాము ప్రత్యేకం, తమకు ప్రత్యేక హక్కులు ఉంటాయని జర్నలిస్టులలో అపోహ ఉందని, అయితే అందరికి ఎలాంటి హక్కులున్నాయో వారికీ అవే ఉన్నాయని తెలిపారు. భావ ప్రకటనకు తప్ప బూతు ప్రకటనకు స్వేచ్ఛలేదన్నారు. సోషల్ మీడియాలో స్వీయ నియంత్రణ ఉండాలని సూచించారు. బూతు మాటలు లేకుండా ధిక్కార స్వరం వినిపించలేమా అని ఆయన ప్రశ్నించారు. సోషల్ మీడియాను తప్పకుండా నియంత్రించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఆశ్రిత పెట్టుబడిదారుల చేతుల్లో ప్రస్తుతం మాధ్యమాలన్నీ బందీకృతమయ్యాయని, చుట్టూ ఒక విషవలయం ఉందని చెప్పారు. అమెరికాలో ఇటీవల ఎన్నికల్లో సామాజిక మాధ్యమం చాలా ప్రభావితం చేసిందన్నారు. ఎలాన్ మస్క్ అమెరికా అధ్యక్షుడినే శాసిస్తున్నారని, తనపై అతని మాధ్యమంలో ఏమి పెడతారోననే భయం ఉందని చెప్పారు. సోషల్ మీడి యాను అదుపులో పెట్టేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు కల్పించడం చాలా ప్రమాదకరమన్నారు. స్వేచ్ఛను ప్రభు త్వాల చేతిలో పెట్టకుండా స్వీయ నియంత్రణలో ఉంచుకో వాలని, బూతు భాషను ప్రయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవా లని సూచించారు. బూతులు రాజకీయ పార్టీలతో ప్రారంభమయ్యాయని, వాటిని నియం త్రించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో తొందరపాటుగా పోస్టింగ్‌లు పెట్టవద్దని సూచించారు. మీడియాలో స్వీయ నియంత్రణ, భాషా నియంత్రణ అవసరమన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. బూతులు ఎవరు తిట్టినా తప్పే, అందుకు శిక్షలున్నాయన్నారు. పత్రికా, భావ ప్రకటన స్వేచ్ఛ ఉండటం వల్లే బతుకుతున్నామని, లేదంటే ఫాసిజం వచ్చేదని చెప్పారు. చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎక్కువగా ఫేక్‌న్యూస్ వేగంగా వ్యాపిస్తోందని, రాజకీయ నాయకుల నోళ్ల నుంచీ బూతుపురాణం వస్తోందన్నారు. సోషల్ మీడియా అదుపు తప్పుతోందని, దాని నియంత్రణ అవసరమన్నారు. మీడియా కౌన్సిల్ ఏర్పాటు కావాలని సూచించారు. రఫీ మాట్లాడుతూ.. ప్రభుత్వాలను దించేది, ఎత్తేది సోషల్ మీడియా అని, అయితే బూతులు మాట్లాడటం సరికాదని తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు పరిష్కార మార్గాలు అన్వేషించాలని, అందుకు మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు సూచించారు. సమావేశంలో టీశాట్ సీఈవో బి.వేణుగోపాల్ రెడ్డి, ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, వివిధ సంఘాల నాయకులు, జర్నలిస్టులు రమణ, మామిడి సోమయ్య, బసవపున్నయ్య, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి వర్గీకరణ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

చట్టబద్ధత కల్పించనుంది. తద్వారా ఆయా వర్గాలన్నింటికీ మేలు జరుగుతుందని సర్కారు భావిస్తోంది. అంతేకాదు.. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రాలే నిర్ణయాలు తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు తీర్పు తరువాత దానిని అమలుచేసిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలవనుంది. వర్గీకరణ బిల్లును సభలో ప్రవేశపెట్టిన అనంతరం ఈ అంశాలతో పాటు మరికొన్నింటిపైనా చర్చించనున్నారు. అలాగే.. బీసీలకు స్థానిక సంస్థలతోపాటు, విద్య, ఉపాధి రంగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించే బిల్లులనూ ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టి చర్చ జరపనుంది. వాటిని ఆమోదించి పార్లమెంటుకు పంపాలని.. కేంద్రం ఒప్పుకోకపోతే జాతీయ స్థాయిలో పోరాటం చేయాలని భావిస్తోంది. స్థానిక సంస్థల్లో, విద్య ఉద్యోగాల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని సుప్రీంకోర్టు తీర్పులు ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై పకడ్బందీగా ముందుకెళ్లే ఉద్దేశంతో రాష్ట్రప్రభుత్వం ఉంది. కాగా.. అసెంబ్లీలో ప్రవేశపెట్టబోయే బీసీ బిల్లుల్లో రిజర్వేషన్లను కేటగిరీలవారీగా కాకుండా గంపగుత్తగా పెంచనున్నట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీల్లోని ఏ కేటగిరీకి 7%, బి కేటగిరీకి 10%, సి కి 1%, డి 7%, ఈ కేటగిరీకి 4% చొప్పున రిజర్వేషన్లు అమల్లో ఉన్న విషయం తెలిసిందే. కాగా.. బీసీ బిల్లులపై చర్చించేందుకు కాంగ్రెస్‌లోని బీసీ సామాజిక వర్గం ఎమ్మెల్యేలతో మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం అసెంబ్లీలో, సభ ప్రారంభం కావడానికి ముందే ప్రత్యేకంగా భేటీ కానున్నారు. సభలో ఈ బిల్లులను ప్రవేశపెట్టడం, సమగ్ర కుల సర్వే, రిజర్వేషన్ల పెంపునకు కేంద్రం నుంచి ఆమోదం తీసుకోవడం సహా పలు అంశాలపై ఈ భేటీలో చర్చించనున్నట్లు తెలిసింది. ఇక.. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. దానికి సంబంధించిన సవరణ బిల్లును కూడా సీఎం రేవంత్ రెడ్డి సోమవారం సభలో ప్రవేశపెట్టనున్నారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.